www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 20-9-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 156 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 9.15 తదుపరి చవితి; నక్షత్రం: అశ్విని రా. 2.43 తదుపరి భరణి; వర్జ్యం: రా. 11.08-12.34; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.19, మ. 12.32-1.20; అమృతఘడియలు: రా. 8.16-9.42; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అజయ్ రికార్డు స్వర్ణం

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్



సువా (ఫిజి): కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో భారత టీనేజ్ వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు రికార్డు స్థాయి ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకొన్నాడు. గురువారం జరిగిన జూనియర్ 81 కిలోల విభాగంలో 19 ఏళ్ల బాబు మొత్తం 326 (147+179) కిలోల బరువు ఎత్తి టాప్‌లో నిలిచాడు. ఈ క్రమంలో జూనియర్ కేటగిరీలో క్లీన్ అండ్ జెర్క్‌లో చాంపియన్‌షిప్ రికార్డును నెలకొల్పాడు. అంతేకాకుండా స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌తోపాటు మొత్తం ఎత్తిన బరువులోనూ జాతీయ జూనియర్ రికార్డును బద్దలుకొట్టాడు. కాగా విజయనగరం జిల్లాకు చెందిన అజయ్ బాబు మధ్యప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.

రికీ, భరత్ అర్ధ శతకాలు

- ఇండియా-డి 306/5
- ఇండియా-బితో దులీప్ ట్రోఫీ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (0) మరోసారి డకౌటైనా.. సంజూ శాంసన్ (89 బ్యాటింగ్)తోపాటు రికీ భుయ్ (56), కేఎస్ భరత్ (52) అర్ధ శతకాలతో చెలరేగడంతో ఇండియా-డి భారీ స్కోరు దిశగా సాగుతోంది. దులీప్ ట్రోఫీలో ఇండియా-బితో గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 306/5 స్కోరు చేసింది.

రావత్ అజేయ శతకం..: మరో మ్యాచ్‌లో శాశ్వత్ రావత్(122 బ్యాటింగ్) సెంచరీతో ఆదుకోవడంతో ఇండియా-ఎ కోలుకొంది. ఇండియా-సితో ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ 224/7 స్కోరు చేసింది. 36/5తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ సమయంలో షామ్స్ ములాని (44)తో కలసి రావత్ వికెట్ల పతనాన్ని అడ్డుకొన్నారు. అయితే, ములానీని అవుట్ చేసిన గౌరవ్.. ఆరో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు.

గిల్మోర్‌కు మాళవిక షాక్

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్



చాంగ్జౌ (చైనా): భారత షట్లర్ మాళవిక బన్సోడ్ చైనా ఓపెన్‌లో సంచలన ప్రదర్శన కొనసాగిస్తోంది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ నెంబర్ 7 గ్రెగోరియా (ఇండోనేసియా)కు తొలి రౌండ్‌లో షాకిచ్చిన 23 ఏళ్ల మాళవిక..ఈసారి క్రిస్టీ గిల్మోర్‌ను కంగుతినిపించింది. ప్రీక్వార్టర్‌ఫైనల్లో బన్సోడ్ 21-17, 19-21, 21-16తో వరల్డ్ నెం.25, రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల పతక విజేత గిల్మోర్ (స్కాట్లాండ్)పై విజయం సాధించింది.

అటు రవి ఇటు రవీంద్ర

అదరగొట్టిన అశ్విన్, జడేజా



రవీంద్ర జడేజా (117 బంతుల్లో 86 బ్యాటింగ్)

- జైస్వాల్ అర్ధసెంచరీ
- నిరాశపర్చిన టాపార్డర్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 339/6
- పేసర్ హసన్‌కు నాలుగు వికెట్లు

చెన్నై: బంగ్లాదేశ్‌తో మొదలైన తొలి టెస్టులో లోకల్ బాయ్ రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102 బ్యాటింగ్), రవీంద్ర జడేజా (117 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 86 బ్యాటింగ్) బ్యాటుతో వహ్వా అనిపించారు. అదరగొడతారనుకున్న స్టార్ బ్యాటర్లంతా బంగ్లా పేస్ ధాటికి టపటపా పెవిలియన్‌కు చేరిన వేళ.. ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా దిగిన అశ్విన్ ఎదురుదాడి చేసి.. కెరీర్‌లో ఆరో శతకం పూర్తిచేశాడు. 144/6 స్కోరుతో జట్టు ఇబ్బందిపడుతున్న దశలో వన్డే తరహాలో అశ్విన్ ఆడిన తీరుకు పరుగులు చకచకా సమకూరగా.. అవతలి ఎండ్‌లో మరో 'లోకల్ బాయ్' (సీఎస్‌కే) రవీంద్ర జడేజా చక్కటి సహకారమందించాడు. ఈ ఇద్దరు ఆల్‌రౌండర్ల నిలకడైన బ్యాటింగ్‌తో టీమిండియా మెరుగైన స్థితిలో నిలిచింది. ఫలితంగా తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లకు 339/6 స్కోరు సాధించింది. అశ్విన్-జడ్డూ కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 195 పరుగుల భాగస్వామ్యం అందించడం విశేషం. ఇతర బ్యాటర్లలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (56), రిషభ్ పంత్ (39) మాత్రమే ఆకట్టుకున్నారు. బంగ్లా పేసర్ హసన్ మహమూద్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. తొలి రోజు స్పిన్నర్లు ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగారు.

ఆరంభంలోనే టపటపా

ఆకాశం మేఘావృతంగా ఉండడంతోపాటు పిచ్ కూడా సీమర్లకు అనుకూలించే అవకాశాలు కన్పించడంతో టాస్ గెలిచిన బంగ్లా బౌలింగ్ ఎంచుకుంది. దీనికి తగ్గట్టుగానే ఆ జట్టు పేసర్లు హసన్, నహీద్ భారత స్టార్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. ముఖ్యంగా హసన్ తన వరుస ఓవర్లలో కెప్టెన్ రోహిత్ (6), గిల్ (0), విరాట్ (6)ల పనిబట్టడంతో భారత్‌కు 34/3 స్కోరుతో ఝలక్ తగిలింది. అయితే ఓపెనర్ జైస్వాల్, పంత్ ఈ దశలో హసన్‌ను దీటుగా ఎదుర్కొని మరో వికెట్ కోల్పోకుండా లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. సుదీర్ఘ విరామం తర్వాత టెస్టు ఆడుతున్న పంత్ ఆరు ఫోర్లతో రాణించాడు. అయితే ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. రెండో సెషన్ ఆరంభంలోనే ఓ పేలవ షాట్‌తో పంత్.. హసన్ ఓవర్‌లో అవుటయ్యాడు. నాలుగో వికెట్‌కు వీరు 62 పరుగులు జోడించారు. అటు ఎటాకింగ్‌తోపాటు డిఫెన్సివ్ ఆటతీరుతో ఆకట్టుకున్న జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్పిన్నర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో తనతోపాటు రాహుల్ (16) జాగ్రత్తగా ఆడడంతో రన్స్ నెమ్మదించాయి. ఈ దశలో జైస్వాల్‌ను పేసర్ రాణా, రాహుల్‌ను స్పిన్నర్ మెహిదీ హసన్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో 145/6తో భారత్ తడబడినట్టు కనిపించింది. అయితే వచ్చీరావడంతోనే అశ్విన్ ఫోర్లతో బ్యాట్‌కు పనిచెప్పాడు.

ఆదుకున్న అశ్విన్-జడ్డూ

తొలి రెండు సెషన్లలో క్రమశిక్షణాయుత బౌలింగ్‌తో బంగ్లా బౌలర్లు ఆరు వికెట్లు తీసి ఆధిపత్యం చూపారు. దీంతో పరుగుల వేటలో భారత్ పూర్తిగా వెనుకబడిపోయింది. కానీ ఆ లోటును స్పిన్ ఆల్‌రౌండర్లు అశ్విన్, జడ్డూ తీర్చారు. ఆఖరి సెషన్‌లో 163 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలోనే జడేజా భారీ సిక్సర్‌తో ప్రత్యర్థికి హింట్ ఇచ్చాడు. 52వ ఓవర్‌లో అశ్విన్ రెండు ఫోర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లోనే జడేజా ఫోర్, అశ్విన్ సిక్స్‌తో ధారాళంగా పరుగులు వచ్చాయి. జట్టు స్కోరు కూడా 200 దాటింది. ఈ ధాటికి అశ్విన్ 58 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ తర్వాత కూడా ఏమాత్రం తగ్గకుండా నిఖార్సయిన షాట్లతో విరుచుకుపడ్డాడు. జడ్డూ సైతం అతడికి చక్కగా సహకరిస్తూ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ చివర్లో ఇద్దరూ భారీ షాట్లతో మరింత జోరును ప్రదర్శించారు. 75వ ఓవర్‌లో జడ్డూ వరుసగా 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక కాసేపటికే అశ్విన్ కెరీర్‌లో ఆరో సెంచరీతో అజేయంగా నిలిచి రోజును పూర్తి చేశాడు.



రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 102 బ్యాటింగ్)

1

147 ఏళ్ల టెస్టు చరిత్రలో స్వదేశంలో ఆడిన తొలి పది ఇన్నింగ్స్‌లోనే ఎక్కువ రన్స్ (768) చేసిన బ్యాటర్‌గా జైస్వాల్. 89 ఏళ్లుగా ఈ రికార్డు జార్జి హెడ్లీ (747) పేరిట కొనసాగింది. అలాగే స్వదేశంలో మొదట ఆడిన ఆరు టెస్టుల్లోనూ అర్ధ సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా జైస్వాల్. రూసీ మోదీ (5)ని అధిగమించాడు.

టెస్టుల్లో 50+ పరుగులు, 5+ వికెట్లు 20 సార్లు సాధించిన తొలి ప్లేయర్‌గా అశ్విన్. అలాగే స్వదేశీ టెస్టుల్లో ఎనిమిదో నెంబర్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (7) చేసి కపిల్‌దేవ్‌తో సమంగా నిలిచాడు. అంతేకాకుండా చెపాక్‌లో వరుసగా రెండు శతకాలు బాది సచిన్ (3) తర్వాత నిలిచాడు.

బంగ్లాదేశ్‌పై 7+ వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (195) అందించిన భారత జోడీగా అశ్విన్-జడేజా. అలాగే చెపాక్ మైదానంలో ఈ వికెట్‌కు ఏ జట్టుపై అయినా ఇదే అత్యధికం.

ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దిగి ఎక్కువ సెంచరీ (4)లు బాదిన రెండో బ్యాటర్‌గా అశ్విన్. డానియెల్ వెటోరి (5) ముందున్నాడు.

2

2000 నుంచి భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజే 4+ వికెట్లు తీసిన రెండో పేసర్‌గా హసన్ మహమూద్. డేల్ స్టెయిన్ (2008లో 5/23) గతంలో ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షాద్‌మన్ (బి) నహీద్ 56; రోహిత్ (సి) షంటో (బి) హసన్ 6; గిల్ (సి) లిట్టన్ (బి) హసన్ 0; విరాట్ (సి) లిట్టన్ (బి) హసన్ 6; పంత్ (సి) లిట్టన్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జకీర్ (బి) మెహిదీ హసన్ 16; జడేజా (బ్యాటింగ్) 86; అశ్విన్ (బ్యాటింగ్) 102; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 80 ఓవర్లలో 339/6. వికెట్ల పతనం:** 1-14, 2-28, 3-34, 4-96, 5-144, 6-144; **బౌలింగ్:** టస్కిన్ అహ్మద్ 15-1-47-0; హసన్ మహమూద్ 18-4-58-4; నహీద్ రాణా 17-2-80-1; మెహిదీ హసన్ మిరాజ్ 21-2-77-1; షకీబ్ అల్ హసన్ 8-0-50-0; మోమినుల్ హక్ 1-0-4-0.

జడేజాతో సమంగా..

అజేయ శతకంతో అదరగొట్టిన రవి అశ్విన్ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో అరుదైన రికార్డును నెలకొల్పాడు. డబ్ల్యూటీసీలో వెయ్యి పరుగులు, 100+ వికెట్లు పూర్తి చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో జడేజా మొదట ఈ ఫీట్ (1637 రన్స్, 102 వికెట్లు)ను సాధించాడు. అలాగే అశ్విన్ తాజా టెస్టులో 5 వికెట్లు తీస్తే డబ్ల్యూటీసీలో ఎక్కువసార్లు (11) ఈ ఫీట్ సాధించిన బౌలర్‌గా నాథన్ లియాన్ (10సార్లు)ను అధిగమిస్తాడు.

అశ్విన్ కట్ షాట్‌కు గౌతీ షాక్





బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ అశ్విన్ ఆడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా తన షాట్ల ఎంపిక అటు డగౌట్‌లో కూర్చున్న కోచ్ గంభీర్‌ను కూడా ఆశ్చర్యపరిచింది. 44వ ఓవర్‌లో 144.2కి.మీ వేగంతో పేసర్ నహీద్ రాణా వేసిన షార్ట్ వైడ్ బాల్‌ను కట్ షాట్‌తో ఫోర్‌గా మలిచిన తీరుకు గౌతీ ఫిదా అయ్యాడు. ఆ సమయంలో అతడి ముఖ కవళికలు వైరల్‌గా మారాయి. అటు కామెంటేటర్లు కూడా దీన్ని 'షాట్ ఆఫ్ ది డే'గా అభివర్ణించారు.

చెన్నైలో ఆడడం ఎప్పటికీ మధురమే..

'సొంత అభిమానుల మధ్య ఆడడం ఓ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఈ మైదానంలోనే నేను క్రికెట్‌ను ఆరాధించింది. ఇక్కడ నాకెన్నో అద్భుత జ్ఞాపకాలున్నాయి. చివరి టెస్టులోనూ శతకం బాదాను. టీఎన్‌పీఎల్‌లో ఆడడం బ్యాటింగ్‌లో ఉపకరించింది. ఇది పాతకాలపు చెన్నై పిచ్. స్పిన్ బంతుల్లో సహజంగానే కాస్త బౌన్స్ కనిపిస్తుంటుంది. ఈసారీ అలాగే జరిగింది. రెండో రోజు కొత్త బంతి వారికి సహకరిస్తుందేమో చూడాలి. నేను అలసటగా ఉన్నప్పుడు మరో ఎండ్ నుంచి జడేజా అద్భుత సహకారం అందించాడు' - అశ్విన్

'టాప్'లోనే పురుషుల జట్టు

ఎనిమిదో రౌండ్‌లోనూ విజయం

మహిళలకు తొలి ఓటమి.. చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: స్వర్ణ పతకమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్ బరిలో దిగిన భారత పురుషుల జట్టు ఆ దిశగా దూసుకుపోతోంది. అపజయమే ఎరుగకుండా ఎనిమిదో రౌండ్‌నూ ముగించింది. గురువారం జరిగిన ఈ రౌండ్‌లో రెండో సీడ్ పురుషుల జట్టు 3.5-0.5 స్కోరుతో ఇరాన్‌ను ఓడించింది. అయితే టాప్ సీడ్ మహిళల జట్టు టోర్నీలో తొలి ఓటమి చవిచూసింది. పోలెండ్ మహిళలు 2.5-1.5తో మనోళ్లకు షాకిచ్చారు. పురుషుల విభాగంలో అర్జున్ ఇరిగేసి 36 ఎత్తుల్లోనే దనేశ్వర్ బర్దియాను చిత్తు చేశాడు. గుకేష్-మగ్‌సోద్లో పర్హమ్‌పై, విదిత్ గుజ్‌రాతీ-ఇదానీ పౌయా విజయం సాధించారు. అయితే తబతబేయి అమీన్‌తో జీఎం ప్రజ్ఞానంద పాయింటును పంచుకున్నాడు. ఈ రౌండ్ తర్వాత 16 పాయింట్లతో పురుషుల జట్టు టాప్‌లో కొనసాగుతోంది. మహిళల్లో..తొలి గేమ్‌లో సోకోమోనికపై వైశాలీ ఓడిపోయింది. దాంతో మనోళ్లు 0-1తో వెనుకంజలో నిలవగా..నల్లపావులతో ఆడిన దివ్య దేశ్‌ముఖ్-అలెక్సాండ్రాపై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. హారిక..కషిన్‌స్కయా చేతిలో ఓడడంతో పోలెండ్ మళ్లీ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఇక..నిర్ణాయక ఆఖరి గేమ్‌ను అలిక్జాతో వంతిక అగర్వాల్ డ్రా చేయడంతో పరాజయం తప్పలేదు. ఈ రౌండ్ అనంతరం మహిళల జట్టు పోలెండ్, కజకిస్థాన్‌తో కలిసి 14 పాయింట్లతో నిలిచింది. అయితే మెరుగైన టై బ్రేకర్‌తో టాప్‌లోనే నిలిచింది.

బిజినెస్

మార్కెట్‌కు ఫెడ్ బూస్ట్



ముంబై: అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించడం ఈక్విటీ మార్కెట్లకు ఊత్సాహాన్నిచ్చింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడంతో గురువారం దేశీయ ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 825.38 పాయింట్లు ఎగబాకి 83,773.61 వద్ద ఆల్ టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణ కారణంగా చివరికి 236.57 పాయింట్ల లాభంతో 83,184.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఉదయం 234.4 పాయింట్ల వృద్ధితో 25,611.95 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసినప్పటికీ, చివరికి 38.25 పాయింట్ల లాభంతో 25,415.80 వద్ద క్లోజైంది.

- ఎన్‌టీపీసీ షేరు 2.45 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.06 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.53 శాతం తగ్గాయి.
- భారత కరెన్సీ రెండు నెలల గరిష్ఠ స్థాయికి పెరిగింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పెరిగి 83.65 వద్ద ముగిసింది.

ఐపీఓ సమాచారం

- ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓకు చివరి రోజు నాటికి 106.40 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించగా.. నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్ ఇష్యూకు 110.71 రెట్ల బిడ్లు వచ్చాయి. వెస్టర్న్ క్యారియర్ ఆఫర్ 30.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.
- కోల్‌కతాకు చెందిన ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్స్ గ్యాసెస్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.400 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.44 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

బ్రిటన్‌లో వడ్డీ రేట్లు యథాతథం

లండన్: వడ్డీరేట్లను యథాతథంగా ఐదు శాతం వద్ద కొనసాగించాలని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) నిర్ణయించింది. ఆగస్టు నెల రిటైల్ ద్రవ్యోల్బణం 2.2 శాతంగా ఉన్న నేపథ్యంలో ఈ చర్య తీసుకుంది. ఇది మరింత తగ్గే వరకు వడ్డీరేట్ల తగ్గింపుపై తొందరపడకూడదని బీఓఈ నిర్ణయించింది.

దీపావళి నాటికి బంగారం 78000?

- ఫెడ్ రేటు కోత ప్రభావం
- మున్ముందు మరింత ప్రియం!



వెండి @ రూ.91,000

న్యూఢిల్లీ: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలో రాబోయే కాలంలో బంగారం ధరలు చుక్కలనంటవచ్చునని విశ్లేషకులంటున్నారు. అమెరికన్ ఫెడరల్ బుధవారం వడ్డీరేటును 0.50 శాతం పెంచడంతో పాటు ఈ ఏడాది చివరినాటికి మరో అర శాతం, 2025లో ఒక శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఆల్‌టైం గరిష్ఠాల వద్ద ట్రేడవుతోంది. ఇది స్వల్పకాలికంగా దిద్దుబాటుకు లోనయ్యే అవకాశాలున్నప్పటికీ.. రాబోయే కాలంలో మాత్రం ధరలు మరింత ఎగబాకనున్నాయని బులియన్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ దీపావళి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,650 డాలర్ల స్థాయికి, దేశీయంగా తులం బంగారం రూ.78,000 స్థాయికి చేరుకోవచ్చని కామ జువెలర్స్ ఎండీ కోలిన్ షా అంటున్నారు.

ఫెడ్ రేటు తగ్గితే బంగారం పైకే...

సాధారణంగా ఫెడ్ రేట్లు, బులియన్ ధరలది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్నప్పుడు విలువైన లోహాల ధరలు తగ్గుతాయి. ఫెడ్ రేట్ల తగ్గుదల సమయంలో బులియన్ ధరలు ఎగబాకుతాయి. ఫెడ్ దూకుడుగా వడ్డీరేట్లను తగ్గిస్తే గనుక, వచ్చే ఏడాది జూన్ నాటికి ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్ల స్థాయికి చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఇదిలా ఉండగా దేశీయ మార్కెట్లో గురువారం బులియన్ రేట్లు మరింత ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 పెరుగుదలతో రూ.75,650కి చేరుకుంది. కిలో వెండి రూ.500 పెరిగి రూ.91,000 ధర పలికింది. ఫెడ్‌రేట్లు తగ్గడంతో అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. ఇందుకు తోడు దేశీయంగా ఆభరణాల వర్తకులు వీటి కొనుగోళ్లు పెంచడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. అయితే, రూపాయి బలోపేతం దేశీయంగా బులియన్ ర్యాలీని పరిమితం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒకదశలో 0.45 శాతం పెరిగి ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 2,610.20 డాలర్ల వద్ద ట్రేడైంది. వెండి సైతం 2.58 శాతం వృద్ధితో 31.48 డాలర్లకు చేరుకుంది.



హైదరాబాద్‌లో అల్ట్రా వయొలెట్ స్పేస్ స్టేషన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ బైక్‌ల తయారీలోని అల్ట్రా వయొలెట్ హైదరాబాద్‌లో స్పేస్ స్టేషన్‌ను (షోరూమ్) ప్రారంభించింది. ఇప్పటికే ఇతర నగరాల్లో తాము విక్రయిస్తున్న ఎఫ్77 మాక్ 2 బైక్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రమణియం మాట్లాడుతూ బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న తమ కంపెనీ విక్రయాలు ప్రారంభించిన ఐదో నగరం హైదరాబాద్ అని చెప్పారు. శుక్రవారం ముంబైలో రేసింగ్ సూపర్ బైక్ ఎఫ్99ని ఆవిష్కరించనున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే రెండుమూడేళ్ల కాలంలో మరిన్ని కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని 10 నగరాలకు విస్తరించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. అలాగే వచ్చే నెలలో యూరోపియన్ మార్కెట్లోకి కూడా తాము ప్రవేశించనున్నట్టు నారాయణ్ తెలిపారు. ఎఫ్ 77 బైక్ ఒక సారి పూర్తిగా చార్జి చేసినట్టయితే 323 కిలోమీటర్లు నడుస్తుందన్నారు. ఇది రెండు వేరియెంట్లలో అందుబాటులో ఉంటుందంటూ 7 కిలోవాట్ బైక్ ధర రూ.2.99 లక్షలని, 10 కిలోవాట్ బైక్ ధర రూ.3.99 లక్షలని ఆయన వెల్లడించారు. ఈ బైక్ గంటకు 155 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందంటూ ఎఫ్ 99 బైక్ గంటకు 265 కిలోమీటర్ల వేగం కలిగి ఉంటుందని చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,450 ▼	68,250 ▼	96,000 ▼
ముంబై	73,480 ▲	67,310 ▲	88,420 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

ఫ్రియర్ ఎనర్జీ నుంచి 'ఎక్స్‌పీరియన్స్' సెంటర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నివాస గృహాలు, ఎంఎస్ఎంఈలకు రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలు సరఫరాచేసే 'ఫ్రియర్ ఎనర్జీ' తన సేవలను మరింత విస్తరిస్తోంది. ఇందులో బాగంగా శనివారం కరీంనగర్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుచేస్తోంది. వచ్చే నెల విశాఖపట్టణం, విజయవాడల్లోనూ ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కంపెనీ ఎండీ సౌరభ్ మర్దా చెప్పారు. వచ్చే రెండేళ్లలో తాము పని చేస్తున్న ఆరు రాష్ట్రాల్లోని 48 నగరాలకు ఈ కేంద్రాలను విస్తరిస్తామన్నారు. ఈ ఎక్స్‌పీరియన్స్ కేంద్రాల్లో కంపెనీ ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలకు సంబంధించిన అన్ని సేవలు ఒకేచోట లభ్యమవుతాయి. తమ ఇంటిపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయాలనుకునే వ్యక్తులు, సంస్థలు ఈ కేంద్రాల ద్వారా లేదా యాప్ ద్వారా తమను సంప్రదిస్తే ప్రభుత్వ సబ్సిడీ, రుణాలు మొదలుకుని అన్ని రకాల సేవలు అందిస్తామని సౌరభ్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం రూ.100 కోట్లున్న తమ టర్నోవర్ ఈ ఆర్థిక సంవత్సరం రెట్టింపు అవుతుందని ఆశిస్తున్నట్టు కంపెనీ కొ-ఫౌండర్, డైరెక్టర్ రాధికా చౌదరి తెలిపారు. ఐదేళ్ల వారెంటీతో తమ రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ లభిస్తాయన్నారు.

తమిళనాడులో ఆచ్చి మసాలా కొత్త ఫ్యాక్టరీ



చెన్నై (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల రంగంలోని ఆచ్చి మసాలా తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరపేట సమీపంలో కొత్త ఫ్యాక్టరీని ప్రారంభించింది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఫ్యాక్టరీని ప్రారంభించినట్టు కంపెనీ చైర్‌పర్సన్ ఏడీ పద్మసింగ్ ఐజాక్ తెలిపారు. ఢిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 సదస్సు సందర్భంగా తాము ఈ ఫ్యాక్టరీని ప్రారంభించినట్టు ఆమె చెప్పారు. రెండున్నర దశాబ్దాలకు పైగా ఆహార, మసాలా వస్తువుల తయారీలో పేరెన్నిక గన్న ఆచ్చి మసాలా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ 65 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతిచేస్తోందని ఆమె తెలిపారు. తమ సంస్థ 220 రకాల ఆహారవస్తువులను తయారు చేసి, 15 లక్షల దుకాణాల ద్వారా దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. తమ సంస్థలన్నింటిలోనూ అత్యధికంగా మహిళలే పనిచేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం పీఎల్ఐ పథకం ద్వారా రూ. 150 కోట్ల ప్రాజెక్టు తమకు అందించడమే కాకుండా రూ.80 కోట్ల వరకు సబ్సిడీని ఇచ్చిందన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటైన రెండు ఫ్యాక్టరీలలో అదనంగా 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. వచ్చే మూడేళ్లలో రూ.80 కోట్లు పెట్టుబడి పెట్టనున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని పాండియన్ తెలిపారు.

భారత్‌లో మరిన్ని నియామకాలు: సేల్స్‌ఫోర్స్

శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా): కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం) సేవల రంగంలో ఉన్న సేల్స్‌ఫోర్స్ భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్, బెంగళూరుల్లోని కేంద్రాలను మరింత విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకోసం మరిన్ని నియామకాలు చేపట్టనున్నట్టు సేల్స్‌ఫోర్స్ ఇండియా చీఫ్ అరుంధతీ భట్టాచార్య చెప్పారు. అయితే ఎంత మందిని తీసుకునేదీ ఆమె వెల్లడించలేదు. గత రెండేళ్లలోనే భారత్‌లో తమ ఉద్యోగుల సంఖ్య రెట్టింపు పైగా పెరిగి 13,000 దాటిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇన్నొవేషన్ హబ్‌ల అభివృద్ధి కోసం మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్టు సేల్స్‌ఫోర్స్ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ శ్రీని తల్లాప్రగడ తెలిపారు.

బ్రాండ్ విలువలో టీసీఎస్ టాప్

న్యూఢిల్లీ: భారత్‌లో టాప్-75 బ్రాండ్ల విలువ 40,050 కోట్ల డాలర్లకు (సుమారు రూ.37.68 లక్షల కోట్లు) చేరినట్టు గురువారం వెలువడిన కాంటార్ బ్రాండ్జ్ నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ. ఈ బ్రాండ్లలో ఐటీ దిగ్గజం టీసీఎస్ 4,970 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,15,740 కోట్లు) వాల్యుయేషన్‌తో అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. కాంటార్ బ్రాండ్జ్ నివేదికలో టీసీఎస్ అగ్రస్థానంలో నిలబడడం వరుసగా ఇది మూడో ఏడాది. టీసీఎస్ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ దేశంలో అత్యంత విలువైన బ్రాండ్లుగా నిలిచాయి. ఈ ఏటి టాప్-75 వాల్యుబుల్ బ్రాండ్లలో ఆర్థిక సేవల రంగానికి చెందిన కంపెనీల బ్రాండ్లు 17 ఉన్నాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 20-9-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

గోవాలో జానీ మాస్టర్ అరెస్టు



నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన జానీమాస్టర్ భార్య ఆయేషా

12

ఇదేం ఘోరం గోవిందా!

శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు.. నిజం

భక్తుల ఇష్ట ప్రసాదం భారీగా కల్తీ.. తిరుమలనూ వదలని వైసీపీ భ్రష్టత్వం





కలియుగ దైవం వేంకటేశ్వరుడికి ముడుపు కడితే కోరికలు నెరవేరతాయని తరతరాల నమ్మిక. ఇష్ట దైవానికి నిలువు దోపిడీ ఇచ్చుకుని, అమిత ఇష్టంగా లడ్డూ ప్రసాదం స్వీకరిస్తుంటారు. కానీ, ఆ దైవాన్ని సైతం నిలువు దోపిడీ చేసి... ఇష్ట లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని వాడి ఘోర అపచారానికి పాల్పడటం ఇప్పుడు భక్తకోటిని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఐదేళ్లూ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన గత వైసీపీ ప్రభుత్వ భ్రష్టత్వం... తిరుమల స్వామినీ వదలకపోవడం వారిని నివ్వెరపరుస్తోంది. 'ఇదేం ఘోరం గోవిందా!' అంటూ అశేష భక్త కోటి ఆవేదన చెందుతోంది.

- లడ్డూ తయారీకి నాసిరకం నెయ్యి
- దానిలో జంతువుల కొవ్వు కలిపినట్టు తేల్చిన కేంద్ర ప్రభుత్వ లేబొరేటరీ
- ఐదేళ్లూ తిరుమలలో అపచారాల పర్వం
- నెయ్యి నాణ్యతపైనే తొలినుంచీ అనుమానాలు
- కర్ణాటక నందినీ నెయ్యి అర్ధంతరంగా నిలిపివేత..
- ఐదు కంపెనీలకు 'రివర్స్'లో కాంట్రాక్టు
- నాణ్యత, రుచి అప్పటినుంచే లేవని భక్తుల గగ్గోలు
- ఆ కంపెనీల నెయ్యిలోనే బయటపడ్డ జంతువుల కొవ్వు
- వ్యవస్థల ప్రక్షాళనను టీటీడీతో మొదలుపెట్టిన బాబు
- ఈ క్రమంలోనే నెయ్యి పరీక్షలకు.. భారీగా కల్తీ నిర్ధారణ
- నందినీ నెయ్యి పునరుద్ధరణ
- శ్రీవారి ప్రసాదాల నాణ్యత మెరుగుకు గట్టిచర్యలు

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శ్రీవారి లడ్డూ ప్రసాదమంటే ఎంతో ప్రీతిపాత్రంగా భావిస్తుంటారు. హిందూ భక్తులకు అది అత్యంత ఇష్ట ప్రసాదం. అలాంటి పవిత్రమైన ప్రసాదంలో ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు పదార్థాలతో కల్తీ అయిన నెయ్యిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వినియోగించారని తేలడం శ్రీవారి భక్తకోటిని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదం రుచి తగ్గిందన్న విమర్శలు, ఆరోపణలు మొదలయ్యాయి. తర్వాత ఇతర అన్న ప్రసాదాల విషయంలోనూ అవే తరహా ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అదే సమయంలో ఎంతోకాలంగా

మిగతా 11వ పేజీలో...

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు

ఇదిగో ఆధారం

కేంద్ర ప్రభుత్వ లేబొరేటరీ నివేదిక చూపిన ఆనం

ఆ నెయ్యిలో చేప నూనె, గొడ్డు కొవ్వు, పంది కొవ్వు, మైదానూ కలిపారు

కమీషన్లకు కక్కుర్తిపడే వైసీపీ నేతల అక్రమాలు

అవును.. ఆ నాలుగేళ్లూ మా నెయ్యి కొనలేదు

2020 నుంచి మేం సరఫరా చేయలేదు

టీడీపీ వచ్చాకే మళ్లీ నందినీ నెయ్యి సరఫరా

కేఎంఎఫ్ చైర్మన్ ధ్రువీకరణ

బాధ్యులపై కఠిన చర్యలు



- గత ప్రభుత్వంలో తిరుమల అపవిత్రం
- భక్తుల మనోభావాలను దెబ్బతీశారు
- జంతు సంబంధిత పదార్థాలు ఏవి వాడారో నివేదికలు చెబుతున్నాయి
- ప్రక్షాళన ప్రారంభించాం: చంద్రబాబు

ఆ నీచులెవరో తేల్చండి

తిరుమల అపవిత్రతపై సీబీఐ విచారణ జరిపించాలి

సీఎం చంద్రబాబుకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

11

జంతువుల కొవ్వు వినియోగం హేయం: బీజేపీ

దేవుడి జోలికొస్తే సర్వనాశనమవుతారు: లోకేశ్



రాజేంద్రనాథ్‌రెడ్డి

విశాల్ గున్నీ

జెత్వానీ ఐఫోన్లు హ్యాక్!

గత ప్రభుత్వంలో పోలీసుల నిర్వాకం

దుబాయ్ హ్యాకర్‌ను తీసుకొచ్చినట్టు సందేహాలు

తాజాగా సంచలన విషయాలు వెలుగులోకి

- అరెస్ట్ చేశాక 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- సజ్జన్‌ను కాపాడేందుకు ఆధారాలు చెరిపేసేయత్నం
- పాస్‌వర్డ్‌లు చెప్పాలని ఒత్తిడి
- వెబ్‌బ్రౌజర్ ద్వారా లాగిన్
- 'యాపిల్' నుంచి జెత్వానీ మెయిల్‌కు మెసేజ్‌లు
- నివేదికలో నాటి డీజీపీ పేరు
- ఆయన అనుమతితోనే ముంబైకి విశాల్ గున్నీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో సంచలన విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. గత ప్రభుత్వంలో పోలీసులు ఈ వ్యవహారంలో తప్పుల మీద తప్పులు చేశారు. అవే ఇప్పుడు వారి మెడకు చుట్టుకున్నాయి. కాదంబరి జెత్వానీ, ఆమె తల్లిదండ్రులు ఆశా జెత్వానీ, నరేంద్రకుమార్ జెత్వానీ వాంగ్మూలాలతో తయారైన నివేదికలో కీలక అంశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో ప్రధానమైనది కాదంబరి ఐఫోన్లను హ్యాక్ చేయడం. ముంబైలో ఫిబ్రవరి 3వ తేదీన జెత్వానీ

మిగతా 12వ పేజీలో...

న్యాయం చేయండి

- నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి
- విద్యాసాగర్ పెట్టిన అక్రమ కేసు ఎత్తేయండి
- హోం మంత్రి అనితకు నటి జెత్వానీ వినతి

వ్యక్తిగత అవసరాలకు
ఇసుక పూర్తి ఉచితం



ఉచిత ఇసుక విధానంపై పోర్టల్‌ను ప్రారంభించి, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర

- వాగులు, వంకల నుంచి సమీప గ్రామాల ప్రజలు తీసుకెళ్లొచ్చు: ముఖ్యమంత్రి
- వారిని అధికారులు ఇబ్బందిపెట్టకూడదు
- ఇదే సమయంలో అక్రమ రవాణాకు చెక్
- విజిలెన్స్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి
- ఇసుక పోర్టల్‌ను ఆవిష్కరించిన సీఎం

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యక్తిగత అవసరాల కోసం వాగులు, వంకల నుంచి ఇసుకను పూర్తిగా ఉచితంగా తీసుకెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఉచిత

మిగతా 12వ పేజీలో...

నేటి నుంచే 'ఇది మంచి ప్రభుత్వం'

- వారం పాటు నిర్వహణ.. వంద రోజుల పాలనలో సాధించిన విజయాలపై ప్రజల్లోకి
- తీసుకున్న జనహిత నిర్ణయాలూ వెల్లడి.. రోజుకో గ్రామానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు
- నేడు ప్రకాశంలో పాల్గొననున్న సీఎం.. వాతావరణం బాగోక సిక్కోలు టూరు రద్దు

ప్రజా పోలీసింగ్ మా లక్ష్యం



'ఆంధ్రజ్యోతి'తో హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- సిబ్బంది నియామకం.. టెక్నాలజీకి ప్రాధాన్యం
- ప్రతి జిల్లాకు సైబర్ స్టేషన్.. కమాండ్ కంట్రోల్
- గంజాయిని కూకటి వేళ్లతో పెకిలించి వేస్తాం
- మహిళల రక్షణ, నేరస్థులకు శిక్షపై ప్రత్యేక దృష్టి
- అక్రమ అరెస్టులు చెయ్యం.. తప్పుడు కేసులు పెట్టం
- కాదంబరి జెత్వానీ కేసులో అరెస్టులు ఉంటాయి
- తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టం

10

రోడ్డు ప్రమాదాలకు బ్రేకులు



'ఆంధ్రజ్యోతి'తో రవాణా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

- వాటి కట్టడికి పోలీసు, ఆర్టీఏ ఉమ్మడి చర్యలు
- వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఆర్టీసీకి కొత్త బస్సులు
- 1400 డొక్కు బస్సులు పక్కనబెట్టి వాటి స్థానంలో కొత్తవి
- ఇప్పటి వరకూ 650.. త్వరలోనే మిగతావీ వస్తాయ్
- విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యం, కేంద్రం ఇచ్చేవి తెస్తాం
- రవాణా శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం

వైసీపీకి బాలినేని, ఉదయభాను
గుడ్‌బై



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన మాజీ మంత్రి బాలినేని

జగన్‌కు షాకిచ్చిన సన్నిహితులు.. పవన్‌తో వేర్వేరుగా భేటీ

- పవన్ ఆదేశాల మేరకు నడుచుకుంటా
- అక్టోబరు 4న జనసేనలో చేరతా
- పార్టీలోకి వచ్చేందుకు ప్రకాశం వైసీపీ ఎమ్మెల్యేలూ రెడీ!
- వైసీపీలో నేను ఎన్నోసార్లు ఏడ్చిన రోజులున్నాయి
- జగన్ విశ్వసనీయత బూటకం
- నమ్మిన నేతలను వంచించారు: బాలినేని
- వైసీపీ పరిస్థితి దారుణంగా ఉంది
- మనసుకు కష్టం కలిగినందునే వీడా
- 22వ తేదీన జనసేనలో చేరుతున్నా: ఉదయభాను

అమరావతి/ఒంగోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆయన సన్నిహితులు గట్టి షాకే ఇచ్చారు. మాజీ మంత్రి, ఆయన సమీప బంధువు బాలినేని శ్రీనివాసరెడ్డి, అత్యంత ఆత్మీయుడిగా మెలిగిన జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వైసీపీకి గుడ్‌బై చెప్పారు. గురువారం వారు వేర్వేరుగా విజయవాడలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో సమావేశమై చర్చలు జరిపారు. వారిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. అక్టోబరు 4న చేరతానని బాలినేని ప్రకటించగా.. ఈ నెల 22వ తేదీన తాను చేరుతున్నట్లు ఉదయభాను తెలిపారు. పవన్‌తో భేటీ అనంతరం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. తానెలాంటి డిమాండ్లూ పెట్టకుండా బేషరతుగా చేరుతున్నానని బాలినేని చెప్పారు. మంచి రోజు చూసుకుని పార్టీలో చేరతానని, పవన్‌కు వీలైతే అక్టోబరు 4న ఒంగోలులో సభ ఏర్పాటు చేసి పార్టీలో చేరే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమంలో ప్రకాశం జిల్లాలోని తన అనుచరులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు కూడా చేరతారని చెప్పారు. ప్రకాశం జిల్లాలోని ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్‌ను వీడి రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధిష్ఠానం ఆదేశిస్తే పార్టీలోకి వచ్చే నాయకులతో మాట్లాడతానన్నారు. జగన్ విశ్వసనీయత బూటకమని.. ఆ పేరుతో

మిగతా 12వ పేజీలో...



అమరావతిలో మెగా వాకింగ్ ట్రాక్

12

భారత విద్యార్థులకు కెనడా షాక్!

వచ్చే ఏడాది స్టడీ పర్మిట్లలో 10% కోత

9

'జల్ జీవన్'లో..
రూ.4,500 కోట్లు దోపిడీ

- గత ప్రభుత్వ హయాంలో నొక్కేశారు
- కాగితాలపై మాత్రమే కుళాయిలు
- ఐదేళ్లూ పక్కాగా భారీ అవినీతి 'మిషన్'
- రూ.వెయ్యి కోట్ల కేంద్రం 'ఉపాధి' పనులూ జల జీవన్ మిషన్ ఖాతాలోనే..
- సమగ్ర విచారణకు సీఎం ఆదేశాలు
- మూడేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి అమర్చాలని నిర్దేశం



అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు నెలల్లో జల్ జీవన్ మిషన్‌ను తిరిగి పట్టాలెక్కించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయంలో గ్రామీణ నీటి సరఫరా, జల్‌జీవన్ మిషన్ పథకాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. "జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి గత ప్రభుత్వం సరిగ్గా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో

మిగతా 12వ పేజీలో...



రజనిపై 'బాలాజీ క్రషర్స్' ఫిర్యాదు

బలవంతంగా రూ. 2.2 కోట్లు వసూలు

- ఆమె పీఏ 5 కోట్లు డిమాండ్ చేశారు
- మావల్ల కాదన్నందుకు విజిలెన్స్ ఎస్పీ జాషువా వచ్చారు.. 50 కోట్లు ఫైన్ అన్నారు
- తర్వాత ఫోన్ చేసి ఎమ్మెల్యేని కలవమన్నారు
- రజని మరిది 2.20 కోట్లు వసూలు చేశారు
- వారి నుంచి మాకు రక్షణ కల్పించండి
- మా సొమ్ములు మాకు ఇప్పించండి
- హోం మంత్రికి లిఖితపూర్వక ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన అనిత!

10

రఘురామ కేసులో
విచారణ వేగవంతం




విజయపాల్

- ఎట్టకేలకు కొలిక్కి వచ్చిన దర్యాప్తు
- త్వరలోనే అరెస్టులు ప్రారంభం
- విచారణపై ఉన్నతాధికారుల సమీక్ష
- 10 మంది పోలీసులకు బిగుసుకుంటున్న ఉచ్చు
- థర్డ్ డిగ్రీ ప్రయోగించినవారి గుర్తింపు
- అజ్ఞాతంలో నాటి సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్
- ముందస్తు బెయిల్ కోసం పిటిషన్

11





4,500 క్లెయింలు.. రూ. 28 కోట్లు



- ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా పరిష్కారం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ఇళ్లు, దుకాణాలతో పాటు దెబ్బతిన్న వాహనాలు, చిన్న-మధ్య తరహా వ్యాపార సముదాయ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బీమా క్లెయింలు లభించాయి. గురువారం రాత్రి వరకు జరిగిన క్లెయింలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ సృజన అధికారికంగా ప్రకటించారు. మొత్తం 4,500 క్లెయింలు పరిష్కారం కాగా, రూ.27.93 కోట్లు పరిహారంగా లభించింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ఈ ఘనత సాధించింది. దీనిద్వారా రూ.79.86 కోట్ల విలువైన 10,130 మోటారు వాహనాల క్లెయింలు రిజిస్టర్ కాగా, రూ.13.50 కోట్ల విలువైన 3,904 క్లెయింలను పరిష్కరించారు. అలాగే, రూ.175.54 కోట్ల విలువైన 1,593 నాన్ మోటార్ క్లెయింలు రిజిస్టర్ కాగా, రూ.14.43 కోట్ల విలువైన 596 క్లెయింలకు పరిష్కారం లభించింది. మోటారు వాహనాలకు సంబంధించి 38.54 శాతం క్లెయింలు రిజిస్టర్ కాగా, నాన్ మోటారు కేసులకు సంబంధించి 37.41 శాతం పరిష్కారమయ్యాయి. ఈ రెండు విభాగాలకు సంబంధించి మొత్తం రూ.255.4 కోట్ల విలువచేసే 11,723 క్లెయింలు రిజిస్టర్ కాగా, 38.39 శాతం అంటే.. రూ.27.93 కోట్ల మేర 4,500 క్లెయింలు పరిష్కారమయ్యాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించటం వల్లే ఈ ఘనత సాధించామని, నిరంతర పర్యవేక్షణతో వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్ తదితర సేవలు పొందేందుకు 57,979 మంది అర్బన్ కంపెనీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు మొత్తం 4,415 సర్వీసు రిక్వెస్టులు నమోదయ్యాయని, వీటిలో 95.7 శాతం మేర సేవలందించడం పూర్తయిందని పేర్కొన్నారు.

బుడమేరు ఆక్రమణలు @ 3051

- వీఎంసీ పరిధిలోనే ఎక్కువగా..
- 13 ప్రదేశాల్లో గుర్తింపు
- నగర పరిధిలో 70 ఎకరాలు హాంఫట్
- నిగ్గు తేల్చిన అధికారులు
- ఇరిగేషన్, రెవెన్యూ, వీఎంసీ అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో సగభాగాన్ని బురద చేసిన బుడమేరు ఆక్రమణల లెక్క తేలింది. బుడమేరు ప్రవహించే ప్రారంభ ప్రదేశం నుంచి విజయవాడ వరకు 3,051 ఆక్రమణలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఒక్క విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే 70 ఎకరాలు ఆక్రమణల్లో ఉందని లెక్క తేల్చారు. నగర పరిధిలో బుడమేరు విస్తీర్ణం 202 ఎకరాలు ఉండాలి. ఇందులో 70 ఎకరాల్లో అనధికారికంగా నిర్మాణాలు వెలిశాయి. కాగా, ఇరిగేషన్ శాఖ క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం జలవనరుల శాఖ, వీఎంసీ, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వెలగలేరు, కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, గొల్లపూడి, విద్యాధరపురం, విజయవాడలోని 14, 15, 16 రెవెన్యూ డివిజన్లు, గుణదల, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు వరకు మొత్తం 36.2 కిలోమీటర్లలో బుడమేరు ఉంది. ఇందులో గ్రామాలు, వీఎంసీ డివిజన్లలో ఆక్రమణలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా విద్యాధరపురం నుంచి గుణదల వరకు బుడమేరులో ఎక్కువ ఆక్రమణలు జరిగాయని వీఎంసీ అధికారులు స్పష్టం చేశారు. బుడమేరు అసలు విస్తీర్ణం ఎంత, ఏ మేరకు ఆక్రమణలు జరిగాయన్న నివేదికను త్వరలో సీఎంకు అందజేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, రెవెన్యూ వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బుడమేరు ఆక్రమణలపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి నిమ్మల

అదనపు మార్గాలు

బుడమేరుపై ఉన్న చీమలవాగు, కేసరపల్లి, ఎనికేపాడు యూటీల సామర్థ్యాన్ని పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకు కట్టలను మరింత పటిష్టం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బుడమేరు పాత చానల్ నగరం మధ్య నుంచి ప్రవహిస్తోంది. దీనికి సమాంతరంగా ఉన్న కాల్వను విస్తరించడం ద్వారా బుడమేరువరదను మళ్లించవచ్చని అధికారులు వివరించారు. పాములకాల్వ, ముస్తాబాద కాల్వలను ఎంతవరకు విస్తరించవచ్చన్న దానిపైనా చర్చ జరిగింది.



వైసీపీకి సామినేని గుడ్‌బై



22న జనసేనలో చేరిక

నేడు జగ్గయ్యపేటలో అభిమానులు, కార్యకర్తలతో భేటీ

ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు అప్పగించే అవకాశం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/జగ్గయ్యపేట) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి బలమైన దెబ్బ తగిలింది. కాపు సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా గుర్తింపు ఉన్న జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఈనెల 22న జనసేనలో చేరనున్నారు. ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేసిన ఆయన.. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధినేత పవన్ కల్యాణ్‌తో సుమారు అరగంటపాటు భేటీ అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జగ్గయ్యపేటలో అభిమానులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. తనతో కలిసొచ్చే వారిని జనసేనలోకి ఆహ్వానించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్, వైసీపీ తర్వాత..

ఉదయభాను రాజకీయ జీవితం మొత్తం కాంగ్రెస్, వైసీపీల్లోనే కొనసాగింది. వైసీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1999లో తొలిసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 2004లోనూ ఆయన విజయం సాధించారు. 2009, 14లో ఓడిపోయారు. 2019లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత వైసీపీ ప్రభుత్వంలోనూ ప్రభుత్వ విప్‌గా చేశారు. గురువారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లిన సావినేని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో అరగంటపాటు భేటీ అయ్యారు. అనంతరం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జగన్ విధానాలు నచ్చక వైసీపీని వీడుతున్నానని ఉదయభాను చెప్పారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనతో ప్రయాణం చేసే వారిని జనసేనలోకి ఆహ్వానిస్తున్నానని, కూటమి ప్రభుత్వానికి తగ్గట్టు వివాదాలకు తావు లేకుండా నడుచుకుంటానని తెలిపారు. 'వైసీపీలో పరిస్థితి చాలా కష్టంగా ఉంది. నా మనసుకు కష్టం కలిగింది కాబట్టి పార్టీ వీడాను. వైఎస్‌తో ఎంతో సన్నిహితంగా పనిచేశాను. ఆయన కుమారుడితోనూ అదే కవిఽట్‌మెంట్‌తో కలిసి నడిచాను. ఎన్నికల ముందు జగన్‌ను కలిసి పరిస్థితి చెప్పినా పట్టించుకోలేదు. వైసీపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ పార్టీకి భవిష్యత్తు లేదని స్పష్టమవుతోంది. మా భవిష్యత్తు మేం చూసుకోవాలని బయటకొచ్చాం. 22న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరనున్నాను' అని ఉదయభాను ప్రకటించారు.


ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు?

కాపు సామాజికవర్గం నాయకుల్లో బలమైన నేతగా ఉన్న ఉదయభాను రాకతో ఎన్టీఆర్ జిల్లా జనసేనలో జోష్ పెరగనుంది. ఉదయభానుకు కాపు సామాజికవర్గంలో ఉన్న పట్టు కారణంగా ఆయనకు ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పార్టీ సభ్యత్వం ముగియడంతో ప్రస్తుతం జిల్లా అధ్యక్షుల నియామకంపై జనసేన అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ తరుణంలో ఉదయభాను పార్టీలో చేరనుండటం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను తీసుకొచ్చింది.

ఈజీగా ఇసుక

ఆప్షన్ ఇస్తే ఇంటి వద్దకే రవాణా

- శాండ్ పోర్టల్ ద్వారా సచివాలయాల్లో బుకింగ్
- సొంత వాహనాలైతే గనుల శాఖ అనుమతి తప్పనిసరి
- ఒకటి, రెండు రోజుల్లో ఇంటి వద్దకే అందజేసే ప్రణాళిక
- వాహనాల కోసం ట్రాక్టర్లు, లారీ యజమానులకు అవకాశం



ఇసుకను ఈజీగా అందుకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. నిర్మాణ ప్రదేశమే కాకుండా ఇసుక కోసం దరఖాస్తు చేసుకున్న వారు కోరుకుంటే వారి ఇంటి వద్దకే రవాణా చేసే అవకాశాన్ని కల్పించింది. ఇందుకోసం ఇసుక సరఫరా కేంద్రం నుంచి దరఖాస్తుదారుడి ఇంటి మధ్య దూరానికయ్యే రవాణా చార్జీలను భరిస్తే సరిపోతుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉచిత ఇసుకను ఎవరికి వారు బుక్ చేసుకునేందుకు వీలుగా గనుల శాఖ ఆధ్వర్యంలో https://www.sand.ap.gov.in వెబ్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. లాగిన్ అయ్యాక వచ్చే మెనూలో మీ ప్రాజెక్టు సైట్, నిర్మాణ ప్రదేశాలకు సంబంధించి లొకేషన్ వివరాలతో పాటు జీపీఎస్ కోర్డినేట్స్‌ను పొందుపరచాలి. దీనిప్రకారం వారికి అవసరమైనంత ఇసుకను దగ్గర్లోని సరఫరా కేంద్రం నుంచి పొందేలా అనుమతి ఇస్తారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

రవాణా వాహనాల డెలివరీ కోసం గనులు, భూగర్భ శాఖ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ మొబైల్ యాప్ అనేది రవాణా వాహన సప్లయర్‌కు, గనుల శాఖకు సంబంధించినది. వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తుదారులు ఇసుకను బుక్ చేసుకున్నపుడు.. సప్లయర్ ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. ఏ ప్రాంతానికి ఇసుక సరఫరా చేయాలి? ఎవరికి డెలివరీ చేయాలి? ఎంత చార్జీ నిర్ణయించారు? ఇసుక సరఫరా కేంద్రానికి ఏ సమయంలో వెళ్లాలి? వంటి వివరాలు మెసేజ్ రూపంలో వస్తుంది. ఇందుకు రవాణా యజమాని అంగీకరిస్తే.. ఆ ఆర్డర్‌ను కేటాయిస్తారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు డెలివరీ జరుగుతుంది. రవాణా చేసిన ఒకటి, రెండు రోజుల్లోనే నేరుగా వాహన సప్లయిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

పనిదినాలు ఇలా..

ఇసుకను బుక్ చేసుకోవాలంటే పనిదినాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ బుకింగ్స్ తీసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్ చెల్లింపులే అంగీకరిస్తారు. నగదు లావాదేవీలకు అవకాశం లేదు. పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఒకటి, రెండు రోజుల్లోనే ఇసుకను సరఫరా చేస్తారు.

రవాణా వాహనాలు ఇలా..

ఇసుక రవాణా కోసం సొంత వాహనాలను కూడా ఉపయోగించుకోవచ్చు. సొంత వాహనంలో తీసుకెళ్లాలంటే ఆ వాహనాన్ని తప్పనిసరిగా గనులు, భూగర్భ శాఖ దగ్గర రిజిస్టర్ చేసి ఉంచాలి. బయటి వాహనదారులు, ఇసుక రవాణా చేసే వాహనదారులకు కూడా అవకాశం ఉంటుంది. రీచ్ నుంచి వినియోగదారుల ఇంటి వద్దకే ఇసుకను రవాణా చేసేందుకు వీలుగా ఆసక్తి కలిగిన ట్రాక్టర్, ఆరు చక్రాల లారీ, 10, 12, 14 చక్రాల లారీ యజమానులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. వీరు కూడా తమ వాహనాలకు గనులు, భూగర్భ శాఖ దగ్గర రిజిస్టర్ చేసుకోవాలి. వాహనానికి జీపీఎస్ డివైజ్‌ను అనుసంధానించాలి. తగిన సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించి, వాహనానికి సంబంధించిన పత్రాలను సమర్పించి, ఎంపానల్‌మెంట్ చేసుకోవాలి. వాహనాలను రిజిస్టర్ చేసుకునే విషయంలో ఎలాంటి పరిమితి లేదు. మీ దగ్గర ఎన్ని వాహనాలున్నా రిజిస్టర్ చేసుకోవచ్చు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఇసుక రవాణా చార్జీలను వసూలు చేస్తారు. దరఖాస్తుదారుల నుంచి రవాణా చార్జీల రుసుమును ప్రభుత్వమే వసూలుచేసి రవాణా వాహనదారుకి ఇస్తుంది.

రాజధానిలో వాకింగ్ ట్రాక్



హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో సీడ్ యాక్సెస్ రోడ్డులో..


- రూ.88.31 లక్షలతో టెండర్లు పిలిచిన అమరావతి అభివృద్ధి సంస్థ
- రాజధాని గ్రామాలతో పాటు అందరికీ అందుబాటులో ట్రాక్
- సైక్లింగ్ కూడా చేసుకునేలా డిజైన్ రూపకల్పన
- సీడ్ యాక్సెస్ రోడ్డులో సందడి పెంచేందుకే..

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు బఫర్ జోన్‌లో అత్యంత పొడవైన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ టెండర్లు పిలిచింది. ఈ రోడ్డుకు అదనపు హంగులు అద్దటంతో పాటు సందర్శకుల సంఖ్యను, వ్యాపారాలను పెంచటం కోసం కూడా మెగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు టెండర్లు పిలవటం గమనార్హం. అమరావతిలో ఎన్-04 జంక్షన్ నుంచి ఎన్-11 జంక్షన్ వరకు మెగా వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.88.31 లక్షలతో టెండర్లు పిలిచారు. అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు టెండర్ బిడ్ల దాఖలుకు గడువు ఇచ్చారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు బిడ్లను ఓపెన్ చేసి ఖరారు చేస్తారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ ద్వారా ఆ ప్రాంతమంతా సందడిగా ఉంటుంది. అదే తరహాలో దానిని మించి సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి అభివృద్ధి చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు రాజధానికి ఐకానిక్ రోడ్డు. ఈ రోడ్డులో 15 మీటర్ల మేర బఫర్ జోన్‌కు స్థలాన్ని వదిలారు. ఈ బఫర్ జోన్‌లో ఏడీసీ నేతృత్వంలో గ్రీన్ బెల్టును అభివృద్ధి చేశారు. ఈ బఫర్ జోన్‌లోనే వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. ఈ ట్రాక్‌నే సైక్లింగ్ ట్రాక్‌గా ఉపయోగించు కునేలా కూడా పనులు చేపడతారు. రాజధాని ప్రాంతంలోని వారితో పాటు బయటి వారంతా ట్రాక్‌ను ఉపయోగించుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్

జెత్వానీ కేసులో మిగిలిన అధికారులకు పిలుపులు

- మరో ఐదుగురు పోలీసులపై అభియోగాలు
- వారిలో ఒక మహిళా ఎస్ఐ
- వాంగ్మూలం తీసుకునే యోచనలో అధికారులు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసు చాలామంది పోలీసు అధికారులను టెన్షన్‌కు గురిచేస్తోంది. ఇబ్రహీంపట్నం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీతో పాటు డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, సత్యనారాయణ, ఎస్ఐలు దుర్గాదేవి, షరీఫ్, షబానా, మౌనిక, గీతాంజలి పేర్లను పేర్కొన్న విషయం తెలిసిందే. వారిలో ముగ్గురు ఐపీఎస్‌లు, డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను ఇప్పటికే సస్పెండ్ చేశారు. వీరిలో విశాల్‌గున్నీ రాతపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసిందే. నాడు కేసు నమోదుకు సంబంధించి అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ వాంగ్మూలాన్ని విచారణాధికారి తీసుకున్నారు. మరో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ విజయవాడ కవిఽషనరేట్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఐ షరీఫ్ మాత్రం గుడివాడ జీఆర్పీలో పనిచేస్తున్నారు. కాదంబరి నోటి నుంచి వచ్చిన పేర్లకు సంబంధించిన విచారణలో భాగంగా వాంగ్మూలం తీసుకునే అవకాశాలున్నాయి. విజయవాడ కవిఽషనరేట్‌లో ఉన్న వారిని మినహాయిస్తే ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని పిలిపించే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆ ఇద్దరు పోలీసులెవరు?

జెత్వానీ అరెస్టు ఆపరేషన్‌కు సంబంధించి ఒక అదనపు ఎస్పీ, ఇన్‌స్పెక్టర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అదనపు ఎస్పీ గుంటూరు జిల్లాలో పనిచేస్తుండగా, ఇన్‌స్పెక్టర్ మాత్రం ఏలూరు రేంజ్‌లో ఉన్నారు. కాదంబరి కొన్ని పేర్లు చెబుతున్నప్పటికీ.. మరికొంతమంది పేర్లు తనకు తెలియవని, వ్యక్తులను గుర్తుపడతానని ఆమె పేర్కొంటున్నారు. హోంమంత్రి అనితను గురువారం కలిసినప్పుడు తనపై అన్యాయంగా కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కాదంబరి చెప్పిన వారి పాత్రలను నిర్ధారించే పనిలో విచారణాధికారి ఉన్నారు. అయితే, పాత్రధారులు ఎక్కడున్నా వచ్చి వాంగ్మూలం ఇవ్వాల్సిందేనని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాంతిరాణా పోలీసు కవిఽషనర్‌గా ఉన్నప్పుడు ఎస్ఐ షరీఫ్ చేసిన వ్యవహారాలపైనా పోలీసు అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఆపరేషన్‌కు సంబంధించి ప్రధానమైన అధికారులను సస్పెండ్ చేశారు కాబట్టి తమ జోలికి ఎలాంటి క్రమశిక్షణ చర్యలు రావన్న భావనలో ఈ పోలీసులు ఉన్నారు. విచారణ పూర్తై, పాత్ర తేలిన వెంటనే చర్యలు ఉంటాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.



ఒడ్డుకు చేరిన రెండో బోటు

మూడో బోటు వెలికితీత పనులు నేడు ప్రారంభం

4లో..

దసరాకు పక్కాగా ఏర్పాట్లు

అధికారులతో మున్సిపల్ కవిఽషనర్ ధ్యానచంద్ర సమీక్ష

2019 కౌలు చట్టాన్ని సవరించాలి

» కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ

వన్‌టౌన్, సెప్టెంబరు 19 : భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాన్ని ఇవ్వాలంటే 2019 చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు హక్కుల పత్రాలు ఇవ్వటానికి మంత్రివర్గం ఆమోదం తెలపటం హర్షణీయమే కాని, ఇది అమలు కావాలంటే పంట సాగు హక్కు పత్రం-2019 చట్టాన్ని సవరించాలని, దానిని సవరించకుండా ముఖ్యమంత్రి కేవలం ప్రకటన చేయటం వల్ల సాధ్యం కాదన్నారు. దీని అమలుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. భూ యజమాని సంతకం తొలగించటంతో పాటు దీనికి సంబంధించి ఇంకా కొన్ని విధి విధానాలను రూపొందించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. రైతులు, కౌలు రైతుల సంఘాలు, వ్యవసాయరంగ నిపుణులు తదితరులతో సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకోవాలని, ఆమేరకు చట్టాన్ని పటిష్టంగా రూపొందించాలని కోరారు. గ్రామసభ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పరిహారాలు, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చట్టంలో పొందుపరచాలన్నారు. 2019 కౌలు చట్టాన్ని సవరించి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తూ పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



ఢిల్లీలో డెయిరీ కాన్ఫరెన్స్‌లో మీనేష్ షాను కలిసిన చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు

కృష్ణా మిల్క్‌ను ఆదుకోండి!

» నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్‌కు వినతి

చిట్టినగర్, సెప్టెంబరు 19 : వరద ముంపునకు గురైన కృష్ణామిల్క్ యూనియన్‌ను ఆదుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ, కొల్లి ఈశ్వరబాబులు గురువారం ఢిల్లీలో ఐసీఏఆర్ డెయిరీ కాన్ఫరెన్స్‌లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మీనేష్ షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా కృష్ణామిల్క్ యూనియన్ విజయవాడ ఫ్యాక్టరీ పూర్తిగా ముంపునకు గురై అపార నష్టం వాటిల్లిందని మీనేష్ షాకు చలసాని ఆంజనేయులు, ఈశ్వరబాబులు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మీనేష్ షా ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తమవంతు సహాయ సహకారాలు అందస్తానని హామీ ఇచ్చారన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు దక్షిణ రీజియన్ హెడ్ జి.కిషోర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు సవరించండి

విస్సన్నపేట : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.250 కోట్లను పాత పద్ధతిలో రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు ఖాతాల్లో జమచేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి రైతు సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న నీటి సంఘాల నేతలు

రుణాలు రీ షెడ్యూల్ చేసుకోండి

» వరద ముంపు ప్రాంత ప్రజలకు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నివాస్ సూచన

కృష్ణలంక, సెప్టెంబరు 19 : వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు లబ్ధిచేకూర్చేందుకు బ్యాంకుల రుణాల రీ షెడ్యూలింగ్ సౌకర్యాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని, వినియోగరుణాలు, కొత్త మూలధన రుణాలు పొందేందుకు వీలున్న నేపథ్యంలో బ్యాంకులకు దరఖాస్తులు సమర్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, కలెక్టర్ జి.సృజన సూచించారు. గురువారం లీడ్ బ్యాంక్ యూబీఐ అధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జె.నివాస్, కలెక్టర్ సృజన, బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముంపు బాధితులకు భరోసా కల్పించేలా, బ్యాంకులు విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలందించాలని కోరారు. ఏడాది మారటోరియంతో రుణాల రీ షెడ్యూలింగ్‌తో పాటు ముంపు బారిన పడిన గ్రౌండ్‌ఫ్లోర్ కుటుంబాలకు రూ.50 వేలు, మొదటి, ఆపై అంతస్తులలో వున్న కుటుంబాలకు రూ.25 వేల వినియోగ రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఈ రుణాలకు మూడు నెలల మారటోరియం, 36 నెలల రీ పేమెంట్ పీరియడ్ వర్తిస్తుందన్నారు. చిన్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు తమ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడికోసం కొత్త రుణాలు కూడా మంజూరు చేయాలన్నారు. సహజ విపత్తు ప్రభావిత జిల్లాకు ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం అన్ని సహాయసహకారాలను అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. బల్క్ మెసేజ్‌లతో పాటు నేరుగా మాట్లాడి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొనేలా వరద ప్రభావిత ప్రాంత ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. నీటమునిగిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని కుటుంబానికి రూ.25 వేలు చొప్పున, మొదటి, ఆపై అంతస్తులలోని కుటుంబానికి రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారని, దీనికి తోడు రుణాల రీ షెడ్యూల్, వినియోగ, కొత్త రుణాల మంజూరు ద్వారా బాధితులను కష్టాల నుంచి గట్టెక్కించవచ్చని పేర్కొన్నారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇన్సూరెన్సు ఫెసిలిటేషన్ కేంద్రం విజయవంతమైన నేపథ్యంలో ఇదే తరహాలో ప్రత్యేక బ్యాంకింగ్ సేవల ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతోందని జె.నివాస్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జె.నివాస్, కలెక్టర్ సృజన

త్వరితగతిన క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్..

వరద ప్రభావంతో దాదాపు 48 వేల వాహనాలు దెబ్బతిన్నాయని, నష్టం వాటిల్లిన ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ఇప్పటికే నష్టపరిహారం ప్రకటించడం జరిగిందని, ఇదేవిధంగా ఇన్సూరెన్సు క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతోందన్నారు. చిన్నచిన్న రిపేర్లు అవసరమైన వాటిని బాగుచేయించే ప్రక్రియ రెండు, మూడురోజుల్లో పూర్తవుతుందన్నారు. ఎంఎస్ఎంఈలకు సంబంధించి అన్ని విధాలా అవసరమైన సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని నివాస్ తెలిపారు.

బాధితులకు చేయూతనందించాలి : కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అధికార యంత్రాంగం అన్నివిధాలా సహకారం అందిస్తోందని, దీనికి బ్యాంకులు కూడా సమష్టి కృషితో బాధితులకు చేయూతనందించాల్సిన అవసరముందని కలెక్టర్ తెలిపారు. డీసీసీ, ఎస్ఎల్‌బీసీ వరుస సమావేశాలు, ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం తదితరాలతో ప్రాథమికంగా ఖరారైన నిర్ణయాలను సమర్థవంతంగా అమలుచేసేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. బీమా సంస్థలకు అందిన క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్‌లో పురోగతి తదితర అంశాలపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

దసరా ఏర్పాట్లలో వీఎంసీ

» కమిషనర్ ధ్యాన చంద్ర సమీక్ష

చిట్టినగర్ : దసరా మహోత్సవాలకు వీఎంసీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లోక్ రూమ్‌లు, పారిశుధ్య నిర్వహణ తదితర అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. గుడి చుట్టూ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా 35లక్షల తాగునీటి వాటర్ బాటిల్స్, ప్యాకెట్లు, 150 తాత్కాలిక మరుగుదొడ్లు, 6 క్లోక్ రూమ్‌లు, పారిశుధ్య నిర్వహణకు 27 ప్రాంతాల్లో 1400 మంది పారిశుధ్య కార్మికులతో మూడు షిఫ్ట్‌లలో ఏర్పాటు చేయటంతోపాటు, గిరిప్రదక్షిణ దారిలో ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న వసంత కృష్ణ ప్రసాద్

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.40 లక్షల విరాళం

జి.కొండూరు : విజయవాడ వరదబాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.40 లక్షల విరాళాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు గురువారం అందజేశారు. ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ ప్రతినిధులు రూ.30 లక్షలు, ఏపీ కాటన్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 లక్షలు చెక్కులను అందజేశారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

» హాజరుకానున్న 136 మంది అభ్యర్థులు

కృష్ణలంక, సెప్టెంబరు 19 : ఈనెల 20వ తేదీ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు తిరిగి 28, 29 తేదీలలో ఐదు రోజులపాటు నిర్వహించే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లను పూర్తిచేసినట్టు డీఆర్వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం డీఆర్వో వి.శ్రీనివాసరావు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను నగరంలోని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఈనెల 20, 21, 22, 28, 29 తేదీలలో ఐదురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు 136 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈనెల 20వ తేదీ శుక్రవారం పేపర్-1 ఎస్సే పరీక్ష, 21వ తేదీన పేపర్-2 జనరల్ స్టడీస్-1, పేపర్-3లో జనరల్ స్టడీస్-2, 22వ తేదీన పేపర్-4, 28వ తేదీ పేపర్-ఏలో ఇండియన్ లాంగ్వేజ్, మధ్యాహ్నం పేపర్-బి ఇంగ్లీష్, 29వ తేదీ పేపర్-6లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, మధ్యాహ్నం పేపర్-7లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు ఏడుగురు ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్షలు రాసేందుకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఇద్దరు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, అవసరమైన మందులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లలో పరీక్ష కేంద్రం పేరు అభ్యర్థి రాసే పరీక్ష కేంద్రం ఒకే విధంగా వుండేలా జాగ్రత్త వహించాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఆయా రూట్లలో బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై జిల్లా రెవెన్యూ అధికారి, పరీక్షల కస్టోడియన్ అధికారి డీఆర్వో వి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సమావేశంలో యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ సంతోష్ అజ్మీరా, అండర్ సెక్రటరీ సుశీల్‌కుమార్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, లెక్చరర్ తుంబురు ఆర్యపతి, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

రిజిస్ట్రేషన్ల డీఐజీగా రవీంద్రనాథ్ కొనసాగింపు

ఎన్టీఆర్‌జిల్లా డీఆర్ పీఎస్ఆర్ ప్రసాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ

నూతన డీఆర్‌గా పీవీవీ దుర్గాప్రసాద్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలు మొదలయ్యాయి. విజయవాడ జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా ఎ.రవీంద్రనాథ్‌ను యథాస్థానంలోనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆయన తిరిగి విజయవాడ డీఐజీగా మరికొంతకాలం పనిచేయనున్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా పనిచేస్తున్న వీఎస్ఆర్ ప్రసాద్ బదిలీ అయ్యారు. ప్రసాద్‌ను తాడేపల్లిలోని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంపుల శాఖ ఐజీ కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఏఐజీ)గా నియమించారు. ప్రసాద్ బదిలీతో ఖాళీ అయిన స్థానాన్ని మచిలీపట్నం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ (డీఆర్) పీవీవీ దుర్గాప్రసాద్‌ను ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా నియమించారు.

క్రైం కార్నర్

టీడీపీ నాయకులపై వైసీపీ మూకల దాడి

» గణేశ నిమజ్జనం ముగించుకుని వస్తుండగా దారికాచి దాడి

» హత్యాయత్నం కేసు నమోదు



కంచికచర్ల రూరల్ : ఎన్నికల సందర్భంగా చెలరేగిన పాత గొడవలు పురస్కరించుకొని, టీడీపీ నాయకులపై వైసీపీ మూకలు దాడిచేసి గాయపర్చిన సంఘటన కీసర గ్రామంలో చోటుచేసుకుంది. ఘటనలో ఇరువురు టీడీపీ నేతలకు తీవ్ర గాయాలు కాగా ఒక కారు ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో, బుధవారం అర్ధరాత్రి టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న వినాయకుడి నిమజ్జనం అనంతరం, తమ వారిని ఇళ్లవద్ద దింపేందుకు వెళుతుండగా, వైసీపీ శ్రేణులు దారి కాచి దాడి చేశారు. దాడిలో టీడీపీ నేత యర్రగోర్ల విజయ్, రాయల గోపిలు గాయపడ్డారు. కారు ధ్వంసమైంది. అదే సమయంలో పోలీసులు అక్కడే ఉండటంతో పెద్దఎత్తున ఘర్షణ చెలరేగకుండా నివారించగలిగారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదుపై వైసీపీకి చెందిన పదిమందిపై కేసు నమోదయింది. వైసీపీకి చెందిన పరిటాల రామకోటేశ్వరరావు, పరిటాల మల్లిఖార్జునరావు, సింఖా సాంబయ్యతో పాటు ఎనిమిది మందిని గురువారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకొని నందిగామ కోర్టుకు తరలించారు. కీసర గ్రామంలో అలజడులు తలెత్తకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మరికొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవాల్సి ఉందని, హత్యాయత్నం కిందకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాజు తెలిపారు.

ఏటీఎం ధ్వంసం

» రూ. 2 లక్షల నగదు దగ్ధం

మచిలీపట్నం టౌన్ : ఇనగుదురులో గురువారం తెల్లవారుజామున దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి నగదు అపహరించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. దుండగుల ప్రయత్నంలో రూ. 2 లక్షల నగదు దగ్ధమైంది. ఎస్ఐ బేగ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇనగుదురుపేటలో యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఏటీఎంను కొందరు దుండగులు కట్టర్‌తో బాక్స్‌ను కట్‌చేసి నగదు అపహరించే ప్రయత్నం చేశారు. అంతలో స్థానికులు రావడంతో పారిపోయారు. అయితే కట్టర్ వేడికి లోపల బాక్సులో ఉన్న రూ. 2 లక్షలు నగదు పాక్షికంగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



న్యూస్ బాక్స్

వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని అబ్దుల్‌కలాం నైపుణ్యశిక్షణాకేంద్రంలో ఈనెల 28నుంచి ప్రారంభంకానున్న ప్లంబర్, కారు, మోటార్‌సైకిల్ రిపేర్ విభాగాల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడునెలలపాటు పై మూడు కోర్సుల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. 10వ తరగతి చదివి, 18 నుంచి 35 మధ్యవయసు కలిగిన యువకులు అర్హులని తెలిపారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటుచేస్తామన్నారు. శిక్షణా నంతరం సర్టిఫికెట్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో సహాయ సహకారాలు అందించబడతాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతాల వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9440925583, 9010423652 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

స్ట్రీట్ ఫర్నీచర్ బకాయిలన్నీ చెల్లించాం : ప్రకాశ్ ఆర్ట్స్

» క్రమం తప్పకుండా లీజు చెల్లిస్తున్నాం : లీడ్ స్పేస్

విజయవాడ : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్ట్రీట్ ఫర్నీచర్‌కు సంబంధించిన లైసెన్సు ఫీజులన్నీ చెల్లించినట్టు ప్రకాశ్ ఆర్ట్స్ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. బకాయిలు ప్రతినెలా చెల్లిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పాత అడ్వర్టైజ్‌మెంట్ ఫీజు స్ట్రక్చర్ ఆధారంగా క్రమం తప్పకుండా లీజు మొత్తాలను చెల్లిస్తున్నామని లీడ్ స్పేస్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. పాత అడ్వర్టైజ్‌మెంట్ ఫీజుస్ట్రక్చర్ ఆధారంగా తాము కేవలం రూ.2.5కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నామని, 2018 నుంచి 250 శాతం ప్రకటనల రుసుంపై పన్ను పెంచడంతో అంత మొత్తం భరించడం చిన్నచిన్న ప్రకటనకర్తలకు సాధ్యం కాదని, గత రేటు ప్రకారం పన్నులు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని లీడ్‌స్పేస్ యాజమాన్యం పేర్కొంది.

రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏడుగురి అరెస్టు

జగ్గయ్యపేట : క్రిస్టియన్‌పేటలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గురువారం ఏడుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో టీడీపీ నేత కర్ల జోజి, వైసీపీ నేత రుంజా నాగేంద్ర వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో 19మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఒడ్డుకు చేరిన రెండో బోటు

» ప్రకాశం బ్యారేజీ వద్ద ఒక్కరోజులోనే ఆపరేషన్ పూర్తి

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ వద్ద బోల్తా పడిన బోట్లలో రెండో దానిని ఇంజనీరింగ్ బృందం గురువారం సాయంత్రం ఒడ్డుకు చేర్చింది. మొదటి బోటు మాదిరిగానే ఈ బోటును పున్నమి ఘాట్ సమీపానికి చేర్చారు. మొదటి బోటును ఒడ్డుకు చేర్చడానికి 11 రోజుల సమయం పట్టగా, రెండో బోటును ఒక్కరోజులోనే తీసుకొచ్చారు. ఈనెల ఒకటో తేదీ వరదల సమయంలో ఐదు బోట్లు ఎగువ నుంచి కొట్టుకుని వచ్చి ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న విషయం తెలిసిందే. వాటిలో ఒక బోటు కొట్టుకుని వెళ్లిపోయింది. మరో మూడు బ్యారేజీ గేట్లకు చిక్కుకుని ఉండిపోయాయి. నాల్గో బోటు నీటిలో మునిగిందా, నీళ్లలో కొట్టుకుని వెళ్లిపోయిందా అనే విషయం ఇంకా తెలియరాలేదు. మూడు బోట్లలో ఒక దానిని రెండు రోజుల క్రితం కావడి విధానం ద్వారా పున్నమి ఘాట్ వద్దకు చేర్చారు. రెండో బోటును బుధవారం తీయడానికి ప్రయత్నించగా, నీటిలో మునిగిపోయింది. దీంతో ఈ బోటును తొలగించడానికి మొదటి బోటు మాదిరిగానే 11 రోజుల సమయం పడుతుందని భావించారు. అయితే, బెకమ్ కంపెనీ, సీ లయన్ కంపెనీ, కాకినాడ అబ్బులు టీం సమన్వయంతో గురువారం సాయంత్రానికే పున్నమి ఘాట్ వద్దకు తీసుకొచ్చారు. మొదటి బోటును లాగడానికి ప్రత్యేకంగా నాలుగు బోట్లు ఏర్పాటు చేయగా, రెండో బోటును మాత్రం కావడి విధానంలో రెండు బోట్లతోనే ఒడ్డుకు చేర్చడం విశేషం.





నూజివీడు స్టేషన్‌కు ఎగుమతుల కళ

» 2672 టన్నుల ఉప్పు.. ప్రతీ నెలా గోధుమ, సోయాబీన్, మొక్కజొన్న దిగుమతి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19 : మామిడి ఎగుమతులతో విజయవాడ రైల్వేకు కోట్లాది రూపాయలు ఆర్జించిన నూజివీడు రైల్వే స్టేషన్‌లో దిగుమతుల కళ సంతరించుకుంది. గుజరాత్ నుంచి 2672 టన్నుల ఉప్పు నూజివీడు స్టేషన్‌లో గురువారం దిగుమతి అయ్యింది. గన్నవరం సమీపంలోని వేర్‌హౌస్‌కు ఓ ప్రవేట్ కంపెనీ ఉప్పును బుక్ చేసుకుంది. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలోని సితార ఫుడ్ ఇండస్ట్రీ ప్రతినెల వేల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకుంటోంది. గతనెలలో మూడు రైళ్లలో గోధుమలు, మొక్కజొన్న దిగుమతి అయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 10 రైళ్లలో దిగుమతులు జరిగాయి. జిల్లాలోని పలు చేపల పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాల నుంచి సోయాబీన్ పిండిని దిగుమతి చేసుకుంటున్నాయి. స్టేషన్‌కు క్రమేణా దిగుమతుల కళ వస్తోంది. మరో రెండురోజుల్లో రెండు రేకులు(గూడ్స్ రైళ్లు) గోధుమలు, మొక్కజొన్న దిగుమతి కానున్నట్టు గూడ్స్ విభాగం అధికారులు తెలిపారు. వరుస దిగుమతులతో ముఠాకార్మికులకు ఉపాధి లభించడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పు నీరు ముంచుతోంది!

» అవుట్ ఫాల్ నిర్మాణం జరిగేదెన్నడో

» నీరు పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం

» అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

కోడూరు : ఏళ్ల గడుస్తున్నా అవుట్ ఫాల్ నిర్మాణం జరిగేదెన్నడో తెలియక ఉప్పునీటి బారి నుంచి పంట పొలాలకు రక్షణ కల్పించే నాథుడెవరని కోడూరు మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. 13వ నెంబర్ పంట కాలువ దిగువ ప్రాంతంలో బాడే కాలువ సమీప ప్రాంతంలోని నల్లపొర్ర పొలాల్లోకి కోడూరు అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు సరిగా లేని కారణంగా ఉప్పునీరు నేరుగా పంట పొలాల్లోకి చొచ్చుకు రావటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వర్షాల తాకిడికి పంటలు నీటమునిగి వేసిన నాట్లు, నారుమడులు కుళ్లిపోగా, మరలా పంట వేసుకునేందుకు నారుమడులు సిద్ధం చేస్తే ఉప్పునీటి ముంపునకు గురై నష్టపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు అవుట్ ఫాల్ గేటు ఒకటి విరిగిపోగా, మరొకటి పూర్తిగా లేకపోవటంతో సముద్రపు ఆటుపోట్లకు అడ్డంకి లేక నేరుగా మురుగు కాలువల ద్వారా ఉప్పునీరు పొంగి పొర్లి పంట పొలాల్లోకి చేరుతుంది. ఈ విషయమై ఏళ్ల గడుస్తున్నా గత పాలకులు కాలయాపన చేశారని, ప్రస్తుత ప్రభుత్వం అయినా రైతుల గోడు పట్టించుకుంటుందనే ఆశతో ఎదురుచూస్తున్నప్పటికీ నిరాశే ఎదురవుతున్నదని రైతులు పేర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి పలుమార్లు అవుట్‌ఫాల్ స్లూయిస్ గురించి అప్పటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా పరిశీలించి వెళ్లిపోయారు తప్ప సమస్య గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. సముద్రపు ఆటుపోట్లు వస్తే మా బాధలు ఎవరికి చెప్పుకోలేని విధంగా ఉంటున్నాయని రైతులు తెలుపుతున్నారు. ఇదే తరహాలో పాలకాయితిప్ప అవుట్ పాల్‌స్లూయిస్ గేట్లు కూడా పూర్తిగా శిథిలం కావటంతో వేలాది ఎకరాల్లో గత నాలుగు సంవత్సరాలుగా పంట వేసే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ రైతుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేక నేటికీ కొన్ని పంట పొలాలు బీడు భూములుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత డ్రెయినేజీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తాత్కాలిక రబ్బరు లేదా ఫైబర్ గేట్లు అమర్చి పంట పొలాల ముంపు నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు. లేని క్రమంలో గ్రామాలు వదిలి పొట్టకూటి కోసం వలస వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి : రైతులు

డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమకు ఈ దుస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అవుట్ పాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా లేనప్పటికీ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించటం వల్లే ఉప్పు నీరు పంట పొలాల్లోకి వస్తున్నదని రైతులు బండే ఆంజనేయులు, చేబోయిన సుబ్బారావు, చేబోయిన చంటి, అడుసుమిల్లి సత్యనారాయణ, ఉల్లి చిరంజీవి ఆరోపించారు.



అవుట్ ఫాల్ గేటు లేకపోవటంతో నేరుగా సముద్రపు ఉప్పు నీరు వస్తున్నదని చూపుతున్న రైతులు



అవుట్ ఫాల్ స్లూయిస్‌కు విరిగిపోయిన గేటు



సాగు పరిస్థితి లేక బీడు భూములుగా మారిన పంట పొలాలు



కాళీమాత ఆదాయం రూ.8 లక్షలు



కృష్ణలంక, సెప్టెంబరు 19: త్రిశక్తిపీఠంలోని శ్రీ కాళీమాత దేవస్థానంలోని హుండీలను గురువారం దేవదాయశాఖ సిబ్బంది లెక్కించగా 140 రోజులకు రూ.8,26,825 వచ్చినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.అనూరాధ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, సభ్యులు జి.సత్యనారాయణ, ఎం.రాజా, జగన్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకుల కిట్‌లు అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఉమా



64వ డివిజన్‌లో కిట్లు పంచుతున్న టీడీపీ నాయకులు



షాదీఖానాలో మైకెసెట్ అందజేస్తున్న మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, తదితరులు



నిత్యావసరాల కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సవిత



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి, పీఎస్ రావు

తానా సహకారంతో బాధితులకు సరుకుల పంపిణీ

వన్‌టౌన్, సెప్టెంబరు 19: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సహకారంతో విజయవాడ సెంట్రల్ తెలుగు మహిళ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గురువారం సింగ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావులు 300 మంది మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ, విదేశాల్లో ఉన్న తెలుగువారు బాధితులకు ఆర్థిక సహాయం అందచేయటానికి ముందుకు వస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సెంట్రల్ మహిళ అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, పైడి శ్రీను, గంటా కృష్ణమోహన్, ఎస్.కె.అన్వర్, ఎస్.కె బాష, గొట్టుముక్కల శేషంరాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా సింగ్‌నగర్ కార్యాలయానికి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందచేసి ఎమ్మెల్యే ఉమా దుశ్శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సహకారంతో గురువారం టీడీపీ నాయకులు కె.రవి కుమార్ ఆధ్వర్యంలో వస్త్రాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. వరలక్ష్మి, గిరి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మసీదులకు మైకెసెట్లు, కార్పెట్లు పంపిణీ

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన అంజుమన్ అహలే ఇస్లాం, కర్నూలు ముస్లిం సోదరులు, జహీద్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సహకారంతో గురువారం వన్‌టౌన్ షాదీఖానాలో మసీదుల్లో మైకెసెట్లు, కార్పెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూక్ షుబ్లి, మౌలానా హుస్సేన్ అహ్మద్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, దుప్పట్ల పంపిణీ

చాత్తాద శ్రీవైష్ణవ సామాజిక వర్గానికి చెందిన వారికి గురువారం అఖిల భారత చాత్తాద శ్రీవైష్ణవ సమాఖ్య ఆధ్వర్యంలో భవానీపురం సాయి అన్నా గార్డెన్‌లో బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందచేశారు. హైదరాబాద్ సమాఖ్య అధ్యక్షుడు తిరుక్కోళ్లూరి రామానుజం, ఉపాధ్యక్షుడు సుదర్శన వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ఎం. శ్రీనివాసరావు, ఎస్.పి. శేషగిరిరావు, పి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీవీ, ఫ్రిజ్ అందజేత

పశ్చిమ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న కార్యాలయంలో గురువారం ఇటీవల వరదలలో నష్టపోయిన సీనియర్ టీడీపీ కార్యకర్తలకు టీవీ, ఫ్రిజ్ అందజేశారు. పశ్చిమ టీఎస్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర 42వ డివిజన్‌కు చెందిన ముప్పా విజయశ్రీకి ఫ్రిజ్, 43వ డివిజన్‌కు చెందిన వల్లభనేని లక్ష్మీప్రసన్నకు టీవీ అందచేశారు. ఈ కార్యక్రమంలో పరిశిపోగు రాజేష్, గవులూరి బాబూరావు, పట్నాల రమణ, దుంపల రాంబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, తాడిశెట్టి నరసింహం, జితేందర్ దేవాసి, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మొగల్రాజపురం: స్థానిక సిద్ధార్థనగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఫణి ప్రసాద్ ఆధ్వర్యంలో దాతలు డాక్టర్ శ్రీ లక్ష్మి, పీఎం రావు సహకారంతో వారి చేతుల మీదుగా వరదలో నష్టపోయిన విద్యార్థులకు 10వేల నోటు పుస్తకాలను, పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ ట్యూటోరియల్స్ అసోసియేషన్ అధ్యక్షులు టి. శ్రీనివాస్, కె. జగదీష్, సతీష్, జి.స్లీవా పాల్గొన్నారు.

నిగమా ఫౌండేషన్ సాయం

భవానీపురం : భవానీపురం 41వ డివిజన్ మసీదు వీధిలో నిగమా ఫౌండేషన్ సహకారంతో వరద బాధితులకు రాష్ట్ర బీసీ, చేనేత శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం నిత్యావసరాల కిట్లు, దుప్పట్లు, స్టీల్ గిన్నెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, నాయకులు సయ్యద్ కరీముల్లా, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్యలు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడండి

● కమిషనర్ ధ్యానచంద్ర



చిట్టినగర్, సెప్టెంబరు 19: వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్డు, బుడమేరు వంతెన పైపులరోడ్డు, ఉడాకాలనీ, కండ్రిక జర్నలిస్టుకాలనీ, పీఎన్‌టీకాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వరద ప్రాంతాల్లో చెత్త వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు రోడ్లు, వీధులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రైయిన్లలో మురుగు నీరుపారుదలకు ఆటంకం కలగకుండా పూడికతీత పనులు నిర్వహించాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా ప్రజలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా వరద నీరు ఉంటే వెంటనే తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్నారు. ఈ పర్యటనలో పలువురు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మందులు అందజేత

వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు పంపిణీ చేసేందుకు టీడీపీ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రను ఆయన ఛాంబర్‌లో కలిసి మందులు అందజేశారు. వరద ప్రాంతాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు వివిధ రకాల మందులు అందజేశారు.

ఎస్ఆర్ఆర్‌లో స్వచ్ఛతా హీ సేవా

భారతీనగర్, సెప్టెంబరు 19: మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భాగ్యలక్ష్మీ సమక్షంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటడం, పచ్చదనం పరిశుభ్రతకార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. ● మహానాడు రోడ్డు సెంటర్ సమీపంలోని గవర్నమెంట్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కడియం శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

25న వ్యాసరచన పోటీలు

పటమట : ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా సందర్భంగా ఈ నెల 25న ఉదయం 11 గంటలకు నాస్తిక కేంద్రంలో స్వచ్ఛ భారత్ వైపు స్వచ్ఛమైన ఓ అడుగు అనే అంశంపై హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ సమరం తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి పొందిన వారితో పాటు పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ సర్టిఫికెట్‌ను అక్టోబరు రెండున నిర్వహిస్తున్న గాంధీ జయంతి సభలో అందజేస్తామని ఆయన వివరించారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

వన్‌టౌన్, సెప్టెంబరు 19: బీసీలకు 33 శాతం రిజర్వేషన్‌ను ఏపీ కేబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శులు సింహాద్రి కనకాచారి, కొత్త నాగేంద్ర కుమార్,బీసీ ఫెడరేషన్ నాయకులు పేరేపి ఈశ్వర్, మల్లె ఈశ్వర్, మరకా శ్రీనివాస యాదవ్, కత్తుల మణికంత, పామర్తి కిషోర్ బాబు, బెజవాడ తిరుపతి గౌడ్, శొంఠి శివరామప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

వన్‌టౌన్, సెప్టెంబరు 19: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం 3 వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులకు సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంతో పాటు 40 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి మిత్ర సురక్షా శిబిర్‌లో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి అవసరమైన సూచనలు, మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం, మధుమేహం, థైరాయిడ్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు

మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వినతి

ధర్నాచౌక్, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు చేయనున్న నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రరావు మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు చరణ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో పలుచోట్ల అన్నదానాలు

పటమట, సెప్టెంబరు 19 : 11వ డివిజన్ వివేకానంద కాలనీలో వినాయక చవితి మండపం వద్ద టీడీపీ నాయకులు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో పవర్ ఫ్రెండ్స్ సర్కిల్ గురువారం అన్నదానం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పటమట సీఐ పవన్ కిషోర్ హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గద్దె వెంకటేశ్వరరావు, భూషయ్య, రాజీవ్‌గాంధీ, వెంకట రమణ, షారూఖ్‌లు పాల్గొన్నారు. 17 డివిజన్‌లో రాము ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యంలో, 16వ డివిజన్ శివదుర్గారోడ్డులోని వినాయక చవితి సందర్భంగా స్థానికులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమ్మిలి రంగనాథ్, కడియాల నాగు, వేములసాయి, రాము ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ హైటెక్ బుజ్జి, కొండా సాయి, మోహన్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు పీబీ సిద్ధార్థ విద్యార్థులు

మొగల్రాజపురం, సెప్టెంబరు 19: జాతీయ స్థాయిలో అక్టోబర్‌లో జరిగే యోగా పోటీలకు పీబీ సిద్ధార్థ విద్యార్థులు ఎంపికైనట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగిన ఏపీ యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్- 18లో గంటా జ్యోత్స్న, అండర్- 21లో పి.మౌనిక కాంస్య పతకం సాధించిన సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. అభినందించిన వారిలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి. నాగేశ్వరరావు, కార్యదర్శి పి. లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్. వెంకటేశ్వరరావు, డైరెక్టర్ వేమూరి బాబు, డీన్ రాజేష్ సి జంపాల, పీడీ డాక్టర్ టి వీవీ కృష్ణారెడ్డి ఉన్నారు.

చంద్రబాబు పాలనపై పూనే తెలుగువాసుల ఆరా

వివరించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, సెప్టెంబరు 19: మహారాష్ట్రలోని పూనే ప్రాంతంలోని తెలుగు ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లోని స్థితిగతులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. గురువారం పూనే నగరంలో వాకింగ్ గ్రౌండ్‌లో గద్దె రామ్మోహన్ వాకింగ్ చేస్తున్న సమయంలో అక్కడికి తెలుగువారు ఆయనను గుర్తుపట్టి పలు విషయాలను ఆరా తీశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి విజయం సాధించడంతో మళ్లీ రాష్ట్రంలో అభివృద్ధి మొదలైందని గద్దె వారికి వివరించారు. వరదల సమయంలో చంద్రబాబు పది రోజులు విజయవాడలోనే ఉండి సహాయ సహకారాలను అందించడం ప్రచార మాధ్యమాల్లో చూశామని వారు కొనియాడారు. వాకింగ్‌కు వచ్చిన వారిలో 100 మందిలో 50 మంది తెలుగువారేనని గద్దె తెలిపారు.

టీటీడీ లడ్డూ ప్రసాదం అంశంపై వేగవంతంగా విచారణ చేయాలి

ధర్నాచౌక్, సెప్టెంబరు 19: టీటీడీలో పవిత్ర లడ్డూ ప్రసాదంలో గత ప్రభుత్వం నెయ్యికి బదులు జంతువుల కొవ్వుతో చేసిన నూనెలు వాడటం హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవి కుమార్ మండిపడ్డారు. దీనిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి వేగంగా దర్యాప్తు చేసి నిందితులను శిక్షించి హిందువుల మనోభావాలను కాపాడాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కోశాధికారి దుర్గాప్రసాద్, స్టేట్ సేవా ప్రముఖ్ సాయిరాం, విజయవాడ అధ్యక్షుడు సానా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రాఘవరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో నలంద విద్యార్థికి రజతం

లబ్బీపేట, సెప్టెంబరు 19 : ఏలూరులో ఈ నెల 15 న జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో తమ కళాశాల విద్యార్థి టి. రఘుమోహన్ (బీబీఏ మొదటి సంవత్సరం) 75 కేజీల విభాగంలో రజత పతకం సాధించినట్లు నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థిని చైర్మన్ విజయ్‌బాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సైబర్ సిటిజన్ యాప్‌పై విద్యార్థులకు అవగాహన




మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రకాష్

మొగల్రాజపురం,సెప్టెంబరు 19: పీబీ సిద్ధార్థ విద్యార్థులకు మాచవరం పోలీసులు గురువారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌లు విద్యార్థులకు సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలను వివరించారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్, క్యూఆర్ కోడ్ స్కాన్, పార్ట్‌టైం జాబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, టెలిగ్రాం, ఐడీల ద్వారా వచ్చే లింకులు, బ్యాంకు కేవైసీ అప్‌డేట్‌లు, ఓఎల్ఎక్స్ ద్వారా ఆర్మీ అధికారులం అంటూ తక్కువ రేట్‌కు వస్తువులు, వాహనాల అమ్మకం, ఢిల్లీ, ముంబయి పోలీసులని చెప్పి మోసాలు చేస్తారని చెప్పారు. నగదు మోసానికి గురైతే వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి చెప్పాల న్నారు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ htpp://cybercrime.gov.in/ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీలో రహదారి భద్రతపై ...


భారతీనగర్: ఎస్ఆర్ఆర్అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 5వ ట్రాఫిక్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రవికుమార్ పాల్గొని ట్రాఫిక్ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ డి. యుగంధర్, శర్వాణి పాల్గొన్నారు.



అనంత శూన్యం నుంచి ప్రారంభమై అన్నింటినీ తనలో ఇమడ్చుకున్న మహామనీషి అక్కినేని. తెలుగు అక్షరమాలలో మొదటి అక్షరంతో మొదలైన ఆయన పేరు మిగిలిన అక్షరాలకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు, ఆయన జీవితాన్ని ఒక అందమైన కావ్యంగా తీర్చిదిద్దింది. మహానటుడిగా నిలబెట్టింది. దైవం, అదృష్టాల కన్నా కృషినే నమ్మారు అక్కినేని. ఆయన శతజయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రత్యేక స్టాంప్ విడుదల చేస్తోంది.

జననం - 20-09-1924
మరణం - 22-01-2014

ఓ బాటసారి నిను మరువమోయి



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరంలాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు. 90 వసంతాల జీవితంలో 70 వసంతాలను అభినయ కళకు అర్పించిన అరుదైన నటుడు. రంగస్థలంపై ఆడవేషాలతో నటనను ఆరంభించి కాలక్రమంలో అభినయ కళాశాలగా, నట నిఘంటువుగా ఎదిగారాయన.

ప్రారంభంలో జానపద, పౌరాణిక చిత్రాల కథానాయకునిగా తన నటజీవితాన్ని ఆరంభించినప్పటికీ కాలక్రమంలో అనేకానేక ఆధ్యాత్మిక, సాంఘిక పాత్రల ద్వారా సమకాలీన జీవన సొబగులను అభినయించి సినీ మాధ్యమాన్ని జనజీవనంతో మమైకం చేసిన ప్రజానటుడు ఆయన.

వాల్మీకి, క్షేత్రయ్య, తుకారామ్, తెనాలి రామకృష్ణ, విప్రనారాయణ, జయదేవుడు, కబీరు, కాళిదాసు వంటి విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటనకే పరిమితం అవకుండా నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. నాటకాల రోజుల నుంచి తనకు ఎంతో అండగా నిలిచిన దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై ఆణిముత్యాల లాంటి చిత్రాలు నిర్మించారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో కలసి చక్రవర్తి చిత్ర పతాకంపై 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీశారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలు అందించారు.

స్వరాష్ట్రంలో చిత్ర పరిశ్రమ

తెలుగు చిత్ర పరిశ్రమ మదరాసు నగరం నుంచి హైదరాబాద్‌కు తరలి రావడానికి తొలి రోజుల్లో ఎంతో కృషి చేసిన వ్యక్తి అక్కినేని. 'నాతో సినిమా తీయాలనుకునే నిర్మాతలు హైదరాబాద్‌కు రండి' అని కండీషన్ పెట్టి, దాని మీదే చివరి వరకూ నిలబడ్డారు అక్కినేని. ఆ రోజుల్లో భాగ్యనగరంలో చిత్ర నిర్మాణానికి అవసరమైన వసతులు అరకొరకుగానే ఉన్నా, వాటితోనే సరిపుచ్చుకుని అద్భుత చిత్రాలు తీయడానికి కారకులయ్యారు అక్కినేని.





మూడు పద్మాలూ ఆయనకే!

ఒక నటునిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, ఓ మహోన్నత వ్యక్తిగా అక్కినేని నాగేశ్వరరావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ అధికార పరిధిలోని సమస్త సినీ ఘన పురస్కారాలను ఆయనకు కట్టబెట్టి పట్టాభిషేకాలు చేశాయి. మూడు పద్మాలు.. పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ పొందిన ఏకైక నటుడు అక్కినేని. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో తెలుగు వెలుగుల్ని హస్తినాపురం వరకూ ప్రసరింపచేసిన తొలి దక్షిణాది కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు.

నటనకే అంకితమైన కుటుంబం

ఏయన్నార్‌తో పాటు ఆయన కుటుంబం కూడా చిత్రపరిశ్రమకే అంకితమైంది. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు వెంకట్ నిర్మాతగా కొనసాగారు. రెండో కుమారుడు నాగార్జున నటుడిగా, ఆయన కుమారుడు నాగచైతన్య, అఖిల్ హీరోలుగా ఉన్నారు. అక్కినేని పెద్ద అల్లుడు సురేంద్ర నిర్మాత కాగా, ఆయన కుమారుడు సుమంత్ నటుడిగా, కుమార్తె సుప్రియ కూడా ఆర్టిస్టులుగా కొనసాగుతున్నారు. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతల్ని సుప్రియ నిర్వర్తిస్తున్నారు. ఇక అక్కినేని చిన్న కుమార్తె సుశీల కూడా నిర్మాతగా ఉన్నారు. ఆమె కుమారుడు సుశాంత్ నటుడిగా కొనసాగుతున్నారు.



ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కథానాయకులు పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రణధీర్ కపూర్ కలసి హిందీలో 'కల్ ఆజ్ ఔర్ కల్ (నిన్న నేడు రేపు)' అనే చిత్రంలో కలిసి నటించారు. అది 1971లో విడుదలైంది. దాని తర్వాత మూడు తరాల కథానాయకులు కలిసి నటించిన చిత్రం 'మనం'. నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య అందులో ప్రధాన పాత్రధారులు. అఖిల్ ఈ సినిమా పతాక సన్నివేశంలో కనిపిస్తారు. మూడు తరాలకు సంబంధించి ఆసక్తికరమైన కథను తయారు చేసి, విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించారు.

తొలి సినిమా 'శ్రీసీతారామ జననం'

మొదటి చిత్రం 'శ్రీసీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను అక్కినేని పోషించారు. 1944లో విడుదలైన ఈ చిత్రానికి ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకుడు.




సాధారణంగా ప్రేక్షకులెప్పుడూ హీరో పాత్ర మరణించడాన్ని జీర్ణించుకోలేరు. కానీ, అక్కినేని నటించిన దేవదాసు, ప్రేమాభిషేకం సినిమాల్లో హీరో మరణించినా ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టారు. ప్రణయ భావాల్ని, విషాదాల్నీ పలికించడం ఎవరికైనా సులువే. కానీ, వైరాగ్యాన్నీ, వేదాంతాన్నీ కలగలిపి పలికించడం అంత సులువేం కాదు. కళ్ల ఏడుస్తుంటే, పెదాలు నవ్వడం ఏకకాలంలో జరగాలి మరి! అలాంటి కష్టసాధ్యమైన హావభావాల్ని అలవోకగా, అద్భుతంగా పండించిన అసామాన్యుడు అక్కినేని. అందుకే భగ్న ప్రేమికుడి పాత్రలకు ఆలంబనగా, తాగుబోతు పాత్రలకు చిరునామాగా నిలిచారు అక్కినేని

'స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య'.. ..అక్కినేని తరుచుగా చెప్పే మాట ఇది. చెప్పడమే కాదు ఆచరణలో కూడా చూపించారు. తన లోపాలను ఇతరులకంటే ముందు గ్రహించి, దానికి అనుగుణంగానే పాత్రలు ఎంపిక చేసుకోవడం అక్కినేని విజయరహస్యం. మనిషి అందగాడు కాదు, అరడుగుల ఆజానుబాహు కాదు. మరో వైపు ఎన్టీఆర్ వంటి సర్వాంగ సుందరుడు, ఆజానుబాహుడు తన పోటీగా, సమవుజ్జీగా ఎదుగుతుండగా తన అనర్హతల లేమిని కప్పిపుచ్చుకుంటూ, తన మనోబలాన్ని పెంచుకుంటూ అక్కినేని సాగించిన ఆరోగ్యకరమైన వృత్తిపోటీ ఈ నాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పాలి

అక్కినేని పోషించిన దసరా బుల్లోడు పాత్ర ఒక సంచలనం. అతను టిప్‌టాప్‌గా రంగురంగుల బట్టలు వేస్తాడు. హీరోయిన్‌తో షికార్లు చేస్తాడు. 'పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లోయ్.. నీ పైటకొంగు జారిందే గడుసు పిల్లా' అని ఆమెని టీజ్ చేస్తాడు. డాన్సులు వేస్తాడు. తమ కుటుంబానికి అపకారం తలపెట్టిన దుష్టుల తాట వలిచేస్తాడు. ఆ పాత్రను సృష్టించింది వి.బి. రాజేంద్రప్రసాద్. ఆ సినిమాకి ఆయనే నిర్మాత, అంతేకాదు, ఆ సినిమాతోటే ఆయన దర్శకుడి అవతారమెత్తారు. అలా 'దసరా బుల్లోడు'గా అక్కినేని వీరంగం ఆడేశారు. ఆయన స్టెప్పుల్లో జనం స్టెప్పులేశారు. ఆ సినిమా నుంచే 'డాన్సింగ్ ఐకాన్'గా రూపు దాల్చారు.

నిజాన్ని అంగీకరించండి లేదా పోరాడండి






కొరియోగ్రాఫర్ షేక్ జానీభాషా (జానీ మాస్టర్) లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నటుడు మంచుమనోజ్ స్పందించి.. ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తప్పు చేస్తే అంగీకరించండి లేదా పోరాటం చేయండి. అంతేకాని పారిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. "జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. ఈరోజు మీపై ఇలాంటి ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. తప్పు ఎవరిది అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కోండి. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండి ఈ కేసు విషయంలో వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్‌లకు అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని కోరుతున్నా. దానికంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. ఇబ్బందుల్లో ఉన్న మహిళల బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, కో వర్కర్స్‌కు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కూతురు, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం" అని మనోజ్ పేర్కొన్నారు. అలాగే, మరో నటుడు నాగబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన చేసిన ట్వీట్ జానీ భాషాని ఉద్దేశించినదే అని నెటిజనులు అనుకుంటున్నారు. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే.. "తప్పు చేసిన వ్యక్తి చట్టపరంగా దోషిగా తేలనంతవరకూ.. ఆ వ్యక్తి తప్పు చేసినట్లు కాదు" అని సర్ విలియమ్ గ్యారో అనే రచయిత కొటేషన్‌ను నాగబాబు పోస్ట్ చేశారు.

కొత్త తేదీన కంగువ



సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 14న 'కంగువ'ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ యూనిట్ గురువారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

గుండెను తాకే నాన్న పాట



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. చిత్రబృందం గురువారం 'నాన్న' సాంగ్‌ను విడుదల చేసింది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగే ఈ గీతానికి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా జై కృష్ణ స్వరపరిచారు. నజీరుద్దీన్ ఆలపించారు. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి

అప్‌డేట్స్

చిత్రీకరణ షురూ



'దసరా' కలయిక మరోసారి కుదిరింది. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

సంపత్ నందితో శర్వా



శర్వానంద్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'శర్వా 38' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ గురువారం మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. శర్వా మునుపెన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నారని యూనిట్ తెలిపింది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్

మరోసారి మెగాఫోన్



ధనుష్ తాను కీలకపాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మెగాఫోన్ పట్టారు. డాన్‌పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఇడ్లీ కడై' అనే ఆసక్తికర టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇడ్లీ బండి దగ్గర పిల్లలు నిల్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ధనుష్‌కు దర్శకుడిగా ఇది నాలుగో చిత్రం. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కిరణ్ కౌశిక్.

వారంలోగా తేల్చండి



కంగనా రనౌత్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో నటించి.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ చిక్కులతో చిత్రం విడుదల వాయిదా పడుతోంది. అయితే ఈ సినిమా సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో వారంలోగా ఓ నిర్ణయానికి రావాలని బాంబే హైకోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ సినిమా సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ చిత్రంలో సిక్కు వర్గాన్ని కించపరిచే సన్నివేశాలు ఉన్నాయి కాబట్టి సినిమా విడుదలను నిలిపివేయాలని కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. మరోవైపు కంగన, చిత్ర నిర్మాణసంస్థ జీ ఎంటర్టైన్‌మెంట్స్ ఈ విషయమై బాంబే కోర్టును ఆశ్రయించగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వమని.. సెన్సార్ బోర్డును ఆదేశించలేమని బాంబే హైకోర్టు తెలిపింది. ఈ క్రమంలోనే తాజా విచారణ అనంతరం వారంలోపు ఓ నిర్ణయానికి రావాలని బాంబే కోర్టు సెన్సార్ బోర్డుకు సూచించింది.



టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాదర్బార్‌కు బాధితుల క్యూ

- టీడీపీ ఆఫీస్‌లో వినతులు స్వీకరించిన మంత్రి గొట్టిపాటి, టీడీపీ నేతలు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల బెదిరింపులు, భూకబ్జాలు, అధికారుల అలసత్వంపై బాధితులు ప్రభుత్వ పెద్దలకు ఏకరవు పెట్టారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వినతులతో వచ్చిన బాధితులు క్యూ కట్టారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన కుమార్తె వైద్య చికిత్సకు సాయం చేయాలని తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన బీ రంజిత్ కోరగా, మంత్రి రవికుమార్ రూ.20 వేలు సాయం చేశారు. తమకు వారసత్వంగా వచ్చిన 4 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసి, సెటిల్‌మెంట్‌కు రమ్మంటున్నారని నంద్యాలకు చెందిన రమాదేవి మంత్రికి ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన తమ భూమిని కోర్టు చెప్పినా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏలూరు జిల్లా ఆముదాలపల్లికి చెందిన అట్లూరి వేణుగోపాల్, భాస్కర్ ఫిర్యాదు చేశారు. తన ఎక్స్‌కవేటర్‌ను వైసీపీకి చెందిన జీ కొండూరు ఎంపీపీకి అద్దెకిస్తే.. రెండేళ్ల నుంచి అద్దె ఇవ్వకుండా కులం పేరుతో దూషిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన తలారి రంగారావు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలతో ఐటీఐ అర్హతతో విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించబడిన వారికి స్కిల్ వర్కర్లకు ఇస్తున్న వేతనం కాకుండా అంత కంటే తక్కువ ఇస్తున్నారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2018 డీఎస్సీలో క్రీడా కోటాలో పీఈటీ పోస్టుకు మెరిట్ లిస్టులో మొదటి స్థానంలో ఉన్న తనను ఆపి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ బంధుప్రీతితో మరొకరిని నియమించారని అనంతపురం జిల్లా కూరాకులపల్లికి చెందిన గాజుల పుష్పావతి ఫిర్యాదు చేశారు. బాధితుల వినతులను అధికారులతో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి రవికుమార్ చెప్పారు.

100 రోజులు.. 12,000 వ్యవసాయ కనెక్షన్లు

- పారిశ్రామలు, గృహాలకు నిరంతర విద్యుత్తు సరఫరా
- త్వరలో ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024: గొట్టిపాటి

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోనికి వచ్చిన 100 రోజుల్లోనే 12,000 కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. వంద రోజుల పాలన సందర్భంగా గురువారం వెలగపూడి సచివాలయంలో ఇంధన శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జెన్కో ఎండీ చక్రధర బాబు, డిస్కమ్‌ల సీఎండీలు పాల్గొన్నారు. 'కొత్త వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టిసారించాలి. మొత్తంగా 40వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలి' అని మంత్రి ఆదేశించారు. ఇప్పటి వరకూ అత్యధికంగా ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఐదువేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని అధికారులు వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మీ-సేవ అధికారుల చుట్టూ తిరగకుండా 1912 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి కనెక్షన్ బుక్ చేసుకునే విధానం తీసుకువచ్చామని మంత్రికి అధికారులు వివరించారు. రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ పనులపైనా మంత్రి గొట్టిపాటి ఆరా తీశారు. త్వరలోనే ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024కు తుదిమెరుగులు దిద్దాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.

తొక్కి పడేస్తా.. లుచ్చా నా కొడకా!

- సచివాలయ ఉద్యోగిని దూషించిన టీడీపీ బీసీ నేత

హిందూపురం, సెప్టెంబరు 19: ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ఉలవలను తాను చెప్పినవారికే ఇవ్వాలంటూ టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ సచివాలయ ఉద్యోగిని డిమాండ్ చేశాడు. 'నీ ఇష్టమొచ్చినవారికి పంచుతావా? ఎట్ల పంచుతావో చూస్తా! నాకు రాజకీయం తెలుసు. రౌడీయిజం తెలుసు. నేను డిఫరెంట్ నా కొడుకును..' అంటూ తిట్ల దండకం ఎత్తుకున్నాడు. ఉలవల పంపిణీకి అధికారి వస్తున్నారని, ఆ కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం శాసనకోట గ్రామ సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్‌రెడ్డి ఆయనకు మంగళవారం ఫోన్ చేశారు. దీంతో తాను చెప్పినవారికి ఉలవలు ఇవ్వకుండా జాబితాలో అందరినీ ఎలా చేరుస్తావంటూ వెంకటేశ్ బూతుపురాణం అందుకున్నారు. 'ఇరవై ఏళ్లుగా రాజకీయం చేస్తున్నా. నీలాంటి లుచ్చా నాకొడుకుల్ని చాలామందిని చూశా. తొక్కి పడేస్తా..' అని బెదిరించారు. పనిలో పనిగా ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులనూ దూషించారు. ఈ కాల్ రికార్డింగ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆవేశంలో మాట్లాడానని, క్షమించాలంటూ వెంకటేశ్ ఒక వీడియోను విడుదల చేశారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన వెంకటేశ్.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు సన్నిహితుడు.

23న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముగిసే సమయంలో చివరి అల్పపీడనం ఈ నెల 23న బంగాళాఖాతంలో ఏర్పడనుంది. 21వ తేదీన ఉత్తర అండమాన్‌లో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో మధ్య, దానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో 23న అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నెల్లూరు, కావలి, ఒంగోలు, బాపట్లలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తరాంధ్రలో చాలా చోట్ల, కోస్తాలో అక్కడక్కడా ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, ఈ నెల 21 నుంచి కోస్తాలో వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఆక్వాకు రాయితీలతో ప్రోత్సాహం

- కురుమద్దాలిలో శ్యామ్ ఆక్వా ఎక్స్‌పోర్టును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కొలుసు, కొల్లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర

పామర్రు, సెప్టెంబరు 19: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఆక్వా పరిశ్రమను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం భారీగా రాయితీలు అందిస్తోందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. వరల్డ్ ఫుడ్ ఇండియా- 2024 కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా 24 భారీ పరిశ్రమలను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. దీనిలో భాగంగా కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో రూ.60 కోట్ల పెట్టుబడితో వెలగపూడి గ్రూప్ ఏర్పాటు చేసిన శ్యామ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీనివాస వర్మ పాల్గొని మాట్లాడుతూ, శ్యామ్ ఆక్వాతో దాదాపు రెండు వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రాన్ని ఆక్వా హబ్‌గా మార్చేందుకు రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పామర్రు, పెనమలూరు, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

కూడేరు, సెప్టెంబరు 19: అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు గ్రామానికి చెందిన కౌలు రైతు శేఖర్(34) అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, ఐదేళ్లుగా వేరుశనగ, మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. దిగుబడి సరిగా రాక అప్పులు రూ.6.20 లక్షలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో శేఖర్ ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.

అసాధారణ పత్రం
భాగం-II సెక్షన్ 3 ఉప-సెక్షన్ (ii)
రైల్వేల మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
ప్రకటన
సికింద్రాబాద్, 13 సెప్టెంబర్ 2024

PUB/0930/24

S.O.... రైల్వేల చట్టం, 1989 (24 ఆఫ్ 1989) లోని సెక్షన్ 20ఎ లోని ఉప-సెక్షన్ (I) (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, కేంద్రప్రభుత్వం సంతృప్తి చెందిన తరువాత ప్రజా ప్రయోజనార్థం, మోటుమర్రి - విష్ణుపురం మధ్య విద్యుదీకరణతో పాటు డబ్లింగ్ స్పెషల్ రైల్వే ప్రాజెక్టు అమలు కోసం ఇందులో దిగువ షెడ్యూలులో జతచేయబడిన విధంగా ఇవ్వబడిన సంక్షిప్త వివరణ గల భూమి అవసరమని, అట్టి భూమిని సేకరించుటకు ఇందుమూలముగా తమ ఉద్దేశ్యాన్ని ప్రకటిస్తోంది.
సదరు భూమిలో ప్రయోజనం గల ఎవరేని వ్యక్తి సదరు చట్టంలోని సెక్షన్ 20డి లోని ఉప-సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన నిమిత్తం అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజుల వ్యవధిలోగా అట్టి భూ సేకరణకు మరియు ఉపయోగానికి అభ్యంతరం తెలియచేయవచ్చును.
అట్టి ప్రతి అభ్యంతరమును వ్రాతపూర్వకముగా తగిన కారణాలతో సమర్థ ప్రాధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, నందిగామ, ఎన్‌టిఆర్ జిల్లా వారికి తెలియచేయవచ్చును మరియు సమర్థ ప్రాధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, నందిగామ, ఎన్‌టిఆర్ జిల్లా వారు అభ్యంతరం తెలిపే వ్యక్తికి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్‌చే విచారణకు ఒక అవకాశం ఇస్తారు. అట్టి అన్ని అభ్యంతరముల విచారణల తరువాత, అట్టి ఏవేని తదుపరి విచారణ చేసిన తరువాత, సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే, ఉత్తర్వు ద్వారా అభ్యంతరములను అనుమతించవచ్చును లేదా అనుమతించకపోవచ్చును.
సదరు చట్టంలోని సెక్షన్ 20డి లోని ఉప-సెక్షన్ (1) క్రింద సమర్థ ప్రాధికారి చేసిన ఏదైనా ఉత్తర్వు తుదిగా ఉంటుంది.
ఈ ప్రకటన లోని భూ ప్రణాళికలు మరియు ఇతర భూమి వివరాలు లభిస్తాయి మరియు పైన తెలిపిన సమర్థ ప్రాధికారి కార్యాలయం వద్ద ప్రయోజనం గల వ్యక్తి తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోటుమర్రి-విష్ణుపురం మధ్య విద్యుదీకరణతోపాటు డబ్లింగ్ స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ కొరకు కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.
సేకరణలో ఉన్న భూమి వివరణ: ప్రయాణీకులు మరియు రవాణా సౌకర్యం నిమిత్తం మోటుమర్రి-విష్ణుపురం మధ్య డబ్లింగ్ స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్.

జిల్లా: ఎన్‌టిఆర్ | తాలూకా: జగ్గయ్యపేట

క్ర.సం	గ్రామం పేరు	ఆర్.ఎస్.నం	వర్గీకరణ	పూర్తి విస్తీర్ణం	ఎకరాలలో ప్రాంతం	హెక్టార్లలో ప్రాంతం	భూమి స్వభావం
01	చిల్లకల్లు	68-3	జిడి	11.10	0.533	0.2159	వ్యవసాయం
02	చిల్లకల్లు	58-3	జిడి	11.82	0.026	0.0105	వ్యవసాయం
03	చిల్లకల్లు	59-3	జిడి	1.28	0.319	0.1292	వ్యవసాయం
04	చిల్లకల్లు	60-1C	జిడి	0.58	0.415	0.1681	వ్యవసాయం
05	చిల్లకల్లు	60-2B	జిడి	10.90			వ్యవసాయం
06	చిల్లకల్లు	70-3	జిడి	1.12	0.191	0.0774	వ్యవసాయం
07	చిల్లకల్లు	69-2C	జిడి	0.84	0.281	0.1138	వ్యవసాయం
08	చిల్లకల్లు	81-2	జిడి	0.90	0.318	0.1288	వ్యవసాయం
09	చిల్లకల్లు	79-2	జిడి	2.64	0.040	0.0162	వ్యవసాయం
10	చిల్లకల్లు	80-2D	జిడి	3.15	0.985	0.3989	వ్యవసాయం
11	చిల్లకల్లు	88-4B	జిడి	0.37	0.050	0.0202	వ్యవసాయం
12	చిల్లకల్లు	88-2B	జిడి	2.37			వ్యవసాయం
13	చిల్లకల్లు	89-1B	జిడి	9.09	0.026	0.0105	వ్యవసాయం
14	చిల్లకల్లు	89-2B	జిడి	0.06			వ్యవసాయం
15	చిల్లకల్లు	101-3C	జిడి	0.64	0.057	0.0231	వ్యవసాయం
16	చిల్లకల్లు	101-3D	జిడి	3.25			వ్యవసాయం
17	చిల్లకల్లు	108-1C	జిడి	1.73	0.414	0.1677	వ్యవసాయం
18	చిల్లకల్లు	108-2C	జిడి	0.25			వ్యవసాయం
19	చిల్లకల్లు	106-3	జిడి	2.23	0.320	0.1296	వ్యవసాయం
20	చిల్లకల్లు	107	జిడి	5.40	0.025	0.0101	వ్యవసాయం
21	చిల్లకల్లు	104-2C	జిడి	4.15	0.324	0.1312	వ్యవసాయం
22	చిల్లకల్లు	120-2C1	జిడి	1.07	0.150	0.0608	వ్యవసాయం
23	చిల్లకల్లు	120-1C1A	జిడి	4.59			వ్యవసాయం
24	చిల్లకల్లు	120-1C2	జిడి	7.26			వ్యవసాయం
25	చిల్లకల్లు	88-1	జిడి	0.14	0.020	0.0080	చెరువు
26	చిల్లకల్లు	100	జిడి	0.02	0.004	0.0016	కాలిబాట
27	చిల్లకల్లు	116	జీపీ	7.67	0.150	0.0608	లోకల్ ఫండ్ రోడ్ (ఎన్‌హెచ్-65)
మొత్తం				**94.62**	**4.648**	**1.8824**	
01	కె.అగ్రహారం	17/1	జిడి	54.72	0.920	0.3726	(స్టీల్ ప్లాంట్ భూమి)
02	కె.అగ్రహారం	18	జిడి	28.22	0.910	0.3686	(స్టీల్ ప్లాంట్ భూమి)
03	కె.అగ్రహారం	9	జీపీ	106.31	1.233	0.4994	పాలేరు నది
మొత్తం				**189.25**	**3.063**	**1.2406**	
1	జగ్గయ్యపేట	345	జిడి	13.60	0.659	0.2669	
2	జగ్గయ్యపేట	350-2A1	జిడి	3.29	5.149	2.0853	వ్యవసాయం
3	జగ్గయ్యపేట	350-3A1	జిడి	1.31			వ్యవసాయం
4	జగ్గయ్యపేట	350-3B1A	జిడి	0.50			వ్యవసాయం
5	జగ్గయ్యపేట	350-1	జిడి	3.68			వ్యవసాయం
6	జగ్గయ్యపేట	350-3C1	జిడి	0.80			వ్యవసాయం
7	జగ్గయ్యపేట	350-4A	జిడి	3.50			వ్యవసాయం
8	జగ్గయ్యపేట	350-5B	జిడి	4.59			వ్యవసాయం
9	జగ్గయ్యపేట	362-3A	జిడి	1.98	1.007	0.4078	వ్యవసాయం
10	జగ్గయ్యపేట	362-3C	జిడి	0.98			వ్యవసాయం
11	జగ్గయ్యపేట	389-1C	జిడి	14.73	0.425	0.1721	వ్యవసాయం
12	జగ్గయ్యపేట	348-2D	జిడి	0.05	0.043	0.0174	వ్యవసాయం
13	జగ్గయ్యపేట	388-1C	జిడి	5.16	0.075	0.0304	వ్యవసాయం
14	జగ్గయ్యపేట	420-1A	జిడబ్ల్యు	1.34	0.320	0.1296	వ్యవసాయం
15	జగ్గయ్యపేట	420-2A	జిడబ్ల్యు	2.19			వ్యవసాయం
16	జగ్గయ్యపేట	420-2C	జిడబ్ల్యు	0.20			వ్యవసాయం
17	జగ్గయ్యపేట	433-1C	జిడి	0.22	0.442	0.1788	వ్యవసాయం
18	జగ్గయ్యపేట	433-2C	జిడి	0.32			వ్యవసాయం
19	జగ్గయ్యపేట	426-2C	జిడి	0.43	0.300	0.1215	వ్యవసాయం
20	జగ్గయ్యపేట	470-3A	జిడి	0.99	0.043	0.0174	వ్యవసాయం
21	జగ్గయ్యపేట	470-2B	జిడి	0.66			వ్యవసాయం
22	జగ్గయ్యపేట	454-3	జిడి	0.13	0.05	0.0202	వ్యవసాయం
23	జగ్గయ్యపేట	453-2	జిడి	2.08	0.057	0.0231	వ్యవసాయం
24	జగ్గయ్యపేట	452-1B	జిడి	1.38	0.186	0.0753	వ్యవసాయం
25	జగ్గయ్యపేట	452-2B	జిడి	1.40			వ్యవసాయం
26	జగ్గయ్యపేట	451-2B	జిడి	0.18	0.631	0.2556	వ్యవసాయం
27	జగ్గయ్యపేట	451-3B	జీపీ	0.94			వ్యవసాయం
28	జగ్గయ్యపేట	450-2	జిడి	1.39	0.257	0.1041	వ్యవసాయం
29	జగ్గయ్యపేట	437-2B	జిడి	0.50	0.344	0.1393	వ్యవసాయం
30	జగ్గయ్యపేట	437-1C	జిడి	0.56			వ్యవసాయం
31	జగ్గయ్యపేట	436-1C	జిడి	0.93	0.411	0.1665	వ్యవసాయం
32	జగ్గయ్యపేట	436-2C	జిడి	0.73			వ్యవసాయం
33	జగ్గయ్యపేట	435-2B	జిడి	0.82	0.293	0.1187	వ్యవసాయం
34	జగ్గయ్యపేట	434-2C	జిడి	0.41	0.191	0.0774	వ్యవసాయం
35	జగ్గయ్యపేట	396-2A2H11A	జిడి	284.93	6.617	2.6799	వ్యవసాయం
36	జగ్గయ్యపేట	396-1	జిడి	5.65			వ్యవసాయం
37	జగ్గయ్యపేట	349	జీపీ	9.88	0.164	0.0664	పుంత
38	జగ్గయ్యపేట	361-1	జీపీ	0.31	0.007	0.0028	రైల్వే భూమి
39	జగ్గయ్యపేట	457-6B	జీపీ	0.28	0.104	0.0421	రైల్వే భూమి
40	జగ్గయ్యపేట	417	జీపీ	0.32	0.201	0.0814	కెనాల్
41	జగ్గయ్యపేట	424-2	జీపీ	0.14	0.044	0.0178	బైపాస్ రోడ్డు
42	జగ్గయ్యపేట	422-1B	జీపీ	0.22	0.114	0.0462	బైపాస్ రోడ్డు
43	జగ్గయ్యపేట	427-1A	జీపీ	0.11	0.275	0.1114	రైల్వే భూమి
44	జగ్గయ్యపేట	356-2	జీపీ	5.11	1.053	0.4265	గ్రామకంఠం (అసైన్డ్)
45	జగ్గయ్యపేట	467-2B	జీపీ	0.47	0.043	0.0174	తిప్ప
46	జగ్గయ్యపేట	425	జీపీ	1.29	0.021	0.0085	
47	జగ్గయ్యపేట	458-1	జీపీ	9.09	1.245	0.5042	స్మశానం
మొత్తం				**389.77**	**20.771**	**8.4120**	

జిల్లా: ఎన్‌టిఆర్ | తాలూకా: వత్సవాయి

క్ర.సం	గ్రామం పేరు	ఆర్.ఎస్.నం	వర్గీకరణ	పూర్తి విస్తీర్ణం	ఎకరాలలో ప్రాంతం	హెక్టార్లలో ప్రాంతం	భూమి స్వభావం
01	కాకరవాయి	102/1C	జిడి	0.070	0.1330	0.0539	వ్యవసాయం
02	కాకరవాయి	102/5B2C	జిడి	0.890			వ్యవసాయం
03	కాకరవాయి	102/6B2C	జిడి	3.630			వ్యవసాయం
04	కాకరవాయి	69/1C	జిడి	2.150	0.1070	0.0433	వ్యవసాయం
05	కాకరవాయి	69/2C	జిడి	6.450			వ్యవసాయం
06	కాకరవాయి	47/3C	జిడి	0.960	0.1170	0.0474	వ్యవసాయం
07	కాకరవాయి	47/4C	జిడి	2.800			వ్యవసాయం
08	కాకరవాయి	78/1D	జిడి	1.360	0.0820	0.0332	వ్యవసాయం
09	కాకరవాయి	78/4B	జిడి	2.450			వ్యవసాయం
10	కాకరవాయి	78/5B	జిడి	2.520			వ్యవసాయం
11	కాకరవాయి	68/3C	జిడి	0.120	0.0100	0.0041	వ్యవసాయం
12	కాకరవాయి	73/1C	జిడి	4.280	0.0140	0.0057	వ్యవసాయం
13	కాకరవాయి	56	జిడి	5.570	0.0140	0.0057	వ్యవసాయం
14	కాకరవాయి	45	జిడి	4.340	0.0140	0.0057	వ్యవసాయం
15	కాకరవాయి	57	జీపీ	1.050	0.0140	0.0057	పుంత
16	కాకరవాయి	48	జీపీ	1.050			పుంత
17	కాకరవాయి	73/1D	జీపీ	0.060			రైల్వేస్
మొత్తం				**39.75**	**0.5050**	**0.2045**	
01	కంబంపాడు	36/2	జిడి	7.84	0.525	0.2126	వ్యవసాయం
02	కంబంపాడు	55/1c	జిడి	2.05	0.851	0.3447	వ్యవసాయం
03	కంబంపాడు	55/2c	జిడి	2.39			వ్యవసాయం
04	కంబంపాడు	55/3c	జిడి	3.27			వ్యవసాయం
05	కంబంపాడు	39/3B	జిడి	0.64	0.561	0.2272	వ్యవసాయం
06	కంబంపాడు	39/4C	జిడి	1.38			వ్యవసాయం
07	కంబంపాడు	54/1B	జిడి	9.52	0.901	0.3649	వ్యవసాయం
08	కంబంపాడు	54/2B	జిడి	5.38			వ్యవసాయం
				32.47	**2.838**	**1.1494**	
01	వత్సవాయి	432/5C	జిడి	2.580	0.5590	0.2428	వ్యవసాయం
02	వత్సవాయి	432/6A3	జిడి				వ్యవసాయం
03	వత్సవాయి	432/6B3	జిడి				వ్యవసాయం
04	వత్సవాయి	432/7C	జిడి	1.330			వ్యవసాయం
05	వత్సవాయి	432/8C	జిడి	1.500			వ్యవసాయం
06	వత్సవాయి	417/8C	జిడి	0.250	0.4050	0.1640	వ్యవసాయం
07	వత్సవాయి	417/10B	జిడి	0.260			వ్యవసాయం
08	వత్సవాయి	291/1C1	జిడి	6.920	2.5270	1.0234	వ్యవసాయం
09	వత్సవాయి	291/3	జిడి	1.890			వ్యవసాయం
10	వత్సవాయి	299/3C	జిడి	0.630	0.3070	0.1243	వ్యవసాయం
11	వత్సవాయి	299/3A	జిడి	2.600			వ్యవసాయం
12	వత్సవాయి	435/2	జిడి	4.150	0.0420	0.0170	వ్యవసాయం
13	వత్సవాయి	434/2C	జిడి	1.070	0.1160	0.0470	వ్యవసాయం
14	వత్సవాయి	437/1B	జిడి	4.770	0.1820	0.0737	వ్యవసాయం
15	వత్సవాయి	423/5C	జిడి	0.060	0.3200	0.1296	వ్యవసాయం
16	వత్సవాయి	430/1C	జిడి	2.210	0.1570	0.0636	వ్యవసాయం
17	వత్సవాయి	420/9B	జిడి	1.330	0.0710	0.0288	వ్యవసాయం
18	వత్సవాయి	419/1C	జిడి	0.640	0.1330	0.0539	వ్యవసాయం
19	వత్సవాయి	419/2C	జిడి	1.000			వ్యవసాయం
20	వత్సవాయి	419/3B	జిడి	1.290			వ్యవసాయం
21	వత్సవాయి	419/4B	జిడి	2.530			వ్యవసాయం
22	వత్సవాయి	418/3C	జిడి	5.000	0.2000	0.0810	వ్యవసాయం
23	వత్సవాయి	289/1A	జిడి	5.890	2.1690	0.8784	వ్యవసాయం
24	వత్సవాయి	289/1C	జిడి	0.640			వ్యవసాయం
25	వత్సవాయి	289/2B	జిడి	4.090			వ్యవసాయం
26	వత్సవాయి	292/1	జిడి	0.190	0.1690	0.0684	వ్యవసాయం
27	వత్సవాయి	292/4	జిడి	11.190			వ్యవసాయం
28	వత్సవాయి	306/3A	జిడి	5.100	0.7290	0.2952	వ్యవసాయం
29	వత్సవాయి	306/4A	జిడి	3.420			వ్యవసాయం
30	వత్సవాయి	306/5A	జిడి	0.820			వ్యవసాయం
31	వత్సవాయి	307/1A	జిడి	0.860	0.9950	0.4030	వ్యవసాయం
32	వత్సవాయి	307/2A	జిడి	13.620			వ్యవసాయం
33	వత్సవాయి	304/1A	జిడి	3.490	0.0180	0.0073	వ్యవసాయం
34	వత్సవాయి	304/2A	జిడి	0.860			వ్యవసాయం
35	వత్సవాయి	308/1A1	జిడి	1.900	0.3720	0.1507	వ్యవసాయం
36	వత్సవాయి	308/1C1	జిడి	1.360			వ్యవసాయం
37	వత్సవాయి	309/1A3A	జిడి	0.530	0.2330	0.0944	వ్యవసాయం
38	వత్సవాయి	309/1A3C	జిడి	1.010			వ్యవసాయం
39	వత్సవాయి	297/1C	జిడి	0.250	0.3680	0.1490	వ్యవసాయం
40	వత్సవాయి	297/2B	జిడి	1.710			వ్యవసాయం
41	వత్సవాయి	297/5C	జిడి	1.120			వ్యవసాయం
42	వత్సవాయి	297/6C	జిడి	1.820			వ్యవసాయం
43	వత్సవాయి	291/2	జీపీ	4.160	0.5430	0.2200	కాలువ
44	వత్సవాయి	293	జీపీ	3.330			రోడ్డు
45	వత్సవాయి	296/1	జీపీ	2.540			రోడ్డు
46	వత్సవాయి	302/3	జీపీ	1.870			రోడ్డు
47	వత్సవాయి	308/1B	జీపీ	1.800			కాలువ
48	వత్సవాయి	418/2	జీపీ	3.250			రైల్వేస్
మొత్తం				**114.73**	**10.655**	**4.3153**	
01	లింగాల	155/3C	జిడి	2.09	0.287	0.1162	వ్యవసాయం
02	లింగాల	5	జిడి				వ్యవసాయం
03	లింగాల	8c	జిడి				వ్యవసాయం
04	లింగాల	132/3	జిడి	0.79	0.094	0.0381	వ్యవసాయం
05	లింగాల	136/3	జిడి	0.27	0.051	0.0207	వ్యవసాయం
06	లింగాల	138/3	జిడి	2.11	0.059	0.0239	వ్యవసాయం
07	లింగాల	152/2	జీపీ	2.03	0.021	0.0085	పుంత
08	లింగాల	156	జీపీ	343.23	0.180	0.0729	పాయఖానా
మొత్తం				**350.52**	**0.692**	**0.2803**	
01	చిట్టేల	160/3C	జిడి	5.08	0.040	0.0162	వ్యవసాయం
02	చిట్టేల	165/1B	జిడి	15.57	1.222	0.4949	వ్యవసాయం
03	చిట్టేల	164/2	జిడి	1.79	0.413	0.1673	వ్యవసాయం
04	చిట్టేల	168/2C	జిడి	2.87	0.339	0.1373	వ్యవసాయం
05	చిట్టేల	172/3	జిడి	5.07	0.024	0.0097	వ్యవసాయం
06	చిట్టేల	171/4	జిడి	3.21	0.287	0.1162	వ్యవసాయం
07	చిట్టేల	167	జీపీ	3.96	0.084	0.0340	పోరంబోకు
మొత్తం				**37.55**	**2.409**	**0.9756**	
01	మక్కపేట	227/1A1	జిడి		0.8170	0.3309	వ్యవసాయం
02	మక్కపేట	227/1A3B	జిడి				వ్యవసాయం
03	మక్కపేట	235/1A1	జిడి	1.470	0.5040	0.2041	వ్యవసాయం
04	మక్కపేట	235/1B1	జిడి	0.370			వ్యవసాయం
05	మక్కపేట	235/1C1	జిడి	0.610			వ్యవసాయం
06	మక్కపేట	235/1D1A	జిడి	0.570			వ్యవసాయం
07	మక్కపేట	235/2A1C	జిడి	4.240			వ్యవసాయం
08	మక్కపేట	235/3A1A	జిడి	3.500			వ్యవసాయం
09	మక్కపేట	232/1A1	జిడి	0.470	0.1640	0.0664	వ్యవసాయం
10	మక్కపేట	232/1A3B	జిడి	2.040			వ్యవసాయం
11	మక్కపేట	228/2A	జిడి	1.460	0.0740	0.0300	వ్యవసాయం
12	మక్కపేట	225/1C1	జిడి	2.560	0.4690	0.1899	వ్యవసాయం
13	మక్కపేట	225/1C3	జిడి	1.080			వ్యవసాయం
14	మక్కపేట	225/1A1C	జిడి	1.810			వ్యవసాయం
15	మక్కపేట	225/1B	జిడి	0.850			వ్యవసాయం
16	మక్కపేట	236/1A	జిడి	0.790	0.1440	0.0583	వ్యవసాయం
17	మక్కపేట	236/1C2	జిడి	8.120			వ్యవసాయం
18	మక్కపేట	231	జీపీ		0.0310	0.0126	కాలువ
మొత్తం				**29.94**	**2.203**	**0.8922**	వ్యవసాయం
01	భీమవరం	72/1C2B	జిడి	6.700	0.333	0.1349	వ్యవసాయం
02	భీమవరం	72/1A1A	జిడి	0.020			వ్యవసాయం
03	భీమవరం	73/2C2A	జిడి	0.900	1.444	0.5848	వ్యవసాయం
04	భీమవరం	73/2C2C	జిడి	1.580			వ్యవసాయం
05	భీమవరం	75/1A	జిడి	3.620	1.082	0.4382	వ్యవసాయం
06	భీమవరం	75/2A	జిడి	0.680			వ్యవసాయం
07	భీమవరం	76/1A	జిడి	8.670	0.330	0.1337	వ్యవసాయం
08	భీమవరం	76/2A	జిడి	0.360			వ్యవసాయం
09	భీమవరం	95/1	జిడి	0.060	0.286	0.1158	వ్యవసాయం
10	భీమవరం	81/2	జిడి	5.580	0.339	0.1373	వ్యవసాయం
11	భీమవరం	82/1	జిడి	2.740	0.562	0.2276	వ్యవసాయం
12	భీమవరం	87/1	జిడి	0.590	0.599	0.2426	వ్యవసాయం
13	భీమవరం	3	జిడి	15.210			వ్యవసాయం
14	భీమవరం	83/3A	జిడి	5.310	0.335	0.1357	వ్యవసాయం
15	భీమవరం	84/1A	జిడి	2.990	1.449	0.5868	వ్యవసాయం
16	భీమవరం	84/1C	జిడి	1.160			వ్యవసాయం
17	భీమవరం	84/2A	జిడి	0.210			వ్యవసాయం
18	భీమవరం	84/2C	జిడి	2.970			వ్యవసాయం
19	భీమవరం	64/1	జిడి	2.200	0.152	0.0616	వ్యవసాయం
20	భీమవరం	65/1A	జిడి	6.940	0.171	0.0693	వ్యవసాయం
21	భీమవరం	65/2A	జిడి	0.070			వ్యవసాయం
22	భీమవరం	65/2C	జిడి	4.060			వ్యవసాయం
23	భీమవరం	61/B2C1	జిడి	8.430	0.145	0.0587	వ్యవసాయం
24	భీమవరం	200/3	జిడి	0.430	0.025	0.0101	వ్యవసాయం
25	భీమవరం	201/1A	జిడి	0.440	0.771	0.3123	వ్యవసాయం
26	భీమవరం	201/2B3	జిడి	3.700			వ్యవసాయం
27	భీమవరం	201/1B3	జిడి	5.750			వ్యవసాయం
28	భీమవరం	203/1B1B	జిడి	1.540	0.166	0.0672	వ్యవసాయం
29	భీమవరం	203/1A2C	జిడి	2.300			వ్యవసాయం
30	భీమవరం	206/4B3	జిడి	0.300	0.029	0.0117	వ్యవసాయం
31	భీమవరం	236/1C	జిడి	1.750	0.046	0.0186	వ్యవసాయం
32	భీమవరం	237/2	జిడి	2.070			వ్యవసాయం
33	భీమవరం	255/2C	జిడి	3.550	0.201	0.0814	వ్యవసాయం
34	భీమవరం	256/1B	జిడి	2.020	0.139	0.0563	వ్యవసాయం
35	భీమవరం	256/2B	జిడి	4.850			వ్యవసాయం
36	భీమవరం	257/2B	జిడి	0.010	0.364	0.1474	వ్యవసాయం
37	భీమవరం	257/1C	జిడి	0.090			వ్యవసాయం
38	భీమవరం	3	జిడి	0.080			వ్యవసాయం
39	భీమవరం	5B	జిడి	0.320			వ్యవసాయం
40	భీమవరం	6B	జిడి	3.110			వ్యవసాయం
41	భీమవరం	8	జిడి	2.000			వ్యవసాయం
42	భీమవరం	252/2C	జిడి	8.700	0.254	0.1029	వ్యవసాయం
43	భీమవరం	147/1A2	జిడి	5.680	0.084	0.0340	వ్యవసాయం
44	భీమవరం	71	జీపీ	5.080	0.078	0.0316	పుంత
45	భీమవరం	80	జీపీ	0.800	0.032	0.0130	పుంత
46	భీమవరం	67	జీపీ	8.780	0.245	0.0992	పుంత
47	భీమవరం	208	జీపీ	3.380	0.010	0.0041	పుంత
48	భీమవరం	238/2C	జీపీ		0.011	0.0045	పుంత
49	భీమవరం	254	జీపీ	35.500	0.426	0.1725	వాగు
50	భీమవరం	85	జీపీ	0.820	0.042	0.0170	పుంత
మొత్తం				**184.10**	**10.15**	**4.1107**	

[File No.: W.Con.182/SRP-02/MTM-VNUP/23-24/243/20A/130924

A1195

(మోతీలాల్ భూక్యా)
చీఫ్ ఇంజినీర్/Con-II S.C. రైల్వే, సికింద్రాబాద్

నవ్య
నివేదన

శుక్రవారం
20 సెప్టెంబరు 2024

'ఆలయాలను ప్రత్యేకంగా ఎంపికచేసిన ప్రదేశాల్లో, పాజిటివ్ ఎనర్జీ ఉండే చోట నిర్మిస్తారు. దేవుని విగ్రహం ఆలయం మధ్యలో... గర్భగుడిలో ఉంటుంది. విగ్రహానికి సంప్రదాయబద్ధంగా, వైదిక ప్రక్రియలో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. దాని చుట్టూ ఉన్న ప్రదేశమంతటా అయస్కాంత, విద్యుత్ తరంగాలు నెలకొని ఉంటాయి. అవి నెగెటివ్ ఎనర్జీని తొలగిస్తాయి. దైవదర్శనానికి వచ్చిన భక్తుల్లో పాజిటివ్ ఎనర్జీని నింపుతాయి. వారి దృక్పథంలో మార్పునకు దోహదం చేస్తాయి.'



చింతన

గుడికి ఎందుకు వెళ్లాలంటే..



ఆలయాలకు వెళ్ళడం, అక్కడ కొలువుతీరిన దేవతామూర్తులను పూజించడం అనాది హిందూ సంప్రదాయం. పవిత్ర క్షేత్రాల్లో వేల ఏళ్ళ నాటి ఆలయాలు మొదలు వీధుల్లో ఉండే చిన్న గుడుల వరకూ... ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక భావనలను నింపడానికి దోహదం చేస్తూనే ఉన్నాయి. అయితే దైవం అంతటా ఉన్నప్పుడు, ఆ దైవాన్ని ఎక్కడైనా, ఏ రూపంలోనైనా పూజించే వెసులుబాటు ఉన్నప్పుడు ఆలయాలకు వెళ్ళవలసిన అవసరం ఏముందనే ప్రశ్న కూడా ఈనాటిది కాదు. దీనికి 'ప్రశాంతత కోసం, ఉత్తమమైన ఆలోచనల కోసం' అనేది సామాన్యంగా వినిపించే జవాబు. కానీ ఆలయాలను ఎందుకు దర్శించాలనే ప్రశ్నకు శాస్త్రీయమైన కారణాలను కూడా ప్రాచీన గ్రంథాలు వివరించాయి.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల ద్వారా మనిషి జ్ఞానాన్ని పొందుతాడు. చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, ముక్కు అనే అయిదు ఇంద్రియాల ద్వారా ఇది జరుగుతుంది. కాబట్టి వాటిని 'జ్ఞానేంద్రియాలు' అంటారు. ఆలయంలోని వాతావరణం వల్ల అవన్నీ ఉద్దీపన చెందుతాయి. అక్కడ ఉన్న పాజిటివ్ ఎనర్జీని మనలోకి నింపుతాయి.



గర్భగుడిలో ప్రవేశించినప్పుడు... గంట మోగిస్తాం. మన మెదడులోని కుడి, ఎడమ భాగాలు ఏకత్వాన్ని పొందే విధంగా శబ్దాన్ని వెలువరించేలా ఈ గంటలను తయారు చేస్తారు. మనం గంట మోగించినప్పుడు... నిశితమైన, స్థిరమైన శబ్దం వస్తుంది. ఆ శబ్దం కనీసం ఏడు సెకెన్లపాటు ప్రతిధ్వనిస్తుంది. మన శరీరంలోని ఏడు నాడుల్ని జాగృతం చెయ్యడానికి ఈ ప్రతిధ్వని వ్యవధి సరిపోతుంది. ఫలితంగా మన మెదడులోని ప్రతికూల ఆలోచలన్నీ తొలగిపోతాయి.

గర్భగుడిలో... సాధారణంగా చీకటిగా ఉండే చోట దైవ విగ్రహాన్ని ఉంచుతారు. చాలామంది కళ్ళు మూసుకొని దేవుణ్ణి ప్రార్థిస్తారు. మీరు కళ్లు తెరవగానే విగ్రహం ముందున్న హారతి పళ్లెంలో వెలుగుతున్న కర్పూరాన్ని చూడాలి. చీకటిగా ఉండే చోట కనిపించే ఆ వెలుగు నేత్రాలను జాగృతం చేస్తుంది. కర్పూర హారతిని కళ్ళకు అద్దుకున్నప్పుడు... మీ చేతులు వెచ్చగా అవుతాయి. ఆ చేతులను మీ కళ్ళ మీద ఉంచుకున్నప్పుడు... మీ స్పర్శా శక్తి జాగృతం అవుతుంది.



ఆలయంలో దేవుడికి పుష్పాలు సమర్పిస్తాం. చూడడానికి అందంగా, మంచి పరిమళం వెదజల్లుతూ, మెత్తని స్పర్శతో, రుచికరమైన తేనెతో ఉన్న పుష్పాలను దైవ పూజకు ఉపయోగించాలని చెప్పాయి శాస్త్రాలు. పూలు, కర్పూరం, అగరువత్తుల సువాసనలు కలిసి మీ ఘ్రాణేంద్రియాలను (వాసన చూసే ఇంద్రియాలను) జాగృతం చేస్తాయి. మనసులో ప్రశాంతమైన భావన కలిగిస్తాయి.



గుడిలో తీర్థాన్ని వెండి లేదా రాగి పాత్ర నుంచి ఉద్ధరణితో తీసి ఇస్తారు. తీర్థంలో తులసి ఆకులు వేస్తారు. అవి కనీసం ఆ పాత్రలో ఏడెనిమిది గంటలు ఉంటాయి. రాగి పాత్రలో నిల్వ చేసిన నీటికి శరీరంలో వాత, కఫ, పిత్తాలనే త్రిదోషాలను సమతుల్యం చేసే శక్తి ఉందని, అది పాజిటివ్‌గా ఛార్జ్ అయిన నీరు అని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే తులసి ఆకు ఉంచిన నీరు తాగడం వల్ల రుచి చూసే శక్తి (రస జ్ఞానం) జాగృతం అవుతుంది. నోటి పూత, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఊపిరి తిత్తుల సమస్యలు తదితర అనేక సమస్యలకు రాగి పాత్రలో ఉంచిన తులసి నీరు మంచి పరిష్కారం.

ఆలయంలో ప్రదక్షిణ చేయడం కూడా ఒక ఆనవాయితీ. గర్భగుడి చుట్టూ తిరుగుతున్నప్పుడు... ఘంటానాదాలతో, చేతులతో పట్టుకున్న పూలతో, దీపాలు, దేవతామూర్తుల దర్శనంతో, తీర్థసేవనంతో, కర్పూరాది పరిమళాలతో... మన పంచేంద్రియాల్లో కలిగిన జాగృతి స్థిరపడుతుంది.

ఆలయాలను ప్రత్యేకంగా ఎంపికచేసిన ప్రదేశాల్లో, పాజిటివ్ ఎనర్జీ ఉండే చోట నిర్మిస్తారు. దేవుని విగ్రహం ఆలయం మధ్యలో... గర్భగుడిలో ఉంటుంది. విగ్రహానికి సంప్రదాయబద్ధంగా, వైదిక ప్రక్రియలో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. దాని చుట్టూ ఉన్న ప్రదేశమంతటా అయస్కాంత, విద్యుత్ తరంగాలు నెలకొని ఉంటాయి. అవి నెగెటివ్ ఎనర్జీని తొలగిస్తాయి. దైవదర్శనానికి వచ్చిన భక్తుల్లో పాజిటివ్ ఎనర్జీని నింపుతాయి. వారి దృక్పథంలో మార్పునకు దోహదం చేస్తాయి.



రెండు కనుబొమ్మలకు మధ్య ఉన్న భాగాన్ని 'భ్రూమధ్యం' అంటారు. అది మానవ శరీరంలో అత్యంత కీలకమైన నాడీ కేంద్రం. అది ఎప్పుడూ శక్తిని వెదజల్లుతూనే ఉంటుందని యోగశాస్త్రం చెబుతోంది. ఆ శక్తి నష్టపోకుండా ఉండడానికి... తిలకం లేదా కుంకుమ ధరించడాన్ని మన పూర్వీకులు తప్పనిసరి చేశారు. దానివల్ల మానవ శరీరంలోని శక్తి నిలిచి ఉంటుంది. ఏకాగ్రత కలుగుతుంది. కనుబొమ్మల మధ్యలో... కుంకుమను ధరించినప్పుడు... అక్కడ ఉండే ఆజ్ఞా చక్రం దానంతట అదే నొక్కుకుంటుంది. తద్వారా ముఖ కండరాలకు రక్త సరఫరా మెరుగుపడుతుంది. ఈ విధంగా ఆలయ దర్శనం వల్ల ఆధ్యాత్మిక ప్రయోజనాలే కాదు... ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఎన్నో.

ఆలయంలో ప్రవేశించేటప్పుడు పాదరక్షలను బయట విడిచిపెట్టాలనేది కచ్చితమైన నియమం. అక్కడ నేల పాజిటివ్ వైబ్రేషన్స్‌కు వాహకంగా ఉంటుంది. పాదాల నుంచి ఆ పాజిటివ్ వైబ్రేషన్లు శరీరం మొత్తానికి వ్యాపిస్తాయి. కాబట్టే ఆలయంలోకి చెప్పులు లేకుండా వెళ్ళాలనే నియమం పెట్టారు మన పూర్వులు. అంతేకాదు, చెప్పులకు అంటిన దుమ్ము, ధూళి, పురుగులు లాంటివి పవిత్రమైన, స్వచ్ఛమైన ఆలయ వాతావరణాన్ని నాశనం చేస్తాయి. నెగెటివ్ ఎనర్జీకి కారణం అవుతాయి.

గీతాసారం

విషయవాంఛను వదులుకోవాలి

"ఇంద్రియాల ద్వారా విషయాలను స్వీకరించని వ్యక్తి నుంచి ఇంద్రియ వస్తువులు దూరమైపోతాయి. కానీ 'రస్' (కాంక్ష/రాగం) దూరం కాదు. పరమాత్మను తెలుసుకున్నప్పుడు మాత్రమే కోరిక అంతమైపోతుంది" అని శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు. ఇంద్రియాలకు మెదడులో నియంత్రకాలు ఉంటాయి. మనస్సు అనేది ఇంద్రియ నియంత్రకాల కలయిక. ఈ నియంత్రకాలపై దృష్టి సారించాలని శ్రీకృష్ణుడు మనకు సలహా ఇస్తున్నాడు. ఇక్కడ శ్రీకృష్ణుడు 'రస్' అనే పదాన్ని ఉపయోగించాడు. పండిన పండ్లను కోసి, పిండినప్పుడు తప్ప రసం కనిపించదు. పాలలో ఉండే వెన్న పరిస్థితి కూడా అంతే. అలాగే ఇక్కడ 'రస్' అంటే ఇంద్రియ నియంత్రకాలలో ఉండే అంతర్గతమైన కోరిక. అజ్ఞాన స్థాయిలో... ఇంద్రియాలతో ఇంద్రియ వస్తువులు జతపడి ఉంటాయి. సుఖ దుఃఖాల ద్వంద్వాల మధ్య ఊగిసలాడుతూ ఉంటాయి.



తదుపరి దశలో... కోరికలను తీర్చుకొనే మార్గం లేక... ఆ కోరికలను మనం వదిలేస్తాం. ఉదాహరణకు... డబ్బు లేకపోవడం లేదా వైద్యుల సలహా లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా... మిఠాయి లాంటి ఇంద్రియ వస్తువులను వదిలేస్తాం. కానీ మిఠాయి పట్ల కోరిక మిగిలిపోతుంది. నైతికత, దేవుడు లేదా చట్టం పట్ల భయం, ప్రతిష్ఠ పోతుందనే అనుమానం, వృద్ధాప్యం లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా కోరికలను వదిలేస్తాం. కానీ ఏ కారణం లేకుండానే విషయవాంఛలను అంటే అన్ని కోరికలను వదిలేసే పరమ దశ గురించి శ్రీకృష్ణుడు పై శ్లోకంలో సూచిస్తున్నాడు.

దీని కోసం ఒక ఆచరణాత్మకమైన చిట్కాను శ్రీకృష్ణుడు చెప్పాడు. అక్కడ ఆయన ఇంద్రియాలను అడవి గుర్రాలతో పోల్చాడు. శిక్షకుడు కొంత కాలం వాటితోపాటు పరుగెత్తి... వాటిని నియంత్రణలోకి తీసుకువస్తాడు. వాటిని పూర్తిగా అర్థం చేసుకున్నాక... తన ఇష్టానుసారం వాటి మీద స్వారీ ప్రారంభిస్తాడు. ఇక్కడ గమనించవలసిన రెండు విషయాలు ఏమిటంటే... శిక్షకుడు గుర్రాలను ఒక్కసారిగా నియంత్రించలేదు. అలా చేస్తే అవి అతణ్ణి కింద పడేస్తాయి. అదే విధంగా, మన ఇంద్రియాలను ఒక్కసారిగా నియంత్రించడం ప్రారంభించలేం. వాటిని అర్థం చేసుకొని, నెమ్మదిగా అదుపులోకి తేవాలి.

అంతవరకూ కొంతకాలం పాటు వాటి వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలి. రెండోది, మనం ఇంద్రియాల ప్రభావంలో ఉన్నప్పుడు... వాటిని ప్రస్తుతం నియంత్రించలేకపోయినా... భవిష్యత్తులో నియంత్రించాలనే నిరంతర అవగాహన మనకు ఉండాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్టు... అవగాహన, కోరిక... ఈ రెండిటిలో ఒకటి మాత్రమే మనలో ఉండగలదు. అవగాహన ఉన్నప్పుడు మనల్ని కోరికలు వాటి అధీనంలోకి తీసుకోలేవు. ఎందుకంటే అజ్ఞానంలో ఉన్నప్పుడే వాటి అధీనంలోకి మనం వెళ్ళడం జరుగుతుంది.

కె. శివప్రసాద్
ఐఏఎస్

నానక్ వారసత్వం

సిక్కుల మొదటి గురువు, సిక్కు మత స్థాపకుడైన గురు నానక్ సత్ప్రవర్తనే మనిషిని భగవంతుడికి చేరువ చేస్తుందని నమ్మేవారు. అదే అందరికీ బోధించేవారు. అహం మనిషికి మహా శత్రువు అనీ, అహంకారాన్ని విడిచిపెట్టి, వినయంతో నడుచుకోవడమే ఆ పరమాత్మకు మనల్ని దగ్గర చేస్తుందనీ చెప్పేవారు. ఆయనను దైవసమానంగా ఆరాధించే శిష్యులు ఎంతోమంది ఉండేవారు.

ఒకరోజు ఆయన తన శిష్యుల్లో ఒకరిని పిలిచి... ఒక వేదికను నిర్మించాలని ఆదేశించారు. ఆ శిష్యుడు ఆ ప్రకారం చేశాడు. దాన్ని చూసిన నానక్ "వెంటనే దాన్ని పడగొట్టు" అన్నారు. శిష్యుడు ఆ వేదికను పడగొట్టాడు. "మళ్ళీ దాన్ని నిర్మించు" అన్నారు నానక్. శిష్యుడు నిర్మించాడు. "మళ్ళీ పడగొట్టెయ్" అని చెప్పారు నానక్. అలా నానక్ పదేపదే ఆ వేదికను నిర్మించాలని, ఆ తరువాత దాన్ని పడగొట్టాలని చెబుతున్నారు శిష్యుడు ఆయన ఆదేశాలను అక్షరాలా పాటిస్తున్నాడు. గురునానక్ పెద్ద కుమారుడు శ్రీచంద్ ఇదంతా గమనించాడు. అతను శిష్యుడితో "మా తండ్రిగారు ఆ వేదికను మళ్ళీ మళ్ళీ కట్టమంటున్నారు. వెంటనే పడగొట్టమంటున్నారు. ఎన్నిసార్లు ఇలా చేస్తావు? నీకు విసుగు, కోపం రావడం లేదా?" అని అడిగాడు. అప్పుడు ఆ శిష్యుడు "అయ్యా! నేను నా గురుదేవులు చెప్పినది చేస్తున్నాను. గురుదేవుల ఆదేశాలను పాటించడమే నా సాధన" అని బదులిచ్చాడు.

మరో సందర్భంలో శ్రీచంద్‌ను గురునానక్ పిలిచి "ఇవాళ నాకు అత్యవసర సేవా కార్యక్రమాలు ఉన్నాయి. పశువుల పాకను శుభ్రం చెయ్యలేను. నువ్వు ఆ పని చెయ్యి" అని చెప్పారు. శ్రీచంద్ కొద్దిసేపటి క్రితమే స్నానం చేసి, మంచి దుస్తులు వేసుకున్నాడు. 'పశువుల పాకను శుభ్రం చేస్తే నా

సద్బోధ




దుస్తులు బురదైపోతాయి. నేను మళ్ళీ స్నానం చెయ్యాలి' అనుకున్నాడు. అది అతనికి ఇష్టం లేకపోయింది. అందుకే "తండ్రీ! నేను ఆలయానికి వెళ్ళాలి. పశువుల పాక పని వేరెవరికైనా అప్పగించండి" అని చెప్పి, బయటకు వెళ్ళిపోయాడు. తన శిష్యులలో ఒకరైన లెహ్నాను నానక్ పిలిచి, పశువుల పాకను శుభ్రం చెయ్యమన్నారు. లెహ్నా కూడా అప్పుడే స్నానం చేసి వచ్చాడు. కానీ గురువు మాటను శిరసా వహించి, తక్షణమే ఆయన ఆ పని చేశాడు. తరువాత మళ్ళీ స్నానం చేసి, ఆలయానికి వెళ్ళాడు.

ఆ మరునాడే సిక్కుల మహా సమ్మేళనం జరిగింది. ఆ కార్యక్రమంలో... లెహ్నా పేరును 'అంగద్ దేవ్'గా గురునానక్ మార్చారు. తన తరువాత... గురుపరంపరకు వారసుడిగా అతణ్ణి ప్రకటించారు. ఈ నిర్ణయం ఆయన శిష్యులకు ఆశ్చర్యం కలిగించింది. "గురుసాహెబ్! మీ పెద్ద కుమారుణ్ణి కాకుండా లెహ్నాను మీ వారసుడిగా ఎందుకు ప్రకటించారు? ఇది సంప్రదాయాన్ని అతిక్రమించడం కాదా?" అని అడిగారు. అప్పుడు గురునానక్ "నా వారసత్వానికి శ్రీచంద్ కన్నా లెహ్నాకు అంటే అంగద్ దేవ్‌కు ఎక్కువ అర్హతలు ఉన్నాయి. నిన్న జరిగిన సంఘటననే దీనికి ఉదాహరణగా చెబుతాను. పశువుల పాకను శుభ్రం చెయ్యాలని నేను అడిగినప్పుడు... మళ్ళీ స్నానం చెయ్యాలనే కారణంతో శ్రీచంద్ దానికి ఒప్పుకోలేదు. చిన్న ప్రదేశమైన పశువుల పాకనే శుభ్రం చెయ్యడానికి ఇష్టపడని వాడు సమాజాన్ని ఎలా పరిశుద్ధం చెయ్యగలడు? ఆ పని లెహ్నా సంతోషంగా చేశాడు. అందుకే అతను సమాజానికి పనికి వచ్చే మనిషి అయ్యాడు. నా వారసత్వాన్ని అందుకోవడానికి అర్హుడయ్యాడు" అని చెప్పారు. గురునానక్ తరువాత... రెండో సిక్కు గురువుగా... గురు అంగద్ చరిత్రలో నిలిచారు. నిస్వార్థపరత్వం, విధేయత ఉన్నవారు గురు అనుగ్రహాన్ని, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానాన్ని పొందుతారనే సత్యానికి గురు అంగద్ కథ మంచి ఉదాహరణ.

జ్ఞానోదయం పొందాలంటే...

'మనిషి పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందడానికి అంటే జ్ఞానోదయం కలగడానికి ఎంతకాలం పడుతుంది?' అనే ప్రశ్న ఒకరి నుంచి నాకు ఎదురయింది. ప్రధానంగా గుర్తించవలసిన విషయం ఏమిటంటే... ఇది సమయానికి సంబంధించిన విషయం కాదు. ఎందుకంటే... జ్ఞానం మీలోనే ఉంది. విమ్మల్ని మీరు తెలుసుకోవడమే జ్ఞానం. మరి మిమ్మల్ని మీరు తెలుసుకోవాలంటే... దానికి సమయం పడుతుందా? నిజానికి పట్టకూడదు. కానీ మిమ్మల్ని మీరు ఒకేసారి పరమాత్మకు సమర్పించుకోవడం లేదు. వాయిదాల పద్ధతిలో ఆత్మసమర్పణ చేసుకుంటున్నారు.

సద్గురువాణి



కాబట్టే ఎక్కువ సమయం పడుతోంది. జ్ఞానోదయం పొందడానికి చిన్న చిన్న వాయిదాల ద్వారా వంద జీవిత కాలాలు తీసుకోవాలనుకుంటున్నారా? లేదంటే ఈ రోజే చేయాలనుకుంటున్నారా? అనేది మీ ఇష్టం. జ్ఞానాన్ని పొందడానికి ఎంత సమయం అవసరం అనేది... దాని గురించి తెలుసుకోవాలనే కోరిక మీలో ఎంత తీవ్రంగా ఉందనే అంశం ఆధారపడి ఉంటుంది. ఏదైనా ప్రశ్న మిమ్మల్ని దహించివేస్తున్నప్పుడు, ఇంకొక ఆలోచనకు తావివ్వకుండా, మీరు ఒక్క మాట కూడా మాట్లాడేనంతగా అది మిమ్మల్ని వెంటాడుతున్నప్పుడు... తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టదు.

జ్ఞానోదయం పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ కలుగనక్కర్లేదు. అది నిశ్శబ్దంగా జరగవచ్చు. ఒక పువ్వు వికసించినట్టు జరగవచ్చు. ఈ భూమి మీద జరిగే గొప్ప విషయాలు ఎలాంటి చప్పుడు చెయ్యవు. ఒక విత్తనం మొక్కగా, మొక్క చెట్టుగా మారుతాయి. ఇది చిన్న విషయం కాదు. మహాద్భుతం. అలా జరిగినప్పుడు అవి శబ్దాలు చేస్తున్నాయా? కానీ చిన్న చిన్న విజయాలు చాలా గోల పెడతాయి. ఉదయాన లేవగానే కోడి గట్టిగా అరుస్తుంది. కానీ సృష్టిలో గొప్పవన్నీ నిశ్శబ్దంగానే జరుగుతాయి. కాబట్టి జ్ఞానోదయం కూడా నిశ్శబ్దంగానే జరుగుతుంది. అప్పుడు మనం ఒక పార్శ్వంలోంచి మరో పార్శ్వంలోకి ప్రవేశిస్తాం. అయితే.. తోటలో పువ్వు నిశ్శబ్దంగా వికసించినా... ఆ తరువాత దాన్ని మీరు పట్టించుకోకుండా ఉండలేరు. దాని సువాసనను, అందాన్నీ ఎవరూ కాదనలేరు.

జ్ఞానోదయం పొందడం చాలా సులభం. కానీ ఇది మీకు ఇప్పటికీ దూరంగా ఉండడానికి కారణం... తెలుసుకోవాలనే తపన మీలో మందకొడిగా ఉండడమే. అది ఇంకా విమ్మల్ని దహించడం లేదు. అది మీలో ఇంకా ఒక ముఖ్యమైన అంశంగా మారలేదు. సత్యాన్ని తెలుసుకోవడాన్ని మీరు వినోదంగా భావిస్తే... అది ఎప్పటికీ జరగలేదు. 'అది తప్ప నాకు ఇంకేదీ అక్కరలేదనే స్థాయిలో మీరు దాన్ని కోరుకుంటే, ఆ దిశగా ప్రయత్నిస్తే... ఒక్క క్షణంలోనే తెలుసుకోగరు. ఎందుకంటే మీరు తెలుసుకోవాలనుకుంటున్నది మీలో ఉంది. మీలో ఉన్నదాన్ని మీరు తప్ప మరెవరూ అడ్డుకోలేరు. కనుక మీ దారికి మీరే అడ్డుపడకుండా ఉంటే చాలు. సత్యాన్ని మీరు వాయిదాల పద్ధతిలో తెలుసుకోవచ్చు లేదా ఒకేసారి తెలుసుకోవచ్చు. అదంతా మీ చేతుల్లోనే ఉంది.

● సద్గురు జగ్గీవాసుదేవ్

జెన్ కథ

అర్హత ఉంటేనే ఆశించాలి


'జెండో' అంటే కత్తి దూసే యుద్ధ కళ అని అర్థం. ఆ కళలో నైపుణ్యం సాధించి, ఇతరులకు నేర్పే జెన్ గురువును 'జెండో గురువు' అంటారు. ఈ యుద్ధ కళలో అపారమైన కృషి చేసి, సంపూర్ణ నైపుణ్యాన్ని పొందిన వ్యక్తి... యుద్ధ సమయంలో తన శరీరాన్ని దృఢమైన శక్తి స్తంభంగా మార్చగలడనీ, ప్రత్యర్థి కత్తితో అతణ్ణి కొడితే... ఆ కత్తి విరగాల్సిందే తప్ప అతనికి ఎలాంటి గాయం కాదనీ చెబుతారు. జపాన్‌లో అలాంటి జెండో గురువు ఉండేవాడు. అతను వృద్ధుడయ్యాడు. శరీరం చిక్కిపోయింది. సంప్రదాయం ప్రకారం... శిష్యుల్లో ఒకరిని తన వారసునిగా అతను ప్రకటించారు. వారసుడు కావాలనుకొనే శిష్యుడు... ద్వంద్వ యుద్ధంలో గురువును ఓడించాలి.

ఆ గురువు దగ్గర ఎంతో కాలంగా ఒక శిష్యుడు ఉన్నాడు. యుద్ధ విద్యలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాడు. గురువు తనను వారసుడిగా ప్రకటిస్తాడని అతను చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్నాడు. కానీ గురువు ఆ సంగతే పట్టించుకోవడం లేదు. చివరకు ఒక రోజు అతను గురువు దగ్గరకు వెళ్ళి "గురువుగారు! మీరు బాగా వృద్ధులయ్యారు. మీ ప్రాణం ఎప్పుడైనా పోవచ్చు. కాబట్టి నన్ను వారసుడిగా ప్రకటించండి. ద్వంద్వ యుద్ధంలో మిమ్మల్ని తప్పకుండా ఓడించగలను. రండి! యుద్ధం చేద్దాం" అన్నాడు.

అప్పుడు గురువు నవ్వి "సరేలే! ముందు సమీపంలో ఉన్న ఆ మఠానికి వెళ్ళు. అక్కడ నా శిష్యుడే ఒకడున్నాడు. ముందు అతణ్ణి ఓడించి రా. ఆ తరువాత మనమిద్దరం యుద్ధం చేద్దాం" అన్నాడు.

శిష్యుడు వెంటనే ఆ మఠానికి వెళ్ళాడు. గురువు చెప్పిన వ్యక్తిని చూశాడు. అతనొక సాధువు, బక్కగా, బలహీనంగా ఉన్నాడు. అతనికి తను వచ్చిన విషయం చెప్పి... "ఇదిగో ఈ కత్తి తీసుకో. యుద్ధం చేద్దాం" అని అడిగాడు శిష్యుడు.

"నిన్ను ఓడించడానికి నాకు కత్తి కావాలా? అక్కర్లేదులే. యుద్ధం ఆరంభించు" అంటూ లేచి



నిలబడిన సాధువు... ఒక స్తంభంలా మారి గిరగిరా తిరగడం ప్రారంభించాడు.

వచ్చిన శిష్యుడు కత్తిని ఝుళిపించడానికి జంకాడు. ముందుకు ఒక అడుగైనా వెయ్యలేకపోయాడు. ఈలోగా... స్తంభంగా మారిన సాధువు అతనివైపు రావడం మొదలుపెట్టాడు. సాధువును తప్పించుకోవడానికి శిష్యుడు నానా అవస్థలు పడ్డాడు. చివరకు చెమటలు కక్కుతూ నేలమీద కూలబడిపోయాడు. చేతులు జోడించి "నన్ను క్షమించండి. నన్ను కాపాడండి" అని వేడుకున్నాడు.

అప్పుడు సాధువు మామూలు స్థితికి వచ్చి "ఈమాత్రం దానికే ఇలా అలసిపోయావే? నీవా నన్ను ఓడించి, గురువుగారినీ ఓడించి... వారసుడు కాదలచినవాడివి? దేనికైనా అర్హత పొందాలి. అర్హత పొందిన తరువాతే ఆశించాలి. పో, వెనక్కు పో! గురువుగారిని క్షమించమని వేడుకో. నిన్ను వదిలిపెడుతున్నాను" అన్నాడు.

శిష్యుడు తిరిగి వచ్చి, గురువు పాదాల మీద పడి, జరిగినదంతా వివరించాడు. తల దించుకొని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

● రాచమడుగు శ్రీనివాసులు


సుభాషితం

అదే మేలు

వరం తుంగా చ్ఛృంగా ద్గురుశిఖరిణః క్వాపి విషమే
పతిత్వాయం కాయః కఠినదృషదంతే విదళితః
నరం న్యస్తో హస్తః ఫణిపతిముఖే తీక్ష్ణదశనే
వరం వహ్నౌ పాతస్త దపి న కృత శీలవిలయః

మంచి గుణాలను మనిషి వదులుకోకూడదని తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి హితవు చెప్పాడు. దాన్ని తెలుగులో...

ఉరుతర పర్వతాగ్రమున నుండి దృఢంబగు రాతి మీద స



త్వరముగ ద్రెళ్ళి కాయము హతంబుగ చేయుట మేలు, గాలిమే
పరిదొరవాత కేలిడుట బాగు, హుతాశన మధ్య పాతమున్
వరమగు, జారుశీల గుణ వర్జన మర్హముకాదు చూడగన్... అనే పద్యరూపంలో ఏనుగు లక్ష్మణ కవి అనువదించాడు.

భావం:
మనిషి తన శీలాన్ని అంటే మంచి గుణాలను, సత్ప్రవర్తనను వదులుకోవడం కన్నా పెద్ద శిఖరం పైనుంచి దూకి, కఠినమైన రాతి మీద పడి... నుజ్జు నుజ్జయిపోవడం మంచిది. భయానకమైన విషజ్వాలను కక్కుతున్న ఆదిశేషుడి నోటిలో చెయ్యి పెట్టడం మంచిది. నిప్పుల్లో పడి బూడిదైపోవడం మంచిది. సద్గుణాలను విడిచిపెట్టినవారు జీవించడం కన్నా నశించిపోవడమే మేలు.

ఏబీసీ చైర్మన్‌గా మనోరమ డైరెక్టర్ మ్యాథ్యూస్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: పత్రికల సర్క్యులేషన్‌లను ధ్రువీకరించే ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ) సంస్థ చైర్మన్‌గా మళయాళ మనోరమ గ్రూప్ సంస్థల డైరెక్టర్, పత్రిక చీఫ్ అసోసియేట్ ఎడిటర్ రియాద్ మ్యాథ్యూస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన 2024-25 సంవత్సరానికి ఏబీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డిప్యూటీ చైర్మన్‌గా ప్రకటన కర్తల నుంచి ఐటీసీ కరుణేశ్ బజాజ్, కార్యదర్శిగా టైమ్స్ గ్రూప్ ప్రతినిధిగా మోహిత్ జైన్, కోశాధికారిగా ప్రకటనకర్తల నుంచి మ్యాడిసన్ ప్రతినిధి విక్రమ్ షకూజా ఎన్నికయ్యారు. చైర్మన్ మ్యాథ్యూస్ 2009 ఆగస్టు నుంచి ఆయన పీటీఐ వార్తాసంస్థ డైరెక్టర్ల బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు. 2016-17 మధ్య కాలంలో పీటీఐ చైర్మన్‌గా పని చేశారు. వియన్నాలోని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్నారు. మేరీల్యాండ్ విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో మాస్టర్స్ చేసిన ఆయన వాషింగ్టన్ పోస్ట్, వాషింగ్టన్ టైమ్స్, క్యాపిటల్ న్యూస్ సర్వీస్ తదితర సంస్థల్లో పని చేశారు.

హరియాణా కాంగ్రెస్ పార్టీదే..

- ప్రతి మూడు స్థానాలకు రెండింటిలో బీజేపీకి ఓటమే
- రాహుల్‌కు పెరుగుతున్న ఆదరణ: కేకే సర్వే కిరణ్ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లు గెలుస్తుందని.. వైసీపీ 11 సీట్లకే పరిమితం అవుతుందని అత్యంత కచ్చితంగా చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి హరియాణా ఎన్నికలపైనా తమ అంచనాలను వివరించారు. వచ్చే నెలలో జరుగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. హస్తం పార్టీకి 100% విజయావకాశాలు ఉన్నాయని తమ సర్వేలో వెల్లడైనట్లు చెప్పారు. హరియాణా సహా రాబోయే మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ వందకు వంద శాతం ఓడిపోతుందని స్పష్టం చేశారు. ఈ రాష్ట్రాలలో బీజేపీని మునిగిపోతున్న టైటానిక్‌గా అభివర్ణించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కిరణ్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. హరియాణాలో పోటీ చేసే ప్రతి మూడు స్థానాల్లో బీజేపీ రెండింటిలో ఓడిపోతుందని తెలిపారు. రైతులు, జాట్‌లు ఆ పార్టీపై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసి రానుందని వివరించారు. హరియాణాలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకపోవడం ఆమ్‌ఆద్మీ పార్టీకి నష్టం చేకూర్చనుందని తెలిపారు. దేశవ్యాప్తంగా రాహుల్‌కు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. హరియాణాలో బీజేపీ, కాంగ్రెస్ నేతలకు రెబల్ అభ్యర్థులు గుబులు రేపుతున్నారు. టికెట్ దక్కకపోవడంతో పలువురు ప్రముఖులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు.

సీపీఎం తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్?

- పోటీలో ఏపీకి చెందిన బీవీ రాఘవులు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎవరిని నియమించాలన్న విషయమై ఆ పార్టీలో అంతర్గతంగా ముమ్మర చర్చలు జరుగుతున్నాయి. సీతారాం ఏచూరి మృతితో పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఎవరికి ఆ బాధ్యతలు అప్పగించాలన్నదానిపై పార్టీ నేతలు చర్చిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడులో జరగనున్న సీపీఎం మహాసభల్లో పార్టీ నూతన కార్యదర్శి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో అప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించాలంటూ పార్టీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ.. సీనియర్ నేత, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్‌ను అభ్యర్థించే అవకాశాలున్నాయి. మరోవైపు పార్టీ పొలిట్‌బ్యూరోలో ఉంటూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీవీ రాఘవులు, కేరళకు చెందిన బేబీ లేదా విజయ రాఘవన్, బెంగాల్‌కు చెందిన నీలోత్పల్ బసు, మహారాష్ట్రకు చెందిన అశోక్ ధావళే ప్రధాన కార్యదర్శి రేసులో ఉన్నారు.

విపక్షనేతలకు స్టాండింగ్ కమిటీల బాధ్యతలు

- థరూర్‌కు విదేశీ వ్యవహారాలు, దిగ్విజయ్‌కు విద్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు పలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు నేతృత్వం వహించనున్నారు. శశిథరూర్ విదేశీ వ్యవహారాలు, విద్యకు సంబంధించిన ప్యానెల్‌కు దిగ్విజయ్ సింగ్, వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీకి పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, గ్రామీణాభివృద్ధి ప్యానెల్‌కు కోరాపూట్ ఎంపీ సప్తగిరి ఉలాకా నేతృత్వం వహిస్తారు. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాక ఈ పేర్లను ప్రకటించినట్లు తెలిసింది. పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా జైరాం రమేశ్ కొనసాగుతారు.

మూర్ఖుల స్వర్గంలో ఉండి మాట్లాడుతున్నారు..

- రాహుల్‌పై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పరోక్ష విమర్శలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి మండిపడ్డారు. విదేశాల్లో భారత సంస్థలను కించపరిచేలా మాట్లాడేవారిని ఎవరూ మెచ్చుకోరని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. వారు మూర్ఖుల స్వర్గంలో ఉండి మాట్లాడుతున్నారని.. అసలు భారత్ మారిందనే విషయాన్ని మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. గురువారం సంసద్ టీవీ కార్యక్రమంలో ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. 'మన నాయకుడిని దూషిస్తున్నారు. మన సంస్థల వైపు వేలెత్తి చూపిస్తున్నారు. దేశంలోనూ.. దేశం బయటా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఎవరైనా ప్రశంసించగలరా..?' అని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌కు భారత ఆయుధాలు?

- ఇటలీ, చెక్ రిపబ్లిక్ నుంచి మళ్లింపు!
- రాయిటర్స్ నివేదిలో వెల్లడి.. ఖండించిన భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: భారత్‌లో తయారవుతున్న ఆయుధాలు ఉక్రెయిన్‌కు చేరుతున్నాయా? భారత్ నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకునే పలు ఐరోపా దేశాలు.. అక్రమంగా వాటిని ఉక్రెయిన్‌కు అందజేస్తున్నాయా? ఈ అంశంపై రష్యా ఇప్పటికే పలుమార్లు భారత్‌ను అప్రమత్తం చేయగా.. రాయిటర్స్ తాజా నివేదిక ఒకటి ఈ వాదనలను బలపరుస్తోంది. నిజానికి భారత్ దిగుమతి చేసుకునే ఆయుధాల్లో 60% రష్యాకు చెందినవే. అయితే.. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లోని పలు కంపెనీలు తయారు చేస్తున్న ఆయుధాలు, ఆర్టిలరీ షెల్స్, తూటాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కోవలో ఐరోపాలోని చెక్ రిపబ్లిక్, ఇటలీ వంటి దేశాలు భారత్ నుంచి షెల్స్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆ దేశాల నుంచి ఆయుధాలను తీసుకుంటున్న ఉక్రెయిన్.. వాటిని రష్యాతో పోరులో విరివిగా వినియోగిస్తోందని రష్యా ముందునుంచీ ఆరోపిస్తోంది. జూలైలో ఇరు దేశాల విదేశాంగ మంత్రుల మధ్య జరిగిన చర్చల్లోనూ ఈ అంశం ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన విషయం తెలిసిందే.! రాయిటర్స్ తాజా నివేదికను బట్టి.. ఉక్రెయిన్ గత ఏడాది కాలంగా భారత తయారీ ఆర్టిలరీ షెల్స్‌ను వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటలీ, చెక్ రిపబ్లిక్, స్పెయిన్ నుంచి ఉక్రెయిన్‌కు భారత ఆయుధాలు అంది ఉంటాయని పేర్కొంది. దీనిపై ఉక్రెయిన్, ఇటలీ, స్పెయిన్, చెక్ రిపబ్లిక్ రక్షణశాఖ వర్గాలను ప్రశ్నించగా.. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని రాయిటర్స్ వెల్లడించింది. అయితే.. రాయిటర్స్ నివేదికను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తప్పుబట్టింది. ఈ నివేదిక కేవలం కల్పితమేనని, తప్పుదోవ పట్టించేవిధంగా ఉందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జమిలి ఎన్నికలు ఓ పార్టీ దురాశ: స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించడం గర్హనీయమని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. జమిలిఎన్నికలు అసాధ్యమని, ఓ పార్టీ దురాశతో ప్రజాస్వామ్యాన్ని వంచించాలని ప్రయత్నిస్తోందని గురువారం ఒక ప్రకటన ఆగ్రహం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రస్తుతమున్న రాష్ట్రాల పరిపాలనా కాలాన్ని కలంపోటుతో పూర్తిగా రద్దు చేయాలని కేంద్రం భావిస్తోందన్నారు. ఈ ప్రతిపాదనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. కేంద్ర పాలకులు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారించాలని స్టాలిన్ సూచించారు.

5డీ క్రిస్టల్ మెమొరీలో మానవ జీనోమ్

- యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ పరిశోధకుల ఘనత
- భవిష్యత్తులో మానవజాతి అంతరించిపోతే.. మళ్లీ సృష్టించడానికి వీలుగా క్రిస్టల్‌లో జన్యుసమాచారం



లండన్: స్టీవెన్ స్పీల్‌బర్గ్ తీసిన 'జురాసిక్ పార్క్(1993)' సినిమా కథ గుర్తుందా? చెట్టు జిగురులో ఇరుక్కుపోయిన ఒక దోమ నుంచి డైనోసార్ డీఎన్‌ఏను సేకరించి.. క్లోనింగ్ ద్వారా రాక్షసబల్లులను సృష్టిస్తారు ఆ సినిమాలో! అలా అంతరించిపోయిన డైనోసార్లలాగానే.. ఎప్పటికైనా మనుషులు కూడా అంతరించిపోతే? అచ్చం ఆ సినిమాలో లాగానే మనుషులను మళ్లీ మానవజాతిని పునఃసృష్టించడానికి వీలుగా సౌతాంప్టన్ వర్సిటీ పరిశోధకులు పూర్తిస్థాయి హ్యూమన్ జీనోమ్‌ను ఒక '5డీ మెమొరీ క్రిస్టల్‌'లో భద్రపరిచారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో.. కేవలం జెనెటిక్ సమాచారాన్ని ఉపయోగించి మానవులను కృత్రిమంగా సృష్టించలేం. కానీ, భవిష్యత్తులో ఆ స్థాయి టెక్నాలజీ ఉన్న జీవులుగానీ.. యంత్రాలుగానీ.. అంతరించిన మానవజాతిని మళ్లీ సృష్టించాలని భావిస్తే ఈ సమాచారం వారికి/వాటికి ఉపయోగపడుతుందనే ఆశాభావంతో ఈ క్రిస్టల్‌ను తయారుచేశారు. దీన్ని 'మెమొరీ ఆఫ్ మ్యాన్‌కైండ్ ఆర్కైవ్' అనే ప్రత్యేక టైమ్ క్యాప్సూల్‌లో భద్రపరుస్తున్నారు. ఈ టైమ్ క్యాప్సూల్ ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్ సాల్ట్‌కేవ్‌లో ఉంది. ఇతర డేటా స్టోరేజ్ ఫార్మాట్లలో భద్రపరచిన డేటా కాలం గడిచేకొద్దీ డీగ్రేడ్ అవుతుందని.. కానీ, ఈ మెమొరీ క్రిస్టల్‌లో భద్రపరిచిన డేటా కొన్ని వందల కోట్ల సంవత్సరాల వరకూ భద్రంగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. "1000 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రతను.. గడ్డకట్టించే చలిని.. మంటలను సైతం ఈ క్రిస్టల్ తట్టుకోగలదు. చదరపు సెంటీమీటరుకు 10 టన్నుల తాకిడిని సైతం భరించగలదు. దీర్ఘకాలంపాటు రేడియోధార్మికతకు గురైనా దీనికి ఏమీ కాదు. ఒక్క 5డీ మెమొరీ క్రిస్టల్‌లో 360 టెరాబైట్ల దాకా సమాచారాన్ని దాచవచ్చు" అని వారు వివరించారు. సౌతాంప్టన్ వర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేసిన ఈ 5డీ మెమొరీ క్రిస్టల్.. 'మోస్ట్ డ్యూరబుల్ డేటా స్టోరేజ్ మెటీరియల్‌'గా 2014లో గిన్నిస్ రికార్డు సాధించింది.

ఆ పార్టీలది పాక్ ఎజెండా

370 పునరుద్ధరణా?.. భూమ్మీద ఏ శక్తీ చేయలేదు

- కాంగ్రెస్, ఎన్సీపై మోదీ ఫైర్
- కశ్మీరు భవితను నిర్దేశించే ఎన్నికలివి
- అధికారం తమ జన్మహక్కని ఆ మూడు కుటుంబాల భావన
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని ధ్వజం



రోడ్ షోలో పాల్గొన్న ప్రధాని మోదీ

శ్రీనగర్, సెప్టెంబరు 19: ఈ భూమ్మీద ఏ శక్తీ జమ్మూకశ్మీరుకు 370 అధికరణను పునరుద్ధరించలేదని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)లు పాకిస్థాన్ ఎజెండాను అనుసరిస్తున్నాయని విమర్శించారు. హింస, అశాంతే ఆ ఎజెండాగా పేర్కొన్నారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370, 35ఏ అధికరణలను, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న అంశాలపై తమ ప్రభుత్వం, కాంగ్రెస్-ఎన్సీ కూటమి ఒకే వైఖరితో ఉన్నాయని.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి గెలిచే అవకాశాలు అత్యధికంగా కనిపిస్తున్నాయని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని తీవ్ర స్థాయిలో స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం శ్రీనగర్, కట్రా సభల్లో ప్రసంగించారు. 'కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటూ ఎన్సీ, పీడీపీల మేనిఫెస్టోల అమలుకు అవకాశం కల్పిస్తుంది. 370ని పునరుద్ధరించి మళ్లీ హింస, రక్తపాతాల కాలం తీసుకొస్తామని ఆ పార్టీలు హామీ ఇస్తున్నాయి. కాంగ్రెస్-ఎన్సీ పొత్తుపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కానీ పొరుగుదేశం మాత్రం తెగ సంతోషిస్తోంది. ఆసిఫ్ వ్యాఖ్యలతో కాంగ్రెస్, ఎన్సీ బండారం బయటపడింది' అని చెప్పారు. ఈ ఎజెండాతోనే జమ్మూకశ్మీరులో పలు తరాలను నాశనం చేసి నెత్తుటేర్లలో ముంచింది. పాక్‌కు తీవ్ర హెచ్చరిక చేస్తున్నా.. దాని ఎజెండాను ఇక్కడ అమలు కానివ్వం. భూమ్మీద ఏ శక్తీ 370ని తిరిగి తీసుకురాలేదు' అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ కుటుంబ పార్టీలని.. ఎలాగైనా అధికారం హస్తగతం చేసుకోవడం తమ జన్మహక్కుగా ఆ మూడు కుటుంబాలు భావిస్తాయని చెప్పారు. యువతను విద్య, ఉపాధికి దూరం చేసి.. రాళ్లు వారి చేతుల్లో పెట్టారని మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవితను నాశనం చేశాయన్నారు. అవి మరో తరాన్ని నాశనం చేయడాన్ని తాను అనుమతించనని శపథం చేశారు. 'ఈ కేంద్ర పాలిత ప్రాంతమంతటా స్కూళ్లు, కాలేజీలు సజావుగా నడుస్తున్నాయి. పిల్లల చేతుల్లో పుస్తకాలు, కలాలు, ల్యాప్‌టాప్‌లు ఉంటున్నాయి. స్కూళ్లలో కాల్పులు జరిగాయన్న వార్తలు ఇవాళ లేవు. కొత్త పాఠశాలలు, కళాశాలలు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, ఐఐటీలు నిర్మిస్తున్నాం. అందుకే ఈ మూడు కుటుంబాలను ఇప్పటి యువత సవాల్ చేస్తోంది. వాటికి వ్యతిరేకంగా గళం విప్పగలుగుతోంది. కశ్మీరు యువతకు ఉపాధి అవకాశాల కల్పన మోదీ లక్ష్యం, హామీ' అని స్పష్టం చేశారు.


మోదీ అమెరికా పర్యటనలో ట్రంప్‌తో భేటీపై సస్పెన్స్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ప్రధాని మోదీ ఈ నెల 21 నుంచి అమెరికాలో జరిపే పర్యటనలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను కలుస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని భారత విదేశాంగ శాఖ తెలిపింది. మోదీ మూడు రోజుల పర్యటనలో భాగంగా అనేక సమావేశాలు ఖరారయ్యాయని, మరికొన్నింటిని ఖరారు చేయాల్సి ఉందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ చెప్పారు. ఏదైనా ప్రత్యేక సమావేశం ఖరారు అవుతుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని, ప్రధాని జరపబోయే మరిన్ని సమావేశాలను ఖరారు చేసేందుకు అన్ని విధాలా యత్నిస్తున్నామన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ట్రంప్ వచ్చేవారం మోదీని అమెరికాలో కలుస్తానని రెండు రోజుల క్రితం ప్రకటించడంతో మిస్రీ స్పందనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రధాని అమెరికాలో పర్యటిస్తారు.

రాహుల్, పాకిస్థాన్ ఒక్కటే: బీజేపీ

పాక్ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విరుచుకుపడ్డారు. ఇది కాంగ్రెస్ వైఖరిని బట్టబయలు చేసిందని.. ఆ పార్టీ జాతి వ్యతిరేక శక్తులతోనే తరచూ కలిసి పని చేస్తుంటుందని ఆరోపించారు. వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రయిక్స్‌కు రుజువులు అడగడం.. భారత సైన్యం గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంలో రాహుల్‌గాంధీ, పాక్‌ల వాణి ఎప్పుడూ ఒకటేనన్నారు. 370 అధికరణ ముగిసిన అధ్యాయమని.. దానిని తిరిగి తీసుకురావడం ఎవరి తరమూ కాదని తేల్చిచెప్పారు.

లోకం తీరు



అంధులకు చూపునిచ్చే బ్లైండ్‌సైట్

- మస్క్‌కు చెందిన 'న్యూరా లింక్' అభివృద్ధి చేసిన పరికరానికి అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూయార్క్, సెప్టెంబరు 19: పుట్టుకతో అంధులైనవారికి, ప్రమాదాల్లో చూపు కోల్పోయినవారికి, నేత్రనాడి లేనివారికి.. టెస్లా సీఈవో ఈలన్‌మస్క్ శుభవార్త చెప్పారు. అలాంటివారందరికీ చూపునివ్వడమే లక్ష్యంగా.. మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' సంస్థ అభివృద్ధి చేసిన 'బ్లైండ్‌సైట్' పరికరానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అనుమతి లభించింది. అయితే ఈ పరికరం ద్వారా చూడాలంటే.. అంధుల మెదడులో 'విజువల్ కార్టెక్స్' మాత్రం దెబ్బతినకుండా ఉండాలి. అదొక్కటి బాగా ఉంటే అంధులు ఎంచక్కా ఈ పరికరం సాయంతో ప్రపంచాన్ని చూడొచ్చని ఈలన్ మస్క్ ట్వీట్ చేశారు. ఈ పరికరానికి ఎఫ్‌డీఏ.. 'బ్రేక్‌త్రూ డివైస్' హోదా కూడా వచ్చినట్టు న్యూరాలింక్ ఒక ప్రకటనలో తెలిపింది.



భారత విద్యార్థులకు కెనడా షాక్!

వచ్చే ఏడాది స్టడీ పర్మిట్లలో 10% కోత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: విదేశీ విద్యార్థులకు కెనడా ప్రభుత్వం మరో షాక్ ఇవ్వనుంది. ఈ ప్రభావం ఎక్కువగా భారతీయ విద్యార్థులపైనే పడనుంది. ఇప్పటికే విదేశీ విద్యార్థులకిచ్చే స్టడీ పర్మిట్లలో భారీగా కోత విధించిన కెనడా.. వచ్చే ఏడాది మరో 10శాతం తగ్గించనున్నట్టు వెల్లడించింది. వలసల నియంత్రణలో భాగంగా తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయాన్ని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 'ఎక్స్' వేదికగా బుధవారం ప్రకటించారు. 'గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 35 శాతం తక్కువగా విదేశీ విద్యార్థులకు స్టూడెంట్ పర్మిట్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఈ సంఖ్యను మరో 10%తగ్గిస్తాం. మన ఆర్థిక వ్యవస్థకు వలసలు ముఖ్యమే అయినా.. కొందరు చెడ్డ వ్యక్తులు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. అందుకే మేం వాటిని నియంత్రించక తప్పడం లేదు" అని ట్రూడో ట్వీట్ చేశారు. కాగా గత నెలలో భారత ప్రభుత్వం విడుదలచేసిన గణాంకాల ప్రకారం సుమారు 13.35 లక్షల మంది భారత విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తుంటే వారిలో 4.27లక్షల మంది కెనడాలోనే ఉన్నారు. ప్రస్తుతం కెనడాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో 40%మంది భారతీయులేకావడం గమనార్హం. మరోవైపు న్యూజిలాండ్ విజిటర్ వీసా పొందడం భారతీయులకు సవాలుగా మారింది. భారతీయుల దరఖాస్తుల్లో 23% తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ ఏడాది జనవరి1 నుంచి సెప్టెంబరు8 వరకు 42,542 మంది భారతీయులు తొలిసారిగా న్యూజిలాండ్ పర్యటన వీసాకు దరఖాస్తు చేయగా కివీస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు 32,085దరఖాస్తులకే ఆమోదం తెలిపారు.

పేజర్ల షెల్ కంపెనీ.. ఇజ్రాయెల్ పనేనా?

తొలుత నాణ్యమైన పేజర్ల పంపిణీ.. ఆ తర్వాతే పేజర్ బాంబుల పథకం!

- లెబనాన్‌లో 37కు చేరిన మరణాలు
- ఇజ్రాయెల్-హిజ్బుల్లా పోరు ఉధృతం



బీరుట్, సెప్టెంబరు 19: లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల వెనక దీర్ఘకాలిక వ్యూహం ఉందా? ఓ క్రమ పద్ధతిలో హంగరీలో షెల్ కంపెనీని సృష్టించి.. తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, హిజ్బుల్లా పాలిట మృత్యు శాసనం రాయాలనే స్కెచ్ రెండేళ్ల క్రితమే పురుడుపోసుకుందా? ఈ ప్రశ్నలకు పాశ్చాత్య మీడియా ఔననే చెబుతోంది. న్యూయార్క్ టైమ్స్ ఏకంగా ఆ షెల్ కంపెనీ ఇజ్రాయెల్ సృష్టేనని పేర్కొంది. ఇజ్రాయెల్ తన ప్రణాళికలో భాగంగానే తొలుత నాణ్యమైన పేజర్లను అందజేసి.. ఆ తర్వాత పేజర్ బాంబులను రూపొందించిందని న్యూయార్క్ టైమ్స్ కథనం చెబుతోంది.

సెల్‌ఫోన్లంటే భయపెట్టి?

సెల్‌ఫోన్లు వాడే హిజ్బుల్లా నాయకత్వాన్ని ఇజ్రాయెల్ నిఘా సంస్థ టార్గెట్‌గా చేసుకుంది. దీంతో.. 2022లోనే హిజ్బుల్లా నేత హసన్ నస్రల్లా ఎవరూ సెల్‌ఫోన్లను వాడొద్దని ఆదేశాలు జారీ చేసి.. ప్రత్యామ్నాయాలను సూచించారు. ఈ క్రమంలోనే హిజ్బుల్లా తమ సమాచార మార్పిడికి పేజర్లను వినియోగించడం మొదలు పెట్టింది. తొలుత పాతకాలం పేజర్లను వాడినా.. ఎక్కువ సంఖ్యలో కొత్త వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో కంపెనీని సంప్రదించింది. పాతకాలం టెక్నాలజీ కావడంతోపాటు.. విడిభాగాలు, అసెంబ్లింగ్ వంటి పనుల కోసం గోల్డ్ అపోలో ఈ పనికి సబ్-కాంట్రాక్టర్ల కోసం వెతుకుతున్న తరుణంలో.. హంగరీకి చెందిన బీఏసీ కంపెనీ ముందుకు వచ్చినట్లు పాశ్చాత్య మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇరు కంపెనీలు మూడేళ్లకు గాను.. బ్రాండింగ్ లైసెన్సుపై ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. 2020 జూన్‌లో నాణ్యమైన పేజర్లను సరఫరా చేసింది. లెబనాన్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం సైతం వీటినే వినియోగిస్తోందని నిర్ధారించుకున్నాక పేజర్ బాంబుల తయారీ వ్యూహాన్ని అమలు చేసినట్లు తెలుస్తోంది. ఐదు నెలల క్రితం 5 వేల పేజర్లకు హిజ్బుల్లా నుంచి ఆర్డర్ రావడంతో.. బీఏసీ కంపెనీ పీఈటీఎన్ పేలుడు పదార్థాన్ని అమర్చిన పరికరాలను పంపిణీ చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం స్పష్టం చేస్తోంది. అయితే.. బీఏసీ సీఈవో క్రిస్టినా బార్సోనీ మాత్రం.. తాము పేజర్లను తయారు చేయలేదని, కేవలం సరఫరా విషయంలోనే గోల్డ్ అపోలోతో ఒప్పందం ఉన్నట్లు స్పష్టం చేశారని 'ది ఇండిపెండెంట్' ఓ కథనాన్ని ప్రచురించింది. న్యూయార్క్ టైమ్స్ మాత్రం.. ముగ్గురు నిఘా సంస్థల అధికారులతో మాట్లాడి.. బీఏసీ కంపెనీ ఇజ్రాయెల్‌కు చెందినదేనని నిర్ధారించుకున్నట్లు తెలిపింది.

మరో వైపు.. మంగళ, బుధవారాల్లో జరిగిన పేజర్, వాకీటాకీ పేలుళ్ల ఘటనల్లో మరణాల సంఖ్య 37(వాకీటాకీల ఘటనలో 20, పేజర్ల పేలుళ్లలో 17)కు చేరుకున్నట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 3,250 మంది క్షతగాత్రులు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని.. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ఇరాన్‌కు తరలించామని తెలిపింది.

బందీలను విడుదల చేస్తే..

11 నెలలుగా గాజాపై పోరు సల్పుతున్న ఇజ్రాయెల్.. గురువారం హమాస్ ఉగ్ర సంస్థకు ఓ ఆఫర్ ఇచ్చింది. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను ఒకేసారి విడుదల చేస్తే.. యుద్ధాన్ని నిలిపివేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ తరఫున మధ్యవర్తిత్వం వహిస్తున్న గాల్ హిర్ష్ అమెరికాకు తెలిపారు. ఈ విషయాన్ని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్, ఇజ్రాయెలీ పబ్లిక్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(ఐపీబీసీ) నిర్ధారించాయి.

సరిహద్దుల్లో ఉద్రిక్తత

ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినబూని హిజ్బుల్లా.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్‌పై క్షిపణి, రాకెట్ దాడులు చేసింది. గురువారం ఉదయం కూడా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. ఇజ్రాయెల్ కూడా తన సేనలను ఉత్తరాదిన మోహరించింది. హిజ్బుల్లా దాడులకు క్షిపణులతోనే సమాధానమిచ్చింది. ఈ నేపథ్యంలో రెండు దేశాల సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఉగ్రవాది పన్నూ కేసు.. భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు నోటీసులు

- ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ సహా ఉన్నతాధికారుల పేర్లు
- 21 రోజుల్లో జవాబివ్వాలని సూచన


న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఖలిస్థానీ ఉగ్రవాది గురపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన కేసులో అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తనను హత్య చేసేందుకు భారత ప్రభుత్వం కుట్ర పన్నిందంటూ న్యూయార్క్‌లోని డిస్ట్రిక్ట్ కోర్టులో వేసిన దావాలో పన్నూ ఆరోపించారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు ఇచ్చింది. వాటిలో భారత జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్‌తో పాటు రిసెర్చ్ అండ్ అనాలసిస్ (రా) విభాగం మాజీ అధిపతి సమంత్ గోయల్, రా ఏజెంట్ విక్రమ్ యాదవ్, భారతీయ వ్యాపారవేత్త నిఖిల్ గుప్తా పేర్లు ఉన్నాయి. 21 రోజుల్లో ఈ సమన్లపై సమాధానం ఇవ్వాలని పేర్కొంది. కోర్టు సమన్లను పన్నూ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. పన్నూకు అమెరికా, కెనడా పౌరసత్వాలు ఉన్నాయి. తమ దేశంలో పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అమెరికా వెల్లడించిన విషయం తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు వ్యాపారి నిఖిల్ సుపారీ ఇచ్చారని అమెరికా ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. అయితే అలాంటి కుట్రల్లో తమ పాత్ర ఏమీ లేదని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు కూడా ప్రారంభించింది. కాగా,

ఉగ్రవాది కేసులో మమ్మల్ని ప్రశ్నిస్తారా?

పన్నూ కేసులో అమెరికా కోర్టు సమన్లు జారీ చేయడంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తన హత్యకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ పన్నూ దావా వేయడాన్ని వ్యతిరేకించింది. అతనో ఉగ్రవాది అని, అలాంటి వ్యక్తి దాఖలు చేసిన కేసులో తమను ప్రశ్నించడమేంటని తప్పుపట్టింది. ఇది పూర్తిగా అసమంజసమని వ్యాఖ్యానించింది.

బెంగాల్ వైద్యుల సమ్మె పాక్షిక విరమణ

- చాలావరకు డిమాండ్లకు ప్రభుత్వ అంగీకారం
- రేపటి నుంచి అత్యవసర సేవలకు డాక్టర్లు



కోల్‌కతా, సెప్టెంబరు 19: హత్యాచారానికి గురైన పీజీ వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న బెంగాల్ వైద్యులు ఎట్టకేలకు కాస్త శాంతించారు. ప్రభుత్వం తమ డిమాండ్లలో చాలావరకు ఆమోదించడంతో పాటు, రాష్ట్రంలో భారీ వరదల రీత్యా సమ్మెను పాక్షికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఔట్ పేషెంట్ సేవలను మాత్రం అందించబోమని చెప్పారు. మరోవైపు బెంగాల్ సర్కారు వైద్యుల భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలను గురువారం విడుదల చేసింది. తక్షణమే అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. ఆస్పత్రుల్లో విధుల్లో ఉన్న వైద్యులకు సరిపడా గదులు, వాష్ రూమ్‌లు ఉండేలా చూడడం, సీసీ టీవీలు, తాగునీటి వసతులు కల్పించడం తదితరాలు ఇందులో ఉన్నాయి. వీటిని తక్షణమే సమకూర్చాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, సీబీఐ నివేదికకు ఇంకెంత సమయం తీసుకుంటారని ప్రశ్నిస్తూ వైద్యులు స్వాస్థ్య భవన్ ఎదుట 9 రోజులుగా ధర్నా చేస్తున్నారు. దీనిని శుక్రవారం విరమించి సీబీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. మరోవైపు తమ డిమాండ్ల అమలుకు సర్కారుకు వారం రోజుల గడువు ఇచ్చిన వైద్యులు, అవి నెరవేరకుంటే మళ్లీ పూర్తిస్థాయి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.

ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దు

కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దయింది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి ఆరోపణలతో ప్రస్తుతం సీబీఐ అదుపులో ఉన్న ఘోష్‌ను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాసిడింగ్స్ నుంచి తొలగించారు. ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎమ్మెల్యే సుదీప్తోరాయ్ విచారణ నిమిత్తం గురువారం ఈడీ ఎదుట హాజరయ్యారు. ఆర్జీకర్ ఆస్పత్రిలో హత్యాచార ఘటనకు సంబంధించి టీఎంసీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆ పార్టీ నేత జవహర్ సిర్కార్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు కేశవ్, సత్యకుమార్ యాదవ్

వైసీపీ పాలనంతా అరాచకమే

» 100 రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు: మంత్రి పయ్యావుల

» అన్నదాతకు అండగా నిలబడే ప్రభుత్వమిది: మంత్రి సత్యకుమార్

అనంతపురం సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనంతా అరాచకమేనని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. విపత్తులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ప్రజలకు మేమున్నామనే భరోసాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారని అన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో గురువారం జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి అనంతకు కేటాయించిన జలాలు, హంద్రీనీవా ద్వారా వచ్చే నీటి వాడకం తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కేశవ్ మీడియాతో మాట్లాడారు. కరువు జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని అన్నారు. గతంలో కేంద్రం విడుదల చేసిన దాదాపు రూ.2 వేల కోట్ల విపత్తు నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... 'అన్నదాతకు అండగా నిలబడే ప్రభుత్వం మా కూటమి ప్రభుత్వం. వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించింది. రైతులతోపాటు వివిధ వర్గాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడింది. ప్రాజెక్టులను గాలికి వదిలేసింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు కరువు జిల్లా ప్రజానీకానికి ఉపయోగపడేలా పనిచేస్తాం. విజయవాడలో వరద విపత్తు సమయంలో చంద్రబాబు పనిచేసిన విధానానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం' అని అన్నారు.

చంద్రబాబు, కన్నయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు

తుంగభద్ర డ్యామ్ 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన సమయంలో నీరు వృథా కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిన చొరవ, స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేయించడంలో నైపుణ్యం చాటుకున్న విశ్రాంత ఇంజనీరు కన్నయ్య నాయుడుకు, స్టాప్‌లాగ్ ఏర్పాటు, తయారీలో భాగస్వామ్యులైన జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందుస్థాన్, నారాయణ ఇంజనీర్ సంస్థలకు ఐఏబీ సమావేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేసింది. తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడానికి కారణమేమిటో తేల్చేందుకు ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేయాలని తీర్మానం చేశారు.

నియోజకవర్గాల్లో తలనొప్పులు తేవొద్దు!

» టీడీపీ ఎమ్మెల్యేలకు పల్లా హితవు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకొని వెళ్లాలని, తలనొప్పులు తేవొద్దని కొందరు టీడీపీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హితవు చెప్పారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం సుమారు పదిమంది ఎమ్మెల్యేలతో ఆయన ఫోన్లో మాట్లాడారు. వీరిలో ఎక్కువ మంది రాయలసీమ వారున్నారు. కేంద్ర కార్యాలయానికి అందిన ఫిర్యాదులు, ఇతరత్రా మార్గాల ద్వారా అందిన సమాచారంపై ఆయన వారితో మాట్లాడినట్లు తెలిసింది. ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో పార్టీలో అంతర్గతంగా నేతల మధ్య విభేదాలు, రేషన్ డీలర్ల ఎంపికలో పార్టీలో వర్గాల మధ్య అభిప్రాయ భేదాలు తదితరాలపై కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. ఒక వర్గాన్ని పెంచి పోషించేలా కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి ఉందని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. రాయలసీమలో పోలీస్‌స్టేషన్ ముందు ఇటీవల ధర్నా చేపట్టిన ఎమ్మెల్యేతోనూ ఆయన మాట్లాడారు. 'అధికారంలో ఉండి మనం స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం సరికాదు. సమస్యను రోడ్డు మీదకు తేవద్దు' అని సున్నితంగా సూచించినట్లు సమాచారం. చిన్నచిన్న అంశాలపై పార్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడే బాధ్యతను అధిష్ఠానం ఇటీవల పల్లాకు అప్పగించింది. దీంతో వారితో ఆయనే మాట్లాడుతున్నారు.

రోడ్డు ప్రమాదాలకు బ్రేకులు

» వాటి కట్టడికి పోలీసు, ఆర్టీఏ ఉమ్మడి చర్యలు

» వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఆర్టీసీకి కొత్త బస్సులు

» 1400 డొక్కు బస్సులు పక్కనబెట్టి వాటి స్థానంలో కొత్తవి

» రవాణా శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం

» 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రోడ్లు రక్తం తాగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల కట్టడికి రవాణా, పోలీసు ఉమ్మడి కార్యాచరణ చేపడతాం. ప్రజా రవాణా సంస్థలో పాత బస్సులను క్రమంగా తీసేస్తున్నాం. మూడు నెలలుగా ప్రతి రోజూ 20-25 కొత్త బస్సులు తెప్పిస్తూనే ఉన్నాం. ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలందిస్తాం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మంత్రిగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఆస్తులన్నీ హైదరాబాద్‌లో వదులుకొని వచ్చిన ఏపీఎస్‌ఆర్టీసీకి సీఎం చంద్రబాబు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని... అయితే 2019 తర్వాత ఆర్టీసీకి తీవ్ర కష్టమొచ్చిందని అన్నారు. ప్రభుత్వంలో సిబ్బంది విలీనం గందరగోళంగా జరిగిందని మంత్రి పెదవి విరిచారు. 2020లో వైసీపీ ప్రభుత్వం అవగాహన లేకుండా చేసిన పనికి ఇప్పటికీ విలీన సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో ప్రయాణికులకు భారం పడకుండా కార్గో, ఇతర ఆదాయ వనరులు పెంచుకున్న ఆర్టీసీ ప్రతి నెలా ప్రభుత్వం ఖజానా నుంచి రూ. 500 కోట్లు తీసుకునే దుస్థితికి వైసీపీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. 2019కు ముందు 70 శాతానికి పైగా ఉన్న ఆక్యుపెన్సీ గత ఐదేళ్లలో 50 శాతానికి పడిపోయిందన్నారు. ఆ సమస్య నుంచి బయట పడేందుకు పాత బస్సులు తీసేసి కొత్త బస్సులు తెస్తున్నామని చెప్పారు. కాలం చెల్లిన 1,400 బస్సులు తీసేశామని, వాటి స్థానంలో ఇప్పటికే 650 కొత్త బస్సులు తెచ్చామని వివరించారు. సీఎం చంద్రబాబు విద్యుత్ బస్సులకు ప్రాధాన్యం ఇచ్చే ఆలోచనలో ఉన్నారని చెప్పారు. స్వచ్ఛ భారత్ కింద దేశవ్యాప్తంగా 10 వేల బస్సులు కేంద్రం ఇస్తోందని, వాటిలో మన వాటా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. వాటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం 500 బస్సులు అదనంగా కొనుగోలు చేయనుందన్నారు. బస్సులకు తగ్గట్లు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది నియామకాలు చేపడతామని చెప్పారు.

త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం

మహిళలకు ఉచిత ప్రయాణ హామీ బస్సులు సమకూర్చుకున్నాక అమలు చేస్తామని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ప్రయాణికుల్లో పురుషులు 65 మంది, మహిళలు 35 మంది ఉన్నారని, పొరుగు రాష్ట్రాల్లో ఉచిత ప్రయాణం అమలు చేశాక మహిళల సంఖ్య పెరిగిందని చెప్పారు. త్వరలోనే ఉచిత ప్రయాణ హామీ నెరవేరుస్తామని అన్నారు.

రవాణా శాఖను ప్రక్షాళన చేయాలి

రోడ్డు ప్రమాదాలు అదుపు చేయడం నుంచి రవాణా శాఖలో చాలా ప్రక్షాళన చేపట్టాల్సి ఉందని మంత్రి అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా చంద్రబాబు ప్రభుత్వం 83 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాహనదారుడికి ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డు కూడా ఇవ్వలేక చేతులెత్తేసిందని అన్నారు. తాము ఆర్‌సీ కార్డులు మళ్లీ పునరుద్ధరిస్తామని.. వాహన్ పరివాహన్ సర్వీసుల్లో ఇబ్బందులను తొలగిస్తామని తెలిపారు. వాహన ఫిట్‌నెస్, తనిఖీల్లో ఎంవీఐల పాత్ర పెంచి ప్రమాదాలకు బ్రేకులేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పాతుకుపోయి అడ్డగోలుగా వ్యవహరిస్తున్న వారిని తప్పించి.. పనిచేసే ఎంవీఐలను నియమించి ప్రక్షాళన చేస్తామన్నారు.

రహదారుల అభివృద్ధికి 6,585 కోట్లు

» రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 384 కిలోమీటర్ల మేర ఏడు జాతీయ రహదారుల అభివృద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.6,585 కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. అమరావతి సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారతమాల కార్యక్రమం కింద గతంలో రాష్ట్రానికి మంజూరు చేసిన ఈ ఏడు ప్రాజెక్టులు పలు కారణాల వల్ల ఆగిపోయాయని.. అయితే వాటి పునరుద్ధరణకు తాను, సీఎం చంద్రబాబు పలుమార్లు కేంద్రంతో చర్చించారు. ఫలితంగా స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆ ఏడు ప్రాజెక్టులను భారతమాల పథకం నుంచి తొలగించి నేషనల్ హైవేస్ ఆర్డినరీ (ఎన్‌హెచ్‌వో) కార్యక్రమంలో చేర్చి గురువారం ఆమోదం తెలిపిందన్నారు. సీఆర్ఎఫ్ పథకం కింద రాష్ట్రానికి రూ.350 కోట్లు మంజూరు చేస్తుంది. అయితే తమ విజ్ఞప్తి మేరకు ఆ మొత్తాన్ని రూ.500 కోట్లకు పెంచిందని చెప్పారు. వరదలకు దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ కు రూ.186 కోట్లు మంజూరు చేస్తూ త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజా పోలీసింగ్ మా లక్ష్యం

» సిబ్బంది నియామకం.. టెక్నాలజీకి ప్రాధాన్యం

» ప్రతి జిల్లాకు సైబర్ స్టేషన్.. కమాండ్ కంట్రోల్

» గంజాయిని కూకటి వేళ్లతో పెకిలించి వేస్తాం

» మహిళల రక్షణ, నేరస్తులకు శిక్షపై ప్రత్యేక దృష్టి

» కాదంబరి జెత్వానీ కేసులో అరెస్టులు ఉంటాయి

» 'ఆంధ్రజ్యోతి'తో హోంమంత్రి అనిత


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులు ఉన్నది ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడానికి. గత ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసి సొంత ప్రతీకారాలకు వాడుకుంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజా పోలీసింగ్‌కే ప్రాధాన్యమిస్తాం. పొలిటికల్ పోలీసింగ్ ఉండదు. అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టి ఎవరినీ వేధించబోం. తప్పుచేసిన వ్యక్తులు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకోకుండా వదిలి పెట్టం' అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. పోలీసు శాఖ పనితీరు, ప్రజలకు భరోసా, తదితర అంశాలపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గత వంద రోజుల్లో పోలీసు శాఖ సాధించింది ఏమిటి.? ఇంకా చేయాల్సిందేమిటి.? పోలీసింగ్‌లో మార్పుల ప్రణాళిక ఏమిటి.? మహిళలకు భద్రత, టెక్నాలజీ వినియోగం, నేరస్తులకు శిక్షలు, గంజాయి సమస్యను ఎలా ఎదుర్కొంటుంది.? అనే విషయాలను వివరించారు. 'అరాచక పాలనకు సమాధి కట్టి టీడీపీ కూటమికి భారీ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు పూర్తిగా భరోసా కల్పించాం. తప్పుడు కేసులు, వేధింపులు, అరాచకాలు ఈ ప్రభుత్వంలో ఉండబోవని చేతల్లో చూపించాం. అలాగని తప్పు చేసిన వారిని వదిలి పెట్టం. కొన్ని అరెస్టులు ఆలస్యమై ఉండొచ్చు.. అంత మాత్రాన ఈ ప్రభుత్వం మౌనంగా ఉన్నట్లు కాదు. చట్ట ప్రకారమే ముందుకెళుతున్నాం. అందుకే వైసీపీ నేతలకు కూడా 41ఏ నోటీసు ఇచ్చి విచారణకు పిలుస్తున్నాం. మా పోలీసులు ఎవరినీ అర్ధరాత్రి అక్రమంగా ఎత్తుకు రాలేదు. ఎస్సీపై అట్రాసిటీ కేసులు పెట్టలేదు.. మా తప్పుంటే సరిదిద్దుకొంటున్నాం. ప్రజలకు మేం పూర్తిగా జవాబుదారీగా ఉంటాం. పనిగట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తే మాత్రం చట్టం తనపని తాను చేస్తుంది' అని హెచ్చరించారు. ఇంకా ఏమన్నారంటే...

రాజకీయ పోలీసింగ్‌ను ప్రజా పోలీసుగా...

పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయడం మొదలు పెట్టాం. పోలీసుల్ని చట్ట ప్రకారమే పనిచేయమని చెప్పాం. తప్పుడు కేసులు పెట్టొద్దని, తప్పు చేసిన వారిని వదలొద్దని అన్నాం. కొత్త వాహనాలకు నిధులు, ఆయిల్ 150 లీటర్ల నుంచి 300 లీటర్లకు పెంపు.. సీసీ కెమెరాలకు చూపు, ఫోరెన్సిక్‌కు ప్రాణం.. ఫింగర్ ప్రింట్స్‌కు ఊతం ఇచ్చాం. ప్రతి జిల్లాలోనూ కమాండ్ కంట్రోల్, ప్రతి జిల్లా కేంద్రంలోనూ సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయబోతున్నాం. మొత్తం మీద పోలీసు వ్యవస్థ ఎలా ఉండాలో అలా మార్చేందుకు శ్రమిస్తున్నాం.

రాష్ట్రంలో ప్రధాన సమస్య గంజాయి..

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా చంద్రబాబు తీసుకెళ్లారు.. కానీ గత ఐదేళ్లలో వైసీపీ దాన్ని గంజాయి ప్రదేశ్‌గా మార్చి పరువు తీసింది. ఒకప్పుడు మన్యంలో ఉండే గంజాయి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. దాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రణాళికా బద్ధంగా శ్రమిస్తున్నాం. ఒక ఐజీ నేతృత్వంలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటు చేశాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 1,378 కేసులు నమోదు చేసి 2.08లక్షల కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. గంజాయి సాగు, సరఫరా చేస్తోన్న 3,890 మందిని అరెస్టు చేసి జైలుకు పంపాం. అసలైన కింగ్‌పిన్‌లను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రానికి మత్తు విముక్తి కల్పించేందుకు గట్టిగా శ్రమిస్తున్నాం.

ఆన్‌లైన్ మోసాల కట్టడికి చర్యలు..

ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్‌లో పెరగడంతో సైబర్ మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి.. వైసీపీ ప్రభుత్వంలో మొత్తం రాష్ట్రానికి ఒకే ఒక్క పోలీసు సైబర్ స్టేషన్ ఉండేది. ఇప్పుడు ప్రతి జిల్లాకు సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులకు అధునాతన పరికరాలు సమకూరుస్తున్నాం. సైబర్ కమాండోలను తీర్చిదిద్ది ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. విజయవాడలో ఇప్పటికే ప్రారంభమైంది. రాష్ట్రమంతా విస్తరిస్తాం. మొత్తం 16రకాల సైబర్ నేరాలపై రాష్ట్ర పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. నేరాలు తగ్గాలంటే తప్పు చేసిన వారికి శిక్షలు పడి తీరాలి. గత ప్రభుత్వంలో 'దిశ' పేరు చెప్పి 21 రోజుల్లో ఉరేస్తామన్నారు. అసలు చట్టమే లేకున్నా ప్రజల్ని మభ్య పెట్టారు. మేం అలా కాదు, పోలీసులకు అవసరమైన సీసీటీవీల నుంచి డ్రోన్లు, ఫింగర్ ప్రింట్స్ ల్యాబ్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, దర్యాప్తునకు సిబ్బంది, వాహనాలు, వాటికి ఆయిల్ అన్నీ సమకూరుస్తున్నాం. అమరావతిలో ఫోరెన్సిక్ రిసెర్చ్ కేంద్రాన్నే ఏర్పాటు చేయబోతున్నాం. దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధ్య సమన్వయం పెంచి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులకు సత్వర శిక్షలు పడేలా కృషి చేస్తాం.

ముంబై నటి కేసులో అరెస్టులు ఉంటాయి..

ప్రభుత్వమే మాఫియా అవతారం ఎత్తితే... అంతకన్నా దారుణం ఉంటుందా..? ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో అదే జరిగింది. సీఎం క్యాంపు కార్యాలయంలోనే కుట్రలకు బీజం పడటం.... అందులో ఐపీఎస్‌లు భాగస్వాములవడం ఎంత ప్రమాదకరం. బాధితురాలు జెత్వానీ ఇప్పుడే నన్ను కలిసి.. తనను ఎంతగా వేధించారో చెప్పింది. కుక్కల విద్యాసాగర్ పరారీలో ఉన్నాడు. అతనితో పాటు కుట్రలో ఎవరున్నా అరెస్టు చేస్తాం. ఐపీఎస్ అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశాం. దర్యాప్తులో లభించే ఆధారాలను బట్టి చట్టపరమైన చర్యలుంటాయి. ఈ రోజు నేను హోంమంత్రినైనా గత ప్రభుత్వంలో దారుణమైన ట్రోలింగ్, అవమానాలు ఎదుర్కొన్నా. తల్లి, చెల్లిని కూడా ట్రోల్ చేసిన వాళ్లు మమ్మల్ని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి తల్లి, చెల్లి రక్షణ బాధ్యత మాదే. రాజకీయ పరమైన కేసుల్లో అరెస్టులు సకాలంలో చేయలేదన్న నింద మాపై ఉంది. అడ్డగోలుగా అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి అరెస్టులు చేసేందుకు ఇది జగన్ ప్రభుత్వం కాదు. చంద్రబాబు ప్రభుత్వంలో చట్టపరంగానే చర్యలుంటాయి. అందుకే ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేతలకు కూడా 41 నోటీసు (విచారణ) ఇస్తున్నాం. అరెస్టులు ఆలస్యం కావొచ్చు.. కానీ తప్పుచేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

కౌన్సెలింగ్ ఎందుకు చేపట్టలేదో

వివరణ ఇవ్వండి


» లాసెట్ కన్వీనర్‌కు హైకోర్టు ఆదేశం

» పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయాలని ఉన్నత విద్యాశాఖకు నిర్దేశం

» విచారణ 25కు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్‌లోనే ఏపీలాసెట్ ఫలితాలు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కౌన్సెలింగ్ ప్రక్రియను ఎందుకు చేపట్టలేదో వివరణ ఇవ్వాలని ఏపీలాసెట్ కన్వీనర్‌ను హైకోర్టు ఆదేశించింది. కౌన్సెలింగ్ ప్రక్రియ జాప్యానికి కారణాలు ఏంటి? ప్రక్రియ చేపట్టేందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు? తదితర పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఉన్నతవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) కార్యదర్శిని ఆదేశించింది. ఈ వ్యవహారంలో విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని పేర్కొంది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఉన్నతవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీఎస్‌సీహెచ్‌ఈ కార్యదర్శి, ఏపీలాసెట్ కన్వీనర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీకి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. నేషనల్ లా స్కూల్స్‌తో సమానంగా ఏటా జూన్ చివరినాటికి ఏపీ లాసెట్ పరీక్ష నిర్వహణ , అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసి, తక్షణం క్లాసులు ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది యోగేష్ వాదనలు వినిపిస్తూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రతి సెమిస్టర్‌లో 18 వారాలపాటు క్లాసులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఏపీలో విద్యాసంవత్సరం ప్రతి ఏడాది జూలై 1న ప్రారంభమవుతుందని, అయితే, రాష్ట్ర ప్రభుత్వం న్యాయ కళాశాలల్లో అడ్మిషన్లకు అక్టోబరు లేదా నవంబరు నెలల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. దీని వల్ల న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులు మూడు నెలల విలువైన సమయాన్ని కోల్పోతున్నారని తెలిపారు. న్యాయవిద్య పట్ల అధికారులు చులకన భావనతో ఉన్నట్లు కనపడుతోందని ఆక్షేపించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

నందిగం సురేశ్ రిమాండ్ 14 రోజులు పొడిగింపు



మంగళగిరి సిటీ, సెప్టెంబరు 19: వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ రిమాండ్‌ను న్యాయస్థానం 14 రోజులు పొడిగించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఈ నెల 5వ తేదీన అరెస్టయిన సురేశ్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు సురేశ్‌ను పోలీసులు ఇటీవల రెండు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కీలక సమాచారాన్ని ఆయన నుంచి రాబట్టారు. రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ ముగియడంతో పోలీసులు గురువారం ఆయనను మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపర్చారు. రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం నందిగం సురేశ్‌ను జిల్లా జైలుకు తరలించారు.

2.20 కోట్లు బలవంతంగా వసూలు చేశారు

విడదల రజనిపై 'బాలాజీ క్రషర్స్' ఫిర్యాదు.. ఆమె పీఏ 5 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు

» మావల్ల కాదన్నందుకు విజిలెన్స్ ఎస్పీ జాషువా వచ్చారు

» అవకతవకలున్నాయి... 50 కోట్లు ఫైన్ వేస్తామన్నారు

» నెల తరువాత ఫోన్ చేసి ఎమ్మెల్యేని కలవమని చెప్పారు

» ఆమె మరిది గోపీ 2.20 కోట్లు మా నుంచి వసూలు చేశారు

» వారి నుంచి మాకు ప్రాణహాని ఉంది... రక్షణ కల్పించండి

» విచారించి మా సొమ్ములు మాకు ఇప్పించండి

» హోం మంత్రికి లిఖితపూర్వక ఫిర్యాదు

» విచారణకు ఆదేశించిన అనిత..!

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజని... బెదిరించి, భయపెట్టి కోట్లు వసూలు చేశారంటూ హోం మంత్రి అనితకు ఫిర్యాదు అందింది. పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన బాలాజీ స్టోన్ క్రషర్ భాగస్వామి నల్లపనేని చలపతి రావు ఈమేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దానిని వారి న్యాయవాది నర్రా శ్రీనివాసరావు హోం మంత్రికి అందచేశారు. ఆ ఫిర్యాదులో తమ ప్రాణాలకు హాని ఉందని, రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. ఫిర్యాదును స్వీకరించిన హోం మంత్రి అనిత... విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు... చలపతిరావు, మరో ముగ్గురు భాగస్వాములతో కలసి 2010 నుంచి యడ్లపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ వ్యాపార సంస్థను నడుపుతున్నారు. 2020 సెప్టెంబరు 9న నాటి ఎమ్మెల్యే విడదల రజని పీఏ దొడ్డా రామకృష్ణ క్రషర్ వద్దకు వచ్చి ఎమ్మెల్యేని కలవమని చెప్పారు. ఆమేరకు వారు రజనిని ఆమె కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కలవలేదని అంటూనే.. వ్యాపారం చేసుకోవాలంటే డబ్బులు చెల్లించాలని ఆమె చెప్పారు. 'పీఏని కలిసి ఆయన చెప్పిన విధంగా చేయండి' అని చెప్పి పంపేశారు. వారు పీఏ రామకృష్ణను కలిశారు. ఆయన రూ.5 కోట్లు చెల్లించమని చెప్పారు. అంత చెల్లించలేమని చెప్పిన క్రషర్ యాజమాన్యాన్ని ఆయన బెదిరించారు. 'వ్యాపారం ఎలా చేస్తారో చూస్తాం... మీ అంతు చూస్తాం' అంటూ హెచ్చరించారు. సెప్టెంబరు 11న విజిలెన్స్ ఎస్పీ జాషువా సిబ్బందితో సహా క్రషర్‌కు వచ్చారు. తనిఖీల పేరుతో హడావిడి చేశారు. అవకతవకలు జరిగాయని, రూ.50 కోట్లు పెనాల్టీ చెల్లించాలని, సీజ్ చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. దాంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో క్రషర్ యాజమాన్యం విడదల రజని, పీఏని మళ్లీ కలిసింది. ఆయన రూ.5 కోట్లు చెల్లించి సెటిల్ చేసుకోవాలని సూచించారు. అంత ఇవ్వలేమని చెప్పిన యాజమాన్యం... సంస్థలో వాటా ఇవ్వడానికి సిద్ధపడింది. అయితే దానికి అంగీకరించని పీఏ... సొమ్ములే చెల్లించాలంటూ బలవంతం చేశారు. క్రషర్ భాగస్వాములు గడువు కోరి, వచ్చేశారు. విజిలెన్స్ ఎస్పీ జాషువా మళ్లీ 2021, మార్చి నెలలో క్రషర్ యజమానులను పిలిపించారు. రజని మరిది గోపీతో సెటిల్ చేసుకోవాలని సూచించారు. లేకుంటే రూ.50 కోట్లు ఫైన్ వేసి, కేసు ఫైల్ చేయక తప్పదని బెదిరించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాలాజీ స్టోన్ క్రషర్ యజమానులు విడదల రజని మరిది గోపీని కలిశారు. రజనికి రూ.2 కోట్లు, ఎస్పీ జాషువాకు రూ.10 లక్షలు, తనకు రూ.10 లక్షలు చెల్లించాలని, లేకుంటే కేసు తప్పదని గోపీ తేల్చి చెప్పారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో చలపతిరావు, భాగస్వాములు పైకాన్ని సమకూర్చుకున్నారు. 2021, ఏప్రిల్ 4న చిలకలూరిపేట టౌను, పురుషోత్తపట్నంలోని విడదల గోపి నివాసంలో ఆ మొత్తాన్ని ఆయనకు అందజేసినట్లు చలపతిరావు తన ఫిర్యాదులో వివరించారు. ఈ విషయం బయటకు పొక్కినా, ఫిర్యాదు చేసినా వ్యాపారం చేయలేరని, ప్రాణాలతో ఉండరని బెదిరించడంతో ఎవరికీ చెప్పకుండా మిన్నకుండిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విడదల రజని, ఆమె మరిది గోపీ, పీఏ రామకృష్ణ, నాటి విజిలెన్స్ ఎస్పీ జాషువా నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో వేడుకున్నారు. బెదిరించి, భయపెట్టి వసూలు చేసిన సొమ్ములు వెనక్కి ఇప్పించాలని నల్లపనేని చలపతిరావు విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వంలో చేనేతకు పూర్వ వైభవం

» ఇల్లు మునిగిన నేతన్నలకు 30 వేలు: మంత్రి సవిత


మంగళగిరి ఆటోనగర్‌లో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్స్ శాలను సందర్శించి, మగ్గం నేస్తున్న చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 19: ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా అధునాతన డిజైన్ల రూపకల్పనలో చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చి, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాలను గురువారం ఆమె సందర్శించారు. మగ్గాల ఏర్పాటు, స్టోర్ రూమ్, క్వాలిటీ కంట్రోల్ రూమ్, సేల్స్ కౌంటర్లను పరిశీలించారు. స్టాండు మగ్గాలు, జకార్డ్ మిషన్ల పనితీరును పరిశీలించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ... 'మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్‌శాల ద్వారా ఎంతో మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు స్వయం ఉపాధి లభిస్తోంది. చేనేతలను అన్ని విధాలా అభివృద్ధి పరచడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారు. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో వుంచుకుని ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఎగ్జిబిషన్ తరహాలో చేనేత వస్త్రాల అమ్మకాల ఎగ్జిబిషన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తాం. ఇటీవల కురిసిన వర్షాలకు చేనేత కార్మికులకు జరిగిన నష్టంపై నివేదికలు తెప్పించాం. పూర్తిగా ఇల్లు మునిగిపోయిన చేనేత కార్మికులకు రూ.25 వేలతోపాటు నూలు కోసం అదనంగా రూ.5 వేలు ఇవ్వనున్నాం' అని తెలిపారు.


గుంటూరులో విలేకరుతో మాట్లాడుతున్న పార్థసారథి

ఏపీలో కూడా హైడ్రా తరహా చట్టం: కొలుసు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 19: 'ఏపీలో కూడా చెరువులు, కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. వాటిని తొలగించడానికి తెలంగాణలో ఉన్న హైడ్రా తరహా చట్టాన్ని తీసుకువస్తాం' అని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం ఆయన గుంటూరులో విలేకరుతో మాట్లాడారు. 'గత వైసీపీ హయాంలోనే అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి కూల్చివేతలకు చర్యలు తీసు కుంటాం. గుంటూరు జిల్లా పేరేచర్ల లే అవుట్‌లో అక్రమాలు చేసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై చర్యలు తప్పవు. అక్రమాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. విజిలెన్స్ నివేదిక అందగానే చర్యలు ప్రారంభిస్తాం. అదనంగా లబ్ధి చేకూరిన సొమ్మును రాబడతాం. అవసరమైతే లే అవుట్‌లో ఉన్న ఆయన మెటీరియల్‌ను కూడా స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

హైకోర్టులో మరో పది మంది ఏజీపీల నియామకం

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో 10మంది సహాయ ప్రభుత్వ న్యాయవాదులను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదులు బలిబోయిన శ్రావణి, సి.ఇంద్రాణి, కొతారు విజయేశ్వరి, వి.ఆదినారాయణ, బి.వెంకట సత్యనారాయణ, పనుకు రాజేష్‌కుమార్, గంజి నీలోత్పల్, గోళ్ల బసవేశ్వరరావు, కూరాకుల శివప్రసాద్, సనక సుబ్రహ్మణ్యం ఏజీపీలుగా నియమితులయ్యారు. వీరిలో ఏడుగురు బీసీలు, ముగ్గురు ఓసీలు ఉన్నారు. వీరంతా మూడేళ్ల పాటు ఈ పోస్టుల్లో కొనసాగనున్నారు. ఇప్పటి వరకు జరిపిన ఎస్‌జీపీలు, జీపీ, ఏజీపీల నియామకాలలో ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

3ప్లస్3 భద్రత పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే గంగుల పిటిషన్

» పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని హోంశాఖకు హైకోర్టు ఆదేశం

» విచారణ మూడు వారాలకు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా ఉండగా తనకు కల్పించిన 3ప్లస్3 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేత, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి వేసిన పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. తనకు ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను ఉపసంహరించారని, సెక్యూరిటీ రివ్యూ కమిటీ సైతం ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదని పిటిషన్‌లో గంగుల బిజేంద్రరెడ్డి పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్నందున భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ..పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని, ఆయనకు ఎలాంటి ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు.

వైద్య విద్య ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలు కల్పించాలి

» హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు

» విచారణ వారం రోజులు వాయిదా


అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఈ ఏడాది వైద్య విద్య ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలు వర్తింపజేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ ప్రయోజనాలను వర్తింపజేయకుండా వైద్యవిద్య సీట్ల భర్తీకి ఎన్టీఆర్ హెల్త్ యునివర్సిటీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని, కౌన్సిలింగ్ నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన నలుగురు విద్యార్థులు పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలింగ్‌ను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు అత్యవసరంగా విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది దుగ్గిరాల సుభాశ్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు, ఏపీ ఎస్సీ కులాల(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2000 ప్రకారం వైద్య విద్య ప్రవేశాల్లో రిజర్వేషన్ ప్రయోజనాలను వర్తింపజేయడం లేదని విన్నవించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఈ చట్టాన్ని గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసిందని గుర్తుచేసింది. వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పులో సైతం ఇది అమల్లో ఉంటుందని నిర్దిష్టంగా ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.



బాధ్యులపై కఠిన చర్యలు

▶ గత ప్రభుత్వంలో తిరుమల అపవిత్రం

▶ ప్రక్షాళన ప్రారంభించాం: చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రసాదం తయారీలో నాసిరకమైన ముడిసరుకులు వాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ పరిశీలించి, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసాదంలో జంతు సంబంధిత పదార్థాలు ఏవి వాడారనేది నివేదికలు నిర్దిష్టంగా చెప్తున్నాయన్నారు. గత ప్రభుత్వం తిరుమలలో భక్తులకు నాసిరకం భోజనం పెట్టి, తిరుమల తిరుపతి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. గురువారం అమరావతి సచివాలయ ప్రాంగణంలో అన్న క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి హిందువులకు కలియుగ ప్రత్యక్ష దైవం. అలాంటి పవిత్రమైన తిరుమలను గత ప్రభుత్వం పూర్తిగా అపవిత్రం చేసింది. ఎన్టీరామారావు తిరుమలలో భక్తులకు అన్న ప్రసాదం అందించే కార్యక్రమం ప్రారంభించారు. దాన్ని కూడా నాశనం చేసే పరిస్థితికి వచ్చారు. పవిత్రమైన దేవాలయంలో అపవిత్రమైన ముడిసరుకులు వాడారు. ఇలాంటి దుర్మార్గులను ఏం చేయాలో నాకర్థం కావట్లేదు. తిరుమల ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభించాం. అన్న ప్రసాదానికి భక్తులు, దాతలు విరాళాలిస్తున్నారు. వేంకటేశ్వరస్వామికి ఎవరైనా అపచారం తలపెడితే ఈ జన్మలో కాకపోతే.. తర్వాత జన్మలోనైనా శిక్ష తప్పదు. చివరికి వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి, పెళ్లిళ్లలో ఊరేగించే పరిస్థితికొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేంకటేశ్వరస్వామిని వాడుకోవడం సరికాదు. ఆధారాలు దొరికాక అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయి. ప్రసాదంలో జంతు సంబంధ పదార్థాలు ఏవి వాడారనేది నివేదికలు నిర్దిష్టంగా చెప్తున్నాయి. దీంతో కొంతమంది పారిపోయారు. కొందరిని తప్పించి, పవిత్రమైన నెయ్యి తెచ్చాం. నాణ్యత పెరగడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని అన్నారు. కాగా, రాష్ట్రంలో పేదల కడుపు నింపడానికి పెట్టిన అన్న క్యాంటీన్లకు దాతలు విరాళాలు ఇవ్వాలని చంద్రబాబు కోరారు. అన్నక్యాంటీన్ అంటే సేవాభావానికి స్ఫూర్తినిచ్చే కేంద్రం కావాలన్నారు. ఇప్పటికే 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించగా, ఇప్పుడు మరో 75 ప్రారంభిస్తున్నామని తెలిపారు. 'అన్నక్యాంటీన్లను గత ప్రభుత్వం చాలా దుర్మార్గంగా రద్దు చేసింది. మా ప్రభుత్వంలో 203 అన్నక్యాంటీన్లు పెట్టాలని నిర్ణయించాం. దేశంలో రోజూ 22లక్షల మందికి అక్షయపాత్ర సంస్థ భోజనం పెడుతోంది. అక్షయపాత్రకు ప్రభుత్వం డబ్బులివ్వడం లేదు. దాతలిస్తున్నారు. సేవాభావంతో పనిచేసే సంస్థను విమర్శించడం దుర్మార్గం' అని విమర్శించారు. తొలుత పేదలకు సీఎం స్వయంగా భోజనం వడ్డించారు.

ఇదేం ఘోరం గోవిందా!

దేవుడి జోలికొస్తే సర్వనాశనమవుతారు: మంత్రి లోకేశ్

తిరుపతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'శ్రీవేంకటేశ్వర స్వామి జోలికొస్తే సర్వనాశనమవుతారని గతంలోనే చెప్పా.. మళ్లీ చెబుతున్నా' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయని ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ అయిందని చెప్పారు. ఈవోగా ధర్మారెడ్డి వచ్చాకే నెయ్యి గోల్‌మాల్ జరిగిందని దుయ్యబట్టారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి బయలుదేరి వెళ్లారు. యువగళం పాదయాత్ర సందర్భంగా 100వ కిలోమీటరు వద్ద డయాలసిస్ ఏర్పాటుకు హామీ ఇస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. అక్కడ శుక్రవారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించి.. ప్రజావేదిక కార్యక్రమంలో లోకేశ్ పాల్గొననున్నారు.

వారికి దేవుడంటే భయం.. భక్తి లేవు: నీలాయపాలెం

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని సరైన ప్రమాణాలు లేకుండా, కూరగాయలు, జంతువుల కొవ్వు కలిపిన నెయ్యితో తయారుచేశారని సీఎం చంద్రబాబు చెప్పిన మాట వాస్తవమని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. భక్తులు ప్రీతిపాత్రంగా స్వీకరించే లడ్డూల తయారీలో ఇంత పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందే కాకుండా, మళ్లీ వేంకటేశ్వరుడి ముందు ప్రమాణం చేయడానికి అప్పట్లో దేవస్థానాన్ని నడిపిన వైసీపీ నాయకులు సిద్ధపడటాన్ని చూస్తుంటే.. వాళ్లకి దేవుడంటే భయం భక్తి లేనట్లు ఉందని విమర్శించారు.

జంతువుల కొవ్వు వినియోగం హేయం: లంకా దినకర్

గుంటూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యి వాడటం హేయమని బీజేపీ ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ మండిపడ్డారు. ఈ చర్య హిందువుల మనోభావాలను కించపరచడమే అన్నారు. గురువారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ హయాంలో టీటీడీలో ప్రారంభమైన దోపిడీ జగన్ పాలనతో తారస్థాయికి చేరుకుందని ఆరోపించారు.

కమీషన్ల కోసమే...

నేరచరిత్ర కలిగిన వారిని టీటీడీ పాలక మండలిలో సభ్యులుగా నియమించారు. కమీషన్ల కోసం శ్రీవారి ప్రసాదాల నాణ్యతనూ దెబ్బతీశారు. రోజుకు 14 టన్నుల నెయ్యి వాడే టీటీడీ నాణ్యత పరీక్షించకుండా ఎలా కొనుగోలు చేసింది?"

- భానుప్రకాశ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అది విదేశీ బటర్ ఆయిల్

శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించేది స్వచ్ఛమైన ఆవు నెయ్యి కాదు. అది విదేశీ బటర్ ఆయిల్. వైసీపీ హయాంలో లడ్డు నాణ్యత తగ్గడానికి నెయ్యి ప్రధాన కారణం. గత పాలకమండలి పెద్దలు కమీషన్ల కోసమే టెండర్ విధానం మార్చారు.

- ఓవీ రమణ, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు

తిరుమల అపవిత్రతపై సీబీఐ విచారణ చేయించాలి: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల అపవిత్రతపై తక్షణమే ఉన్నతస్థాయి కమిటీ వేయాలని లేదా సీబీఐతో విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబును ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని, లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వును కలిపారని సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆమె గురువారం ఎక్స్‌లో స్పందించారు. సీఎం హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని షర్మిల అన్నారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలు దెబ్బతిసేలా టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికి మచ్చతెచ్చేలా సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమల అపవిత్రతపై చేసిన వ్యాఖ్యలకు సీఎం కట్టుబడి ఉండాలన్నారు.

లడ్డూపై అడ్డగోలుగా..: శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాలపై భక్తుల ఆవేదనను ఎదురు దాడులు, అడ్డగోలు వాదనలతో గత వైసీపీ ప్రభుత్వం ఎదుర్కొనే ప్రయత్నం చేసింది. లడ్డూల తయారీకి అత్యంత నాణ్యమైన నెయ్యిని అందిస్తున్న కర్ణాటకు చెందిన నందినీ నెయ్యిని.. వచ్చి రాగానే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. కారణం అడిగితే.. టీటీడీ అవసరాలకు తగిన పరిమాణంలో సంస్థ అందించలేకపోతోందని అడ్డగోలు వాదన చేశారు. ఆ తర్వాత నుంచే లడ్డూ నాణ్యత పడిపోయిందని భక్తుల నుంచి ఫిర్యాదులు పెరిగాయి. అన్న ప్రసాదం తింటుంటే గడ్డి తింటున్నట్టు ఉందని భక్తులు అప్పట్లో ఆగ్రహించారు. దీనిపైనా టీటీడీ తలాతోక లేనివిధంగా స్పందించింది. శ్రీవారి అన్న ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ దిగుబడులను వాడుతున్నామని, ఆ కారణంగానే రుచిలో తేడా వచ్చిందని విచిత్రమైన వివరణ ఇచ్చుకున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

నాణ్యమైన నెయ్యి సరఫరా చేస్తున్న తమను టీటీడీ అధికారులు కావాలని పక్కన పెట్టారని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఆరోపించడం దీనికి బలం చేకూర్చింది. అయితే అప్పట్లో టీటీడీ యంత్రాంగం మొండిగా ముందుకు వెళ్లడంతో భక్తులు, హిందూ ధర్మ ప్రచారకులు, ప్రతిపక్ష పార్టీల నేతలూ సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం మినహా మరేమీ చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నెయ్యి నాణ్యతను పరీక్షించడంతో కల్తీ గుట్టు రట్టయింది. అభ్యంతరకర పదార్థాలు ఉన్నాయని రిపోర్టు తోసహా టీడీపీ ముఖ్యనేత ఆనం వెంకట్రమణారెడ్డి బహిర్గతం చేయడంతో శ్రీవారి భక్తజనంలో అలజడి రేగుతోంది.

ఎదురు దాడులు.. అడ్డగోలు వాదనలు

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడగా, 2020 ఫిబ్రవరి దాకా శ్రీవారి లడ్డూల నాణ్యత గురించి ఎక్కడా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. కొవిడ్ తర్వాత 2020 డిసెంబరు నుంచీ భక్తుల్లో అసంతృప్తి కనిపిస్తూ వచ్చింది. లడ్డూల్లో మునుపటి రుచి గానీ, సువాసన గానీ, నాణ్యత గానీ లేదన్న ఆరోపణలు మొదలయ్యాయి. హిందూ ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్ దాస్ తొలిసారి సామాజిక మాధ్యమాల్లో లడ్డూ నాణ్యతను ప్రశ్నించారు. అప్పట్లో ఈ అంశానికి దేశవ్యాప్తంగా ప్రచారం లభించింది. అప్పటి నుంచీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో పలువురు భక్తులు లడ్డూ నాణ్యతపైన, అలాగే అన్న ప్రసాదాలపైన కూడా ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. లడ్డూ రుచికరంగా లేకపోవడంతో పాటు రెండు రోజులకే పాడవుతోందన్న ఫిర్యాదులు పెరిగాయి. ఇక అన్న ప్రసాదాల విషయంలో అయితే అన్న ప్రసాద సత్రంలో భోజనం చేసిన సుమారు 20 మంది భక్తుల బృందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అన్నం తింటుంటే గడ్డి తింటున్నట్టు ఉంది. మేము భక్తులమా లేక పశువులమా?" అని సిబ్బందిపై విరుచుకుపడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా అప్పట్లో వైరల్ అయింది. అయినా అప్పటి టీటీడీ పాలకమండలి దీన్ని కొట్టి పారేసింది.

డొల్లతనం బయటపడిందిలా...

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రాష్ట్రంలో దెబ్బతిన్న వ్యవస్థల ప్రక్షాళనను టీటీడీ నుంచే ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగా కొన్నేళ్లుగా భక్తులనుంచి తీవ్ర విమర్శలు వస్తున్న లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై కొత్త ఈవో శ్యామలరావు దృష్టి పెట్టారు. అప్పటికి ఐదేళ్లుగా తమిళనాడుకు చెందిన కంపెనీ సహా ఐదు సంస్థలు తిరుమలకు నెయ్యిని సరఫరా చేస్తున్నాయి. ఈవో శ్యామలరావు నెలపాటు పోటు కార్మికులు, అన్న ప్రసాదాల తయారీ విభాగం కార్మికులు, అధికారులతో తరచూ సమావేశమై సమీక్షించారు. ఏయే వస్తువులు వాడుతున్నారు? ఎంత పరిమాణంలో? ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? వాటి నాణ్యత ఎలా వుంది? పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు ఏమిటి? అని ఆరా తీశారు. లడ్డూ సహా అన్నప్రసాదాల నాణ్యత తగ్గడానికి ప్రధాన కారణం నాణ్యత లేని నెయ్యి అని ఆయన దృష్టికి వచ్చినట్టు తెలిసింది.

దీన్ని నిర్ధారించుకోవడానికి ఈ కంపెనీలు సరఫరా చేస్తున్న నెయ్యి శాంపిల్‌ను పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీకి చెందిన అనుబంధ ల్యాబ్‌కు పంపించారు. జూలై 8న పంపగా వాటి రిపోర్టు అదే నెల 16వ తేదీన వచ్చింది. అందులో.. తమిళనాడుకు చెందిన కంపెనీ అందిస్తున్న నెయ్యిలో భారీగా కల్తీ జరిగినట్టు ఈ నివేదిక తేల్చింది. దీంతో తమిళనాడుకు చెందిన సంస్థ నుంచి నెయ్యి సరఫరాను నిలిపివేశారు. మిగతా సంస్థలను నాణ్యతను పాటించాలని హెచ్చరించారు. నందినీ నెయ్యి సరఫరాను పునరుద్ధరించారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో చంద్రబాబు దీనిపై తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. అదే సమయంలో తిరుమల కొండ పవిత్రతను కాపాడి, టీటీడీ పాలనను మెరుగుపరిచే చర్యలను ప్రారంభించారు.

రివర్స్‌లో 'నందినీ'కి టెండర్!

దేశంలో గుజరాత్ ఆనంద్ డెయిరీ తర్వాత అంతటి పేరు ప్రతిష్ఠలున్న సంస్థ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్). ఈ ఫెడరేషన్ నందినీ బ్రాండ్ పేరిట నెయ్యిని సుదీర్ఘ కాలం టీటీడీకి సరఫరా చేసింది. కేఎంఎఫ్ సరఫరా చేసే నెయ్యి నాణ్యతాపరంగా పేరుమోసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా కొంతకాలం పాటు కేఎంఎఫ్‌యే టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. అయితే 2023లో హఠాత్తుగా నందినీ నెయ్యి సరఫరాను నిలిపివేశారు. దీనిపై కొంతకాలం మౌనం వహించిన కేఎంఎఫ్ ఎట్టకేలకు అదే ఏడాది జూలైలో స్పందించింది. టీటీడీ ఉద్దేశపూర్వకంగానే తమను పక్కన పెట్టిందని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ చైర్మన్ భీమా నాయక్ అప్పట్లో ఆరోపించారు. తమను టెండర్లలో పాల్గొననివ్వడం లేదని కూడా తెలిపారు. కేఎంఎఫ్ సరఫరా చేసే నెయ్యి నాణ్యత బాగుండడంతో తక్కువ ధరకు టీటీడీకి సరఫరా చేసే పరిస్థితి లేకపోయిందని, తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేయడమంటే నాణ్యత విషయంలో రాజీ పడినట్టేనని ఆయన అభిప్రాయపడ్డారు. టీటీడీ అధికారులు అప్పట్లో రివర్స్ టెండరింగ్ పేరిట తక్కువ ధరకు నెయ్యి సేకరించాలని నిర్ణయించారు. కేఎంఎఫ్ వంటి సంస్థలను పక్కన పెట్టడంతో అనివార్యంగా నాసిరకం నెయ్యిని లడ్డూ తయారీకి వినియోగించాల్సి వచ్చిందన్న ఆరోపణలు వచ్చాయి. సాంకేతిక అంశాలు ఆ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఉన్నాయి. దీనిపై అప్పట్లో కొంతకాలం పాటు కర్ణాటకలోని పలు రాజకీయ పక్షాలు సైతం ఏపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేశాయి. అయితే తర్వాత కొంతకాలానికి ఈ వివాదం సద్దుమణిగింది.

అన్నప్రసాదాలపై...

శ్రీవారి ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ దిగుబడులను వాడుతున్నామని, ఆ కారణంగానే రుచి మారిందని అప్పట్లో టీటీడీ వాదించింది. ఆ వివరణ భక్తులకు సంతృప్తి కలిగించలేదు. కాగా, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ చైర్మన్ చేసిన ఆరోపణలు, శ్రీవారి ప్రసాదాల నాణ్యత తగ్గిందని వచ్చిన ఫిర్యాదులపై అప్పట్లో టీటీడీ చేసిన వాదన చాలా పేలవంగా అనిపించింది. టీటీడీ అవసరాలకు తగిన పరిమాణంలో ఆ సంస్థ సరఫరా చేయలేకపోయిందట! నిజానికి, ఎప్పుడూ టీటీడీ ఒకే సంస్థ నుంచి నెయ్యి సేకరించింది లేదు. 2014 నుంచీ టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న కేఎంఎఫ్ ఎప్పుడూ నిర్దేశించిన పరిమాణంలో, గడువులో నెయ్యి సరఫరా చేస్తూ వచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో టీటీడీ అధికారులు చేసిన వాదన నిలవలేదు.

ఆ నాలుగేళ్లూ కొనలేదు

▶ వారం నుంచే మళ్లీ నందిని నెయ్యి సరఫరా: కేఎంఎఫ్ చైర్మన్

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉపయోగించారని సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) స్పందించింది. కేఎంఎఫ్ చైర్మన్ భీమా నాయక్ గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ, నాలుగేళ్లుగా తిరుమలకు కర్ణాటక పాల సమాఖ్య నుంచి నందిని నెయ్యి సరఫరా చేయలేదని చెప్పారు. అక్కడ వస్తున్న ఆరోపణలతో నందిని బ్రాండ్లకు సంబంధం లేదని పేర్కొన్నారు. 2020 నుంచి 2024 వరకు టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదని స్పష్టం చేశారు. ఇటీవలే కొత్త టెండరు ద్వారా 350 టన్నుల నెయ్యి కోరారని, వారం క్రితమే సరఫరా ప్రారంభించామని తెలిపారు.



కేంద్ర లేబొరేటరీ నివేదిక చూపిస్తున్న టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు

▶ టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో చేప నూనె

▶ గొడ్డు కొవ్వు, పంది కొవ్వు, మైదానూ కలిపారు

▶ కమీషన్ల కోసం వైసీపీ నేతల అక్రమాలు: ఆనం

నెల్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో కుళ్లిపోయిన జంతువుల కొవ్వు, చేప నూనె కలిపారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ల్యాబొరేటరీ పరీక్షల్లో ఇది నిర్ధారణ అయిందని తెలిపారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వంలో లడ్డూలు కంపు కొడుతున్నాయి. లడ్డూ నాణ్యత సరిగా లేదని, చర్యలు తీసుకోవాలని అనేకమంది భక్తులు ఫిర్యాదు చేశారు. ఫోన్ ఇన్ పెట్టినప్పుడు కూడా ఈవోకు అనేకమంది చెప్పారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లడ్డూలు, ప్రసాదాలు, భోజనాల నాణ్యతపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమించింది. ఎన్‌డీఆర్ఐ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీ సురేంద్రనాథ్, డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డి. స్వర్ణలతతో ఈ కమిటీ ఏర్పాటైంది. కమిటీ విచారణలో అనేక వాస్తవాలు బయటకు వచ్చాయి. అప్పటివరకూ నెయ్యి సరఫరా చేసినవారిని వైసీపీ ప్రభుత్వంలో మార్చేశారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని ఎందుకు మార్చాల్సి వచ్చింది? వాళ్లు లంచాలు ఇవ్వరు కాబట్టి మార్చారు. మంచి ఆవు నెయ్యి కేజీ ధర రూ.వెయ్యికి తక్కువ లేదు. కానీ వైసీపీ ప్రభుత్వంలో టెండర్ పిలిచి రూ.320కే సరఫరా చేసేలా నలుగురికి కాంట్రాక్ట్ అప్పగించారు. ఇంత తక్కువ ధరకు ఎవరైనా సరఫరా చేయగలరా? ఇందులో భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి పాత్రధారులు. నెయ్యి నాణ్యతను పరిశీలించేందుకు తిరుమలలో ల్యాబ్ పెడితే వీరి బాగోతం బయటపడుతుందని ఆ గోవిందుడినే మోసం చేశారు. ఈ విధంగా హిందువుల మనోభావాలను దెబ్బతీయవచ్చా..? ఏఆర్ ఫుడ్స్ అనే కంపెనీ టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోంది. అక్కడినుంచి వచ్చిన ఒక ట్రక్కు నెయ్యిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ల్యాబ్‌కు పరీక్షకు పంపారు. 52 ఐటమ్స్‌ను అక్కడ అనాలసిస్ చేసి రిపోర్ట్ ఇచ్చారు. ఈ నెయ్యిలో సోయాబీన్, సన్‌ఫ్లవర్ సీడ్, మైదా, కోకోనట్‌తో పాటు చేప నూనె కూడా ఉన్నట్లు రిపోర్టులో తేలింది. పామాయిల్, గొడ్డు కొవ్వు, పంది కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయింది. నాణ్యమైన నెయ్యికి 'ఎస్' విలువ 95.8 నుంచి 104.32 మధ్య ఉండాలి. కానీ ఇక్కడ ఒక శాంపిల్ విలువ 19.72 ఉంది. మరో శాంపిల్‌కు 19.77 వచ్చింది. అంటే ఒరిజినల్ నెయ్యి నాణ్యతలో 20శాతం కూడా లేదని తేలింది. వేంకటేశ్వర స్వామి ప్రసాదాల్లో కుళ్లిపోయిన జంతువుల నుంచి తీసిన నెయ్యిని వాడతారా? ఇది ఎంత అన్యాయం? ఇదేనా వైసీపీ పాలన? తిరుమలలో అన్యాయం జరుగుతోందని, వైఎస్ ఫ్యామిలీకి స్వామి మీద నమ్మకం లేదని మొదటినుంచీ చెబుతూనే ఉన్నాం. తిరుమల వేంకటేశ్వరుడి వద్ద వేల సంవత్సరాల నుంచి జరగని తప్పు వైసీపీ రాక్షసులు చేశారు. కలియుగ దైవంతో పెట్టుకున్న ప్రతీఒక్కరూ సర్వనాశనం అయిపోతారు. హిందువులకు న్యాయం జరగాలంటే జగన్మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిలను ఉరి తీయాలి. చంద్రబాబు ఏదేదో మాట్లాడేశారని వైసీపీ నేతలు కూస్తున్నారు. ఇవిగో రుజువులు (ల్యాబ్ రిపోర్టులు చూపిస్తూ...). శ్రీవారిని నమ్ముకున్న ప్రతీ ఒక్క భక్తుడికీ జరిగిన అన్యాయం ఇది. మేము ఈ నెయ్యి సరఫరాను నిలిపేశాం. నందినీ డెయిరీ నెయ్యిని పునరుద్ధరించాం. కర్ణాటక ప్రభుత్వం కూడా తమకు లాభం వద్దు.. దేవుడికి తక్కువ ధరకు సరఫరా చేస్తామని ముందుకొచ్చారు. అంత భక్తితో కర్ణాటక ప్రభుత్వం ఉంటే వైసీపీ నాయకులు ఎవరెవరి దగ్గరకో వెళ్లి జంతువుల మాంసం కలిసిన నెయ్యి తీసుకురావడం దుర్మార్గం. వెంటనే టీటీడీని ప్రక్షాళన చేయాలి. జరిగిన తప్పును క్షమించాలని దేవుడిని వేడుకుంటున్నాం. వైసీపీ ప్రభుత్వాన్ని అంతమొందించి కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇవ్వడమనేది ఆ స్వామి రాసిన స్క్రిప్టు. టీటీడీని అపవిత్రం చేసిన ప్రతీఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందే..' అంటూ ఆనం వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌డీడీబీ నివేదిక ప్రతులను ప్రదర్శించారు.

అదానీ పోర్ట్సు సాయం 25 కోట్లు

▶ సీఎంఆర్ఎఫ్‌కు విరాళాల వెల్లువ.. ఏపీఎండీసీ 5 కోట్లు

▶ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు చెక్కుల అందజేత



అదానీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అదానీ ప్రీతి తరఫున రూ.25 కోట్ల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న అదానీ పోర్ట్స్ అండ్ ఎస్‌ఈజెడ్ ఎండీ అదానీ కరణ్

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం అనేక మంది దాతలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇస్తున్నారు. గురువారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను కలిసి విరాళాల చెక్కులను అందజేశారు. ఆ దాతల్ని సీఎం చంద్రబాబు, లోకేశ్ అభినందించారు. అదానీ పోర్ట్స్ ఎండీ కిరణ్ అదానీ రూ.25 కోట్లు, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.5 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గ ప్రజలు, నాయకుల తరఫున ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి రూ.2,22,70,749, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ తరఫున రూ.కోటీ 10 వేల 116 అందించారు. పశ్చిమ గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.కోటీ 116, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ తరఫున కె.ప్రతాప్‌రెడ్డి రూ.60 లక్షలు, పొన్నూరు నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల తరఫున ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి రూ.30 లక్షలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల తరఫున ఇన్‌చార్జి వలవల బాబ్జీ రూ.30 లక్షలు, స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ కేవీఎస్ రామచంద్రరావు రూ.20 లక్షలు, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు జీఎస్‌బీ చౌదరి నేతృత్వంలో ప్రతినిధి బృందం రూ.14,41,348, అచ్యుతాపురం ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరఫున పి.నారాయణ రాజు రూ.10.78 లక్షలు, ఎస్పీ కిరణ్‌కుమార్ రూ.10 లక్షలు, డాక్టర్ వైభవ్‌చంద్ రూ.10 లక్షలు, కానూరి నరసింహారావు రూ.7.50 లక్షలు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రూ.7 లక్షలు, నెల్లూరు జిల్లా కమ్మజన సంక్షేమ సమితి రూ.5 లక్షలు, డాక్టర్ నెల్లూరి రమేష్ రూ.5 లక్షలు, దుర్గా సారథి రూ.5 లక్షలు, దొడ్డా చిన్నబాలాజీ రూ.5 లక్షలు, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ రూ.5 లక్షలు అందజేశారు. టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా రూ.30 లక్షలు, ఏపీ స్టేట్ ప్రైవేట్ ఐటీఐ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సుధాకర్ రూ.10 లక్షలు, శ్రీసాయి వెంకటేశ్వర ఎడ్యుకేషన్ నిర్వాహకుడు వి.సతీష్ రూ.10 లక్షలు, జంగారెడ్డిగూడెంకు చెందిన విద్య వికాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రిన్సిపల్ పి.సతీష్, కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు రూ.5 లక్షలు, సాయి రమ సివిల్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గోవిందరావు రూ.5 లక్షలు, ఎస్ పబ్లికేషన్స్ నిర్వాహకులు ఎం శేషావలి రూ.3 లక్షలు ఇచ్చారు.



సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.5కోట్ల విరాళాన్ని అందజేస్తున్న ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన కరణ్ అదానీ

అదానీ పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ గురువారం మంత్రి లోకేశ్‌ను కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

'రూ.99కే క్వార్టర్'పై స్పష్టత ఇవ్వండి

▶ ప్రభుత్వాన్ని కోరిన మద్యం సరఫరాదారుల సంఘం అధ్యక్షుడు కామేశ్వరరావు

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకొస్తున్న నేపథ్యంలో మద్యం ధరలపై ప్రభుత్వం చేసిన ప్రకటన మద్యం కంపెనీల్లో ఆందోళనకు తెరతీసింది. క్వార్టర్ రూ.99 ధరకే విక్రయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది అన్ని బ్రాండ్లకు ఎలా వర్తిస్తుందని కంపెనీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. క్వార్టర్ రూ.99 అనే ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని లిక్కర్, బీరు సరఫరాదారుల సంఘం అధ్యక్షుడు ఎం.కామేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. రూ.99 ధరకే ప్రభుత్వానికి మద్యం సరఫరా చేయాలేమోనన్న సందిగ్ధత కంపెనీల యాజమాన్యాల్లో నెలకొందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు కూడా అన్ని రకాల బ్రాండ్లూ ప్రభుత్వం ప్రకటించిన తక్కువ ధరకే లభ్యమవుతాయనే ఆలోచనలో ఉన్నారని అన్నారు. ధరలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

సరిహద్దు రాష్ట్రాల పాఠశాలల్లో తెలుగు టీచర్ల కొరత

▶ కేంద్ర మంత్రి ప్రధాన్‌కు ఎంపీ కలిశెట్టి లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోని పాఠశాలల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాశారు.

రఘురామ కేసులో విచారణ వేగవంతం

▶ కొలిక్కి వచ్చిన దర్యాప్తు.. త్వరలోనే అరెస్టులు

▶ విచారణపై పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష

▶ 10 మంది పోలీసులకు బిగుస్తున్న ఉచ్చు

గుంటూరు, సెప్టెంబరు 19: నరసాపురం మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు కేసులో ఎట్టకేలకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఆయనపై హత్యాయత్నం, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులు, సిబ్బందిని త్వరలోనే అరెస్టు చేయనున్నారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రఘురామరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ 2021లో ఆయనపై దేశద్రోహం కింద కేసు నమోదుచేసిన సీఐడీ అధికారులు.. ఆ ఏడాది మే 14న జన్మదినం రోజున ఆయన్ను హైదరాబాద్ నుంచి బలవంతంగా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఆరోజు రాత్రి కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడినట్లు రఘురామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్(ఏ-1), అప్పటి నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ-2), మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి (ఏ-3), సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్(ఏ-4), అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి (ఏ-5)తదితరులపై ఐపీసీ 120బీ, 166, 167, 197, 307, 326, 465, 506(34) తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే రోజులు గడుస్తున్నా కేసులో ఎటువంటి పురోగతీ లేదంటూ రఘురామరాజు పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. నేరుగా గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్‌ను కలిసి దర్యాప్తు వేగవంతం చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. రఘురామను హైదరాబాద్ నుంచి బలవంతంగా పోలీసులు తీసుకొచ్చిన సమయంలో అక్కడ ఇంటి వద్ద ఉన్న సాక్షులను, అదేవిధంగా సీఐడీ కార్యాలయానికి తరలించిన సందర్భంలో అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని అన్ని కోణాల్లో విచారించారు. అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. కేసుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ కూడా పూర్తి చేసినట్లు తెలిసింది. త్వరలోనే అరెస్టుల పర్వం మొదలుకానుందని అంటున్నారు. విచారణ తీరుపై గురువారం పోలీసు ఉన్నతాధికారులు సైతం సమీక్షించినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి రఘురామరాజును గుంటూరుకు తీసుకొచ్చిన పోలీసులెవరో ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఆ రోజు ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించింది ఎవరనేది కూడా గుర్తించినట్లు తెలిసింది. ఒక ఎంపీపై లాకప్‌లోనే హత్యాయత్నం చేయడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించే సాహసం చేసిన సీఐడీ అధికారులు, సిబ్బందికి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో ముగ్గురు, నలుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఉన్నట్లు గుర్తించారు. సుమారు పది మంది పోలీసు అధికారులు, సిబ్బంది అరెస్టు తప్పదని అంటున్నారు. ఇంకోవైపు.. అప్పట్లో రఘురామ కేసు దర్యాప్తు అధికారి అయిన సీఐడీ అదనపు ఎస్పీ కె.విజయ్‌పాల్ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో సీఐడీ సీఐగా పనిచేసిన దిలీప్‌కుమార్ ఆ తర్వాత అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. ఆయన్ను మినహాయించి.. ఆ రోజు విధుల్లో ఉన్న సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని సస్పెండ్ చేసి.. త్వరలోనే అరెస్టు చేయనున్నారు. ముందుగా పాత్రధారులందరినీ అరెస్టు చేశాక.. సూత్రధారులపై దృష్టి సారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచే 'ఇది మంచి ప్రభుత్వం'

- వంద రోజుల పాలనలో సాధించిన విజయాలపై ప్రజల్లోకి
- నేడు ప్రకాశం జిల్లాలో పాల్గొననున్న సీఎం
- మద్దిరాలపాడులో ప్రజలతో ముఖాముఖి
- వాతావరణం బాగోక సిక్కోలు టూరు రద్దు

అమరావతి/శ్రీకాకుళం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనకు వంద రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కొత్త కార్యక్రమం చేపడుతోంది. ఇది వారం పాటు 26వ తేదీదాకా జరుగుతుంది. ఇందులో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది, ఇతర శాఖల ప్రభుత్వ సిబ్బంది తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి.. ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలు, తీసుకున్న ప్రజాహిత నిర్ణయాల గురించి వివరిస్తారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా తమ నియోజకవర్గాల్లో ఈ ఏడు రోజులూ రోజుకో గ్రామం సందర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. వారికి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఎంపిక చేసిన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ పాలన గురించి వివరించాలి. తర్వాత ఆ గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించి జనం నుంచి వినతులు స్వీకరించాలి. వారి అభిప్రాయాలు తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మొదటి రోజు శుక్రవారం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిరాలపాడులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. కొన్ని నివాసాలకు వెళ్లి ప్రజలను కలుస్తారు. తర్వాత గ్రామసభలో ప్రసంగిస్తారు. ఆయన తొలుత శ్రీకాకుళం జిల్లాకు వెళ్లాలని భావించారు. అక్కడ ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం రాజపురంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడాలనుకున్నారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గురువారం సాయంత్రం వర్షాలు కురిశాయి. శుక్రవారం కూడా వాతావరణం అలానే ఉంటుందని, హెలికాప్టర్లో పర్యటించేందుకు వాతావరణం అనుకూలించదని అధికారులు నివేదించారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటన రద్దయిందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అమరావతిలో మెగా వాకింగ్ ట్రాక్

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డుకు అదనపు హంగులు అద్దడంతోపాటు.. సందర్శకుల తాకిడిని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు తరహాలో అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు బఫర్ జోన్‌లో అత్యంత పొడవైన వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అమరావతి అభివృద్ధి సంస్థ దీనికోసం టెండర్లు కూడా పిలిచింది. అమరావతిలో ఎన్-04 జంక్షన్ నుంచి ఎన్-11 జంక్షన్ వరకు రూ.88.31 లక్షల వ్యయంతో మెగా వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు. అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లో బిడ్లు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో 15 మీటర్ల మేర బఫర్ జోన్‌కు స్థలాన్ని వదిలారు. ఈ జోన్‌లోనే వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. దీనిలోనే సైక్లింగ్ కూడా చేసుకునేలా ఏర్పాటు చేస్తారు.

'జల్ జీవన్'లో

4,500 కోట్లు దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఈ పథకం అమలు నిర్వీర్యంగా మారింది. ఈ మిషన్ కింద సుమారు రూ.24 వేల కోట్లు కేంద్రం కేటాయించగా, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన రూ. 12 వేల కోట్లకు గాను రూ.2254 కోట్లకు మాత్రమే మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చింది. దీంతో గత ఐదేళ్లలో సుమారు రూ.20 వేల కోట్ల నిధులు వృథా అయ్యాయి. కేవలం రూ.4500 కోట్లు మాత్రమే జల జీవన్ మిషన్ కింద అందాయి. ఆ నిధులకు కూడా ఖర్చులను కాగితాలపై చూపించి... గత ప్రభుత్వంలో బిల్లులు చేసుకున్నారు. పైగా గతంలో కేంద్ర ప్రభుత్వ పథకం జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద చేపట్టిన సుమారు రూ.1000 కోట్ల పనులను.....జల్‌జీవన్ మిషన్ పనుల కింద చూపించి మరింతగా నొక్కేశారు. ఈ అక్రమాలపై సమగ్రమైన విచారణ చేపట్టాలి" అని పంచాయతీరాజ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు ఎక్కడా ఫలవంతం కాలేదని, నీటి వనరులు లేకుండానే గత ప్రభుత్వం కుళాయిలు ఏర్పాటుచేసిందని ఆయన అన్నట్టు తెలిసింది. "అసంపూర్తిగా ఉన్న పనుల విషయంలో 80 శాతం పూర్తయిన పనులను, అదే కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించి, రెండేళ్ల పాటు నిర్వహణ వారితోనే చేయించాలి. మిగిలిన అసంపూర్తి పనులకు కొత్తగా టెండర్లు పిలిచి డిసెంబరులో పనులు ప్రారంభించాలి. ఈ మిషన్‌ను నిర్వహించే కన్సల్టెన్సీలు కాలం చెల్లిన విధానాలు అవలంబిస్తున్నాయి. వాటిని మార్చేయాలి. పలు చోట్ల నాసిరకం పైపులు వాడటంతో రూ.వేలకోట్లు దుర్వినియోగం అయ్యాయి. వాటిపై కూడా విచారణ చేపట్టాలి. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి" అని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. కాగా, 26 జిల్లాల్లో 95.44 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందించాల్సి ఉండగా, 2019 ఆగస్టుకు ముందే సుమారు 31.68 లక్షల ఇళ్లకు ఇచ్చేశారని, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం సుమారు 39.30 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. అయితే, మిగతా 28 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి డీపీఆర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో 5 జిల్లాల్లో మాత్రమే 90 శాతానికి పైగా కుళాయి కనెక్షన్ల అమరిక పూర్తయిందని అధికారులు తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షిత నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో నాడు ఎన్డీయే ప్రభుత్వం తెచ్చిన జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని కూడా గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ మిషన్ కింద ఏపీకి నిధులు తీసుకురావడంలో నాడు ఘోరంగా విఫలం అయ్యారన్నారు. "కేంద్రం జల్ జీవన్ మిషన్ కింద ఇచ్చిన రూ.27,248 కోట్లలో నాటి వైసీపీ ప్రభుత్వం రూ.4,235 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గత వైసీపీ ప్రభుత్వ అలసత్వం, మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు" అని సీఎం మండిపడ్డారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఇక అడుగులు పడాలన్నారు. 2019కి ముందే పలుగ్రామాల్లో నిర్మాణమై ఉన్న ట్యాంకర్ల ద్వారా కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేసి నీటి సరఫరా చేశామని, తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సురక్షిత తాగునీటిని ప్రతి ఇంటికీ నిరంతరం అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీపంలోని రిజర్వాయర్ల నుంచి గ్రామాలకు పైప్ లైన్లు ఏర్పాటుచేసి నిరంతర తాగునీరు సరఫరా అయ్యేలా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, దీనిపై ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పురోగతి లేని పనుల టెండర్లు రద్దు చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వ తప్పులు సరిదిద్ది కేంద్రానికి విన్నవించి రాష్ట్రానికి నిధులు తీసుకొస్తామన్నారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అధికారులు పాల్గొన్నారు.



గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

వ్యక్తిగత అవసరాలకు ఇసుక పూర్తి ఉచితం

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక నూతన పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ పోర్టల్ ద్వారా ప్రజలు 24 గంటలూ ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా, ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా ఇసుక బుకింగ్ చేసుకోగలిగే విధంగా పోర్టల్ విధానాన్ని నవీకరించాలన్నారు. అయితే తర్వాతి రోజుకు అందుబాటులో ఉన్న ఇసుక మాత్రమే బుక్ అవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజల సౌకర్యార్థం దానిని వారం రోజులకు పెంచాలని ఆయన ఆదేశించారు. దీనివల్ల 7 రోజుల్లో అందుబాటులో ఉండే ఇసుకను ఎవరైనా బుక్ చేసుకునే వెసులుబాటు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇసుకను పొందగలిగే విధంగా పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. చిన్న చిన్న వాగులు, వంకల్లో ఉండే ఇసుకను సమీప గ్రామాల ప్రజలు ఉచితంగా తీసుకెళ్లే విషయంలో ఇబ్బందులు పెట్టవద్దని, వారు తమ వ్యక్తిగత అవసరాల కోసం ఎలాంటి రుసుం చెల్లించకుండా ఇసుక తీసుకెళ్లగలిగేలా నిబంధనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో అక్రమ రవాణా, అక్రమ మైనింగ్‌కు అవకాశం లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. విజిలెన్స్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. నూతన ఇసుక పోర్టల్ ద్వారా ఇసుక సరఫరాపై వివిధ దశల్లో అనుక్షణం నిఘా ఉంటుందని చెప్పారు. అధికారులు మొదలుకొని రవాణాదారుల వరకు ఎవరూ తప్పులు చేయలేని విధంగా పోర్టల్‌ను రూపొందించినట్లు వివరించారు. మరోవైపు.. ఇసుక సరఫరా విధానాన్ని థర్డ్ పార్టీ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ తనిఖీలు నిర్వహిస్తుందని చెప్పారు. ఉచిత ఇసుక విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నంబరు 1800 599 4599కు లేదా ఈ-మెయిల్ dmgapsan-dcomplaints @yahoo.com ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల నుంచి తిరిగి సమాచారం అందిస్తారని సీఎంకు మంత్రి వివరించారు. గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. రాష్ట్రమంతా ఒకే విధంగా రవాణా చార్జీలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇసుక రవాణా లారీల యజమానులు ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తే చర్యలు తీసుకునేలా నిబంధనలను రూపొందించామన్నారు. లారీలకు జీపీఎస్ విధానాన్ని అనుసంధానం చేయడం ద్వారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా ఉచిత ఇసుక సరఫరాపై ఎప్పటికప్పుడు వినియోగదారుల స్పందన తెలుసుకుంటామని తెలిపారు.



హోంమంత్రి అనితను కలిసిన కాదంబరి జెత్వానీ కుటుంబ సభ్యులు

జెత్వానీ ఐఫోన్లు హ్యాక్!

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులను అరెస్టు చేసిన తర్వాత ఆమెకు సంబంధించిన ఐదు ఐ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన పాస్‌వర్డ్‌లు చెప్పాలని ఆమెపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. అయినా కాదంబరి పాస్‌వర్డ్‌లు చెప్పలేదు. ముంబైలో న్యాయమూర్తి ఇంట్లో ఆమెను హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరుపరిచిన తర్వాత కాదంబరి కుటుంబ సభ్యులను జైలుకు పంపారు. ఒక కేసులో నిందితులను అరెస్టు చేశాక వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదును కోర్టుకు అప్పగించాలి. ఈ కేసులో పోలీసులు, అధికారులు ఆ పని చేయలేదు. ముంబైలో పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసు వ్యవహారం, కుక్కల విద్యాసాగర్‌కు సంబంధించిన ఆధారాలు ఫొటోలు, వీడియోలు ఈ ఫోన్లలో ఉన్నాయి. ఆ ఆధారాలు లేకుండా చేయగలిగితే ముంబై కేసులో జిందాల్‌కు విముక్తి కలుగుతుందని, విద్యాసాగర్ ఇబ్రహీంపట్నంలో పెట్టిన కేసులో ఆమె ఇరుక్కుపోతుందని భావించారు. కాదంబరి పాస్‌వర్డ్‌లు చెప్పకపోవడంతో ఆమె ఐదు ఐ ఫోన్లను కోర్టులో సమర్పించలేదు. పోలీసులు తమ వద్దే పెట్టుకుని హ్యాక్ చేశారు. ఫిబ్రవరి 7న ఒకసారి, 21న ఒకసారి ఇది జరిగింది. వెబ్‌బ్రౌజర్ ద్వారా ఐక్లౌడ్‌ను ఉపయోగించినట్టు ఆమె మెయిల్‌కు యాపిల్ కంపెనీ నుంచి మెసేజ్‌లు వెళ్లాయి. ఆమె జైలు నుంచి విడుదలైన తర్వాత ఈ-మెయిల్‌ను పరిశీలించగా ఈ విషయం తెలిసింది. దీంతో ఈ ఫోన్ల పాస్‌వర్డ్‌ను ఆమె రీసెట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన మెసేజ్ ఆమె మెయిల్‌కు వెళ్లింది. పోలీసులు తమ వద్ద పెట్టుకున్న ఆమె ఫోన్లను హ్యాక్ చేయడానికి ప్రత్యేకంగా దుబాయ్ నుంచి హ్యాకర్‌ను రప్పించినట్టు అనుమానిస్తున్నారు. దీనిపై అంతర్గతంగా విచారణ సాగుతోంది. ఐక్లౌడ్‌ను పోలీసులు ఏవిధంగా తెరిచారన్నది లాగ్ వివరాలను పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ లాగ్ వివరాలు యాపిల్ సంస్థ వద్ద మాత్రమే ఉంటాయి. ఫోన్ల యజమానులు మెయిల్‌లో అప్లికేషన్ పంపితేనే ఆ వివరాలను యాపిల్ సంస్థ ఇస్తుంది. దీంతో కాదంబరి ఈ లాగ్ వివరాలను ఇవ్వాలని యాపిల్ సంస్థకు లేఖ రాయబోతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఆపరేషన్ అక్కడ.. టీఏ బిల్లు ఇక్కడ

జెత్వానీని అరెస్టు చేయడానికి విజయవాడ నుంచి అప్పటి డీసీపీ విశాల్ గున్నీ ఆధ్వర్యంలో ఒక బృందం ముంబై వెళ్లింది. ఫిబ్రవరి 1న విమాన టికెట్లు బుక్ చేసుకుని 2, 3 తేదీల్లో ఈ బృందం ముంబైలో గడిపింది. కాదంబరి అరెస్టు ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన విశాల్‌గున్నీ పెట్టిన టీఏ బిల్లు చూసి పోలీసు వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ఫిబ్రవరి 2న విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్, నున్న, కేదారేశ్వరపేటలో పర్యటించినట్టు విశాల్ గున్నీ టీఏ బిల్లు పెట్టారు. 3న కూడా నగరంలోని మరికొన్ని ప్రాంతాల పేర్లు రాసి టీఏ బిల్లు పెట్టారు. ఆ సమయంలో ఆయన ముంబైలో ఉన్నారు. విచారణాధికారులు ఈ బిల్లుల వివరాలు సేకరించినట్టు తెలిసింది.

నివేదికలో మాజీ డీజీపీ పేరు

ప్రభుత్వానికి చేరిన విచారణ నివేదికలో మాజీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి పేరు ఉన్నట్టు సమాచారం. 'పీఎస్ఆర్ ఆంజనేయులు అప్పటి సీపీ కాంతిరాణాను, నన్ను సీఎం ఆఫీసుకు పిలిపించారు. అక్కడ జెత్వానీ అరెస్టుకు సంబంధించి టాస్క్ మొత్తం వివరించారు. తర్వాత కాంతిరాణా అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫోన్ చేశారు. కాదంబరి కేసు అరెస్టు విషయంలో నన్ను ముంబైకు పంపుతున్నట్టు వివరించారు. దీనికి రాజేంద్రనాథ్ రెడ్డి గోహెడ్ అన్నారు' అని గున్నీ వాంగ్మూలంలో పేర్కొన్నట్టు తెలిసింది.

న్యాయం చేయండి

- హోం మంత్రి అనితకు నటి జెత్వానీ వినతి

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేయాలని ముంబై నటి కాదంబరి జెత్వానీ హోం మంత్రి అనితను కోరారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని విన్నవించారు. గురువారం అమరావతి సచివాలయంలో హోం మంత్రితో ఆమె భేటీ అయ్యారు. గతంలో తనను అక్రమ కేసులో అరెస్టు చేసి మానసిక వేధింపులకు గురి చేసినందుకు తనకు ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన తల్లిదండ్రులు, న్యాయవాదితో హోం మంత్రిని కలిసి తనకు న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారు. కాగా, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ... జెత్వానీ ఐ ఫోన్లను రెండు సార్లు అనధికారికంగా ఓపెన్ చేయాలని చూశారన్నారు. జెత్వానీ మీద కేసును విత్‌డ్రా చేసుకుంటే ఆమె మీద పడిన మచ్చ పోతుందన్నారు.

కేసులో ఎవరున్నా శిక్షపడేలా చేస్తాం: అనిత

జెత్వానీ కేసులో ఎంతటి వారున్నా శిక్షపడేలా చేస్తామని హోంమంత్రి అనిత అన్నారు. సచివాలయంలో కుటుంబ సభ్యులతో సహా తనను కలిసిన జెత్వానీకి మంత్రి ధైర్యం చెప్పారు. ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. అందుకు ప్రభుత్వం, హోంమంత్రికి జెత్వానీ కృతజ్ఞతలు తెలిపారు. కేసు ముగిసే వరకూ విజయవాడలో ఉన్నప్పుడు తనకు భద్రత కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

వైసీపీకి బాలినేని, ఉదయభాను గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)



నమ్మిన నాయకులను మోసం చేశారని విమర్శించారు. ఆయన విధానం వచ్చి మోసమన్నారు. ఆయన వైసీపీ పెట్టగానే మంత్రి పదవులు, ఎమ్మెల్యే పదవులు వదులుకుని ఆ పార్టీలో చేరిన 17మందిలో ఒక్కరికి కూడా కేబినెట్ విస్తరణ అనంతరం మంత్రివర్గంలో స్థానం ఇవ్వలేదని.. విశ్వసనీయతకు ఆయన మారుపేరయితే.. తన కోసం అన్నీ వదులుకుని వచ్చిన 17 మందినీ ఎందుకు పక్కన పెట్టారని నిలదీశారు. పార్టీలో తనకు చాలా అవమానాలు ఎదురయ్యాయని, అవసరమైనప్పుడు వెల్లడిస్తానని తెలిపారు. పవన్ కల్యాణ్ తనను బాగా రిసీవ్ చేసుకున్నారని తెలిపారు. తాను అధికారం కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. తాను ప్రజల పరిస్థితిని వివరించడానికి వెళ్తే.. కొంత మంది జగన్‌ను బ్లాక్‌మెయిల్ చేయడానికి వెళ్లానంటూ విమర్శలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు బయటకు వచ్చాను కాబట్టి వైసీపీపై విమర్శలు చేస్తూ మాట్లాడనని.. తనపై ఎవరైనా విమర్శలు చేస్తే తప్పకుండా బుద్ధి చెబుతానన్నారు. పవన్‌ను కలవక ముందే తాను వైసీపీకి రాజీనామా చేశానని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న ప్రేమతో వైసీపీలో చేరానని.. ఆ పార్టీలో ఉన్న సమయంలో అనేక సార్లు కన్నీరు పెట్టుకున్న రోజులు ఉన్నాయని ఆవేదనతో చెప్పారు. నాడూ, నేడూ జగన్ చుట్టూ అదే కోటరీ నడుస్తోందని విమర్శించారు. తాను కోరిన వెంటనే పార్టీలోకి ఆహ్వానించిన పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు.

జగన్ పట్టించుకోలేదు: ఉదయభాను

వైసీపీ పరిస్థితి దారుణంగా ఉందని ఉదయభాను చెప్పారు. ఎన్నికలకు ముందు అనేక సార్లు జగన్‌ను కలసి చెప్పినా పట్టించుకోలేదని.. మనసుకు కష్టం కలిగినందునే వైసీపీని వీడానన్నారు. వైసీపీలోని పరిణామాలు చూస్తుంటే ఆ పార్టీకి భవిష్యత్ లేదని స్పష్టమవుతోందని.. తమ భవిష్యత్ తాము చూసుకోవలసి ఉన్నందునే బయటకు వచ్చేశానని అన్నారు. తనతో ప్రయాణం చేసేవాళ్లను కూడా జనసేనలోకి ఆహ్వానిస్తున్నానని చెప్పారు. పవన్‌తో అన్ని విషయాలూ మాట్లాడానని... కూటమికి తగ్గట్టుగా వివాదాలకు తావులేకుండా నడుచుకుంటానని చెప్పారు. మాజీ మంత్రి బాలినేని కూడా పార్టీలో చేరుతున్నట్లు తెలిసిందన్నారు.

నెల్లూరు వైసీపీ ఖాళీ

- మంత్రి లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుడు, నుడా మాజీ చైర్మన్

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణంలో వైసీపీ ఖాళీఅయ్యింది. పురపాలక మంత్రి పి.నారాయణ నేతృత్వంలో 15మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుడితో పాటు నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, సుమారు 50మంది వైసీపీ నేతలు మంత్రి లోకేశ్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలో వీరందరికీ మంత్రి పసుపు కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కార్పొరేటర్లు అశ్వినీ, ప్రత్యూష, రవిచంద్ర, మస్తానమ్మ, రాజశేఖర్, ప్రేమ్‌కుమార్, అరుణ, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ, ఇంతియాజ్, రాజేశ్వరి, సాహిత్య, సఫియాబేగం, కోఆప్షన్ సభ్యుడు జమీర్ ఉన్నారు.

గోవాలో జానీ మాస్టర్ అరెస్టు

- నేడు కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

నార్సింగ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీబాషా అలియాస్ జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకొస్తున్నామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. జానీ మాస్టర్‌పై ఈ నెల 15న రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ కాగా, అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారని ఆయన వెల్లడించారు. జానీమాస్టర్‌ను శుక్రవారం రాజేంద్రనగర్ కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. కాగా.. జానీ మాస్టర్ భార్య ఆయేషా గురువారం నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. జానీ మాస్టర్ అరెస్ట్ విషయం తనకు తెలియదని.. తనకు వచ్చిన ఒక ఫేక్ కాల్ గురించి తెలుసుకునేందుకే ఠాణాకు వచ్చానని ఆమె మీడియాకు చెప్పారు. అయితే.. అరెస్టు గురించి పోలీసులు ఆమెకు సమాచారమిచ్చి, సంతకాలు తీసుకుని పంపించినట్టు సమాచారం. ఆమె పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్లిన తర్వాతే అరెస్టువార్త బయటకు వచ్చింది.

ఎక్సైజ్‌లో జీరో సర్వీసు బదిలీలు

- రిటైర్‌మెంట్‌కు ఆరు నెలలుంటే మినహాయింపు
- మార్గదర్శకాలు జారీ.. 4 రోజుల్లో పూర్తికి చర్యలు

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో జీరో సర్వీసు ప్రాతిపదికన బదిలీలు చేయాలని ఆ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ మార్గదర్శకాలు జారీచేశారు. జీరో సర్వీసు తప్ప మిగిలిన అంశాల్లో సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల మార్గదర్శకాలే వర్తిస్తాయని తెలిపారు. అవసరాన్ని బట్టి కొన్ని పరిపాలనా కారణాల రీత్యా చేసుకునే బదిలీలకూ అవకాశమిచ్చారు. కానిస్టేబుల్ నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు అందరి నుంచి ఆప్షన్లు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం సాయంత్రానికి ఆప్షన్ల నివేదికలు పంపాలన్నారు. శనివారం నుంచి బదిలీలు చేయనున్నారు. తొలుత డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు.. తర్వాత ఏఈఎస్, ఆ కింది స్థాయి అధికారుల బదిలీలు జరుగుతాయి. త్వరలో నూతన మద్యం పాలసీకి నోటిఫికేషన్ రానుంది. ఈలోపే బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు. కాగా సాధారణ బదిలీల్లోని నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోగా రిటైర్ కాబోయే అధికారులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. దీంతో ఎక్సైజ్‌లో 95 శాతం మంది అధికారులు, ఉద్యోగులు బదిలీలు కానున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఛీ.. ఛీ.. ఇదేం దుస్థితి..?

● ఐజీఎంసీలో టాయిలెట్లు అధ్వాన్నం ● ఏళ్ల తరబడి క్రీడాకారులకు ఘోర అవమానం ● పట్టించుకోని వీఎంసీ, శాప్ అధికారులు

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలను భ్రష్టుపట్టించిన అప్పటి పాలకులు కనీసం శాప్ కార్యాలయం వెనుక స్టేడియం క్రీడాకారులు వినియోగించే టాయిలెట్లు బాగు చేయించపోవడంతో వారు వాటిని అలాగే ఉపయోగించాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్రానికి పతకాలు సాధించిపెట్టే క్రీడాకారులకు ఇలాంటి దుస్థితి పట్టడం ఘోర అవమానం. పైగా తమ ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రిగా రోజా కొలువు తీరినప్పుడు టాయిలెట్లు అధ్వాన్నంగా ఉన్నాయని విలేకరులు ప్రస్తావించినా లైట్ తీసుకున్నారు. ఇప్పటికీ వీటి దుస్థితిని పట్టించుకునే వారే కరువయ్యారు. స్టేడియం వీఎంసీకి చెందింది కాగా, నిర్వహణ శాప్ ఆధ్వర్యంలో క్రీడా వ్యవహారాలు నడుస్తుంటాయి. శానిటేషన్ బాధ్యత వీఎంసీ అధికారులదే అయినా ఏ రోజూ శుభ్రం చేసిన పరిస్థితి లేదు. దీంతో రెంటికి చెడ్డ రేవడిలా తయారై తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నాయి. బాలురు ఉపయోగించే టాయిలెట్లలో మురుగు నిండిపోవడంతో తాడు కట్టి వినియోగించకుండా అడ్డుకోగలిగారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లకపోవడంతో ఆ దుర్వాసనలోనే క్రీడాకారులు వెళ్లాల్సి వస్తోంది. బాలికల టాయిలెట్లలోనూ ఇదే దుస్థితి. పైగా వీటినే స్టేడియానికి వచ్చే వాకర్స్, అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్నారు. స్టేడియం ఎంట్రన్స్‌లోనే పే అండ్ యూజ్ టాయిలెట్లు ఉండటంతో వీఎంసీ శానిటరీ అధికారులు పట్టించుకోవడం లేదు. విశేషమేమిటంటే ఇదే ప్రాంగణంలో డివిజన్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ విధులు నిర్వహిస్తుండటం విశేషం. మంత్రులు, అధికారులు స్టేడియంలో జరిగే వివిధ వేడుకల్లో పాల్గొన్నప్పటికీ వీటి దుస్థితిని మార్చే వారు కరువయ్యారు. గ్యాలరీ కింద మూడు చోట్ల టాయిలెట్లు పూర్తిగా మూతపడి ఉన్నాయి. కొద్ది నెలలు క్రితం వీసీ ఎండీగానే పనిచేసిన, ప్రస్తుత వీఎంసీ కమిషనర్ అయినా నూతన టాయిలెట్ల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అస్తవ్యస్తంగా తయారై దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్స్

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు లీగల్ నోటీసులు

● వారంలో లోన్ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలంటూ హెచ్చరిక

ఉయ్యూరు, సెప్టెంబరు 19: పట్టణంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకులు లీగల్ నోటీసులు జారీచేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వెయ్యి మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు వివిధ జాతీయ బ్యాంకుల నుంచి ఒక్కొక్కరికి రూ.3.50లక్షలకు పైగా ప్రభుత్వం రుణం ఇప్పించి ప్రభుత్వానికి జమచేయించింది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తిచేయలేదు. ఈ నేపథ్యంలో తీసుకున్న రుణం ఇప్పటి వరకు తీర్చలేదని, వారంలోపు తీర్చకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ కెనరా బ్యాంకు లాయర్‌తో లబ్ధిదారులకు లీగల్ నోటీసులు పంపారు. దీంతో నోటీసులు అందుకున్న లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇల్లు ఇవ్వలేదు, అప్పు ఎలా తీర్చాలని లబోదిబో మంటున్నారు. నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా రుణానికి రెండేళ్ల కాలపరిమితి దాటిందని, కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశమై మరింత కాలపరిమితి కోరతారని, లబ్ధిదారులెవ్వరు అధైర్యపడనవసరం లేదన్నారు. ఈ సందర్భంగా బోయిన స్పందన అనే లబ్ధిదారు మాట్లాడుతూ ఇల్లు ఇస్తున్నామని చెప్పి బ్యాంకుకు తీసుకు వెళ్లి లోన్ ఇప్పించి ఆ డబ్బు ప్రభుత్వానికి జమచేశారే కానీ ఇప్పటివరకు ఇల్లు పూర్తిచేసి ఇవ్వలేదు. లోన్ కట్టమని బ్యాంకు వాళ్లు నోటీసులు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పి.స్వర్ణలత అనే లబ్ధిదారు మాట్లాడుతూ మా ఖాతాలో ఎప్పుడైనా డబ్బు వేస్తే లోన్ కట్టడం లేదని బ్యాంకు వాళ్లు లోన్‌కు జమవేసుకుంటున్నారని, ఖాతాలో ఏదైనా డబ్బు వస్తే తీసుకుంటున్నారని, అద్దె ఇళ్లలో ఉంటూ లోన్ ఎలా కట్టేదని వాపోయింది.


బోయిన స్పందన


పి.స్వర్ణలత

వాన నీరు వెళ్లే దారేది..?

సత్యనారాయణపురం: బీఆర్టీఎస్ రోడ్డు వెంట రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సైడ్‌డ్రైన్లు పూడ్చి రోడ్డు వేస్తున్నారు. ఇప్పటికే నీరు సైడ్‌డ్రైనుల నుంచి నర్రావారి వీధి మీదుగా శివాలయం వీధికి వెళుతున్నాయి. సీతన్నపేట మీసాలరాజారావు బ్రిడ్జి నుంచి బీఆర్టీఎస్ రోడ్డు వరకూ రూ.లక్షలు వెచ్చించి సైడ్ డ్రైన్స్ నిర్మించారు. శారదా కాలేజీ జంక్షన్ వచ్చేసరికి సైడ్‌డ్రైన్లలో వచ్చేవర్షపు నీరు ఎన్నార్పీరోడ్డులోకి వెళ్లే కాల్వలో కలిపారు. అక్కడ నుంచి నర్రా వారి వీధి నుంచి భగత్‌సింగ్‌రోడ్డు వెంట ఉన్న సైడ్‌డ్రైన్‌లో నీటిని మళ్లించి అక్కడ నుంచి ఏలూరు కాల్వలోకి వెళ్లేలా అధికారులు ప్రణాళిక రచించారు. నర్రావారి వీధి వరకూ వచ్చేసరికి స్థానికులు తమ ఇంటి ముందు కాల్వలు తవ్వవద్దని, అడ్డుపడ్డారు. స్థానిక వైసీపీ నేతలు వంత పాడడంతో సైడ్‌డ్రైన్ నిర్మాణం ఆగిపోయింది. వర్షం వచ్చినప్పుడు నీరు కాల్వలో నుంచి బయటకు వచ్చి నర్రావారి వీధిలోకి వెళుతుంది. ఇప్పుడు నర్రావారి వీధి వద్ద రోడ్డు వేస్తూ సైడు కాల్వను పూర్తిగా కంకర వేసి పూడ్చి రోడ్డు వేస్తున్నారు. వర్షపు నీరు వెళ్లే మార్గానికి పరిష్కారం చూపకుండా సైడ్‌డ్రైన్స్‌ను పూడ్చడంపైన స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షపు వచ్చినా నార్రా వారి వీధిలోకి వెళుతుంది. వేసిన రోడ్డు సైతం పాడవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడ్‌డ్రైన్స్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


సైడ్‌డ్రైన్‌ను పూడ్చి రోడ్డు వేస్తున్న సిబ్బంది

'రాజ్‌దర్బార్'లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల సోదాలు

● ఆహార పదార్థాల్లో రంగులు కలుపుతున్నారని ఫిర్యాదులు
● వీఎంసీ ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారం

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయన వైసీపీ నేత. ఓ యువ నేతకు ముఖ్యఅనుచరుడు. వైసీపీ అధికారంలో ఉండగా అడ్డగోలుగా వ్యవహరించిన ఈనేత ఇప్పుడూ అదే పద్ధతిలో ఉన్నాడు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఏకంగా నగరం నడిబొడ్డున రెస్టారెంట్‌ను నడిపేస్తున్నారు. ఎంజీ రోడ్డులో రిలయన్స్ మార్ట్‌కు పక్కన రాజ్ దర్బార్ పేరుతో వైసీపీ నేత వేగి వెంకటేశ్వరావు హోటల్ నిర్వహిస్తున్నారు. దీనిపై వరుస ఫిర్యాదులు రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. బిర్యానీతోపాటు ఇతర ఆహార పదార్థాల్లో కలర్ కలుపుతున్నట్టు గుర్తించారు. పైగా కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉందని నిర్ధారించారు. బిర్యానీలో చైనా సాల్ట్ (మోనో సోడియం గ్లూటమైట్)ను ఉపయోగిస్తున్నారు. దీనిపై నిషేధం ఉన్నప్పటికీ ఫ్లేవర్ కోసం బిర్యానీలో ఉపయోగిస్తున్నారు. దీనికి సంబంధించిన నమూనాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులు సేకరించి హోటల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హోటల్‌కు ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ ఉన్నా, వీఎంసీ ట్రేడ్‌లైసెన్స్ లేదని అధికారులు గుర్తించారు.

దుర్గమ్మ సన్నిధిలో గోరంట్ల దంపతులు

వన్‌టౌన్, సెప్టెంబరు 19: టీడీపీ సీనియర్ నేత, శాసన సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దంపతులు గురువారం ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.


బుచ్చయ్య చౌదరి దంపతులకు పుష్పగుచ్ఛం అందచేసిన బుద్దా వెంకన్న

బుద్దా వెంకన్న ఇంటికి రాక..

కనకదుర్గమ్మ దర్శనానంతరం బుచ్చయ్య చౌదరి దంపతులు వన్‌టౌన్‌లోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నివాసానికి విచ్చేశారు. వారికి వెంకన్న పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. పరిశపోగు రాజేష్, పొనుగుపాటి చిన సుబ్బయ్య, సాంబ పాల్గొన్నారు.


ప్రజాఫిర్యాదులు స్వీకరిస్తున్న బీజేపీ నేతలు

పేదల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

వన్‌టౌన్, సెప్టెంబరు 19: పేద, బడుగు, బలహీనవర్గాల సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వారధి ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాలతో వారధి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి స్పందన బాగుందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరు నాగభూషణం, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, వారధి సమన్వయకర్త కిలారు దిలీప్ పాల్గొన్నారు.

రాష్ట్ర టీటీ చాంప్‌కు జిల్లా క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: నగరంలో ఈ నెల 20, 21న జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల ఎంపికలను చేపట్టామని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ కే బలరామ్ తెలిపారు. అండర్-19 బాలికల విభాగంలో కే వసుధ, పీ అక్షిత, బాలుర విభాంలో పీ కిరణ్ తేజ, ఏ షణ్ముక్, కే నిఖిల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏపీటీటీఏ సెక్రటరీ పీ విశ్వనాథ్, కోచ్‌లు అభినందించారు.


దుర్గగుడి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

దుర్గగుడి రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం

వన్‌టౌన్, సెప్టెంబరు 19: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారిపై విరిగిపడిన దుర్గగుడి రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులు అధికారులు వేగవంతం చేశారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారు. భారీ వర్షాలకు విరిగిపడిన రిటైనింగ్‌వాల్ పనులు త్వరగా పూర్తిచేయాలని వేగవంతంగా పనులు చేపట్టారు. ఇందులోభాగంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపేశారు.

కళావేదికపై అలరించిన కూచిపూడి నృత్యం

దుర్గగుడిలో కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీదుర్గాభవాని కూచిపూడి నృత్య కళానిలయం పావని, ప్రియాంక ఆధ్వర్యంలోని కళాకారుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. తిల్లాన, జావళి, అష్టపదితో పాటు 12 కీర్తనలకు చక్కటి అభినయంతో హర్షధ్వానాలు అందుకున్నారు.

ఆటో కార్మికులకు రూ.25 వేలు ఇవ్వాలి

● ఆటోకార్మికులు, సంఘాల నేతలు

ధర్నాచౌక్, సెప్టెంబరు 19: ఇటీవల నగరంలో వరదల కారణంగా ఆటోలు నీటిలో మునిగి, ఉపాధి కోల్పోయిన ఆటోకార్మికులకు ప్రతి ఆటోకు రూ.20వేల సాయం అందించాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆటోకార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతూ గురువారం ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల ఆటోకార్మిక సంఘం నగరాధ్యక్షుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునీకరణ ఆటోల రిపేర్లకు సర్వీస్ కంపెనీలు రూ.40వేల నుంచి రూ.లక్షా 10 వేల వరకు అంచనా వేస్తున్నాయన్నారు. పాత మోడల్, పాత ఆటోలకు ఎక్కువ మంది థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌లు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇన్సూరెన్స్ వర్తించడం లేదన్నారు. సీఐటీయూ ఆటోవర్కర్స్ యూనియన్ నేత దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నేతలు కే.పొలారి, మునిశంకర్, ఏ.రవిచంద్ర, సీహెచ్.పెద్దిరెడ్డి, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు రూబేను,ఈశ్వర్, ఆటోకార్మికులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి..!

● కేసు నమోదు

వన్‌టౌన్: ఒక ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మరణించినట్లు గురువారం సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం కూలీ వీధిలో ఉంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిమ్మన శ్రావణ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి భార్య ఉషారాణిని డెలివరి నిమిత్తం ఈనెల 16న నగరంలోని సూర్యారావుపేట డోర్నకల్ తల్లీపిల్లల ఆసుపత్రిలో జాయిన్ చేశారు. ఆ సమయంలో ఉషారాణి, ఆమె కడుపులోని బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఆమెకు డెలివరీ టైమ్ 14న కాగా, ఆ సమయంలో డెలివరీ కాకపోవటంతో వైద్యులు ఇంజెక్షన్ ఇచ్చారు. అయినా డెలివరి కాలేదు. 17న కూడా మందులు వాడినప్పటికీ డెలివరి కాలేదు. 18న వైద్యులు పరీక్షించగా శిశువు మరణించనట్లు తెలిసింది. సకాలంలో తల్లికి తగిన వైద్యం అందించకపోవటం వల్లే శిశువు మరణించిందని ఉషారాణి భర్త శ్రావణ్ కుమార్ వైద్యులు అరుణ, లక్ష్మిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

2 నుంచి వలంటీర్ల ఆందోళనలు

ధర్నాచౌక్: గత వందరోజులుగా వలంటీర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఏపీ స్టేట్ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. స్థానిక దాసరిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షల 60వేల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలోగా న్యాయం చేయకుంటే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 2 నుంచి 26 వరకు శాంతియుతంగా వినూత్నరీతిలో ఆందోళనలు చేపడతామన్నారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లంక గోవిందరాజులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.జగదీష్, ఎంవీ.రమణనాయక్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్, సరోజిని పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత మురళి మృతి



విజయవాడ: సీపీఐ నేత కామిశెట్టి మురళి (70) గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన తన యుక్త వయసు నుంచి సీపీఐ కీలక నేతలకు సహాయకుడిగా ఉండేవారు. పెళ్లిచేసుకోకుండా ఒంటరిగా ఉంటున్న మురళి వాంబే కాలనీలో నివాసం ఉంటున్నారు. వయసురీత్యా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ వామపక్ష పార్టీల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఇటీవల వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఆయన పటమటలో ప్రజానాట్యమండలి సీనియర్ నేత పొట్లూరి రాఘవేంద్రరావు ఇంటి వద్ద ఉంటున్నారు. రెండు రోజులుగా అనారోగ్యానికి గురైన ఆయన గురువారం ఉదయం మృతి చెందారు. మురళి భౌతికకాయంపై కమ్యునిస్టు సీనియర్ నేత మోతుకూరి వెంకటేశ్వరరావు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు సంతాపం తెలిపారు.

పాస్టర్లు, బిషప్‌లకు అండగా ప్రభుత్వం



వన్‌టౌన్: బిషప్‌లకు, పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. సింగ్‌నగర్ షాదిఖానా సమావేశపు హాల్‌లో గురువారం నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ ఆర్చి బిషప్ కాత్రగడ్డ మార్టిన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రిస్టియన్ మైనార్టీలకు సంక్షేమ పథకాలను తప్పక అందచేస్తామన్నారు. నంద్యాల జేఏసీ, ఏఐసీసీ, సీజేఏసీలతో పాటు అన్ని విభాగాల పాస్టర్లు, బిషప్‌లు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మందికి జైలు

విజయవాడ: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 33 మందికి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. 2, 4వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఈనెల 5, 6న డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 33 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం ప్రవేశపెట్టారు. ఒకరికి 15 రోజులు, ఒకరికి వారం రోజులు జైలు, జరిమానా విధించారు. ఏడుగురికి రూ.15వేలు, 24 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

డిసెంబరుకు పూర్తిస్థాయిలో రాజధాని పనులు

● మంత్రి నారాయణ

అమరావతి, సెప్టెంబరు 19: ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని మంత్రి పీ.నారాయణ తెలిపారు. తుళ్లూరు మండలం రాయపూడి, మంగళగిరి మండలం నిడమర్రు, కురగల్లు గ్రామాల్లో గురువారం రాత్రి ఆయన పర్యటించారు. రైతుల నుంచి 19 ఎకరాలకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ పత్రాలను స్వీకరించి సీఆర్‌డీఏ అధికారులకు అందజేశారు. రైతులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ 2015 జనవరిలో అమరావతి రాజధాని కోసం పిలుపునిస్తే కేవలం 58 రోజుల్లోనే రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలను భూసమీకరణకు ఇచ్చారని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అర్ధంతరంగా నిలిచిన నిర్మాణ పనులు, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదలు పెట్టామన్నారు. గతంలో రాజధానికి భూమిలివ్వని రైతులు సైతం నేడు స్వచ్ఛందంగా భూమిలిచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అప్పట్లో భూమిలిచ్చిన రైతులకు లాటరీ పద్ధతిలో ప్లాట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొంతమేర మాత్రమే భూముల అవసరం ఉందని, ఇప్పుడు భూమిలిచ్చే రైతులకు వరుస క్రమంలో వారు కోరుకున్న చోట ప్లాట్లు కేటాయిస్తామని ప్రకటించారు. రైతులు భూములిచ్చేందుకు ముందుకు వస్తే తానే స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి వారికున్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసి అంగీకార పత్రాలను తీసుకుంటానన్నారు. చెన్నయ్, హైదరాబాద్ నుంచి ఐఐటీ నిపుణుల బృందం రాజధానిలో నిలిచిన నిర్మాణాలను పరిశీలించి భవనాలు చాలా ధృడంగా ఉన్నాయని నివేదిక ఇచ్చారన్నారు. దీంతో గతంలో ఉన్న కాంట్రాక్టులను క్లోజ్ చేసి కొత్తగా టెండర్లు పిలువబోతున్నామని, ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి 31 మధ్య కాలంలో పూర్తిస్థాయిలో పనులను ప్రారంభిస్తామన్నారు. 360 కిలోమీటర్ల మేర ట్రంకు రోడ్లు, 3 వేల లే అవుట్లు, ప్రభుత్వ, ప్రజాప్రతినిధులకు 360 భవనాల నిర్మాణం, 5 ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. అమరావతి పరిధిలోని 29 గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామని, ప్రతి గ్రామానికీ ఏదో ఒక మంచి ప్రాజెక్టు వస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.


రాయపూడిలో రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ పత్రాలను స్వీకరిస్తున్న మంత్రి నారాయణ

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్..!

● పట్టపగలే ఎవరూ లేని సమయంలో చోరీలు
● నిందితుడి అరెస్టు, సుమారు రూ.4లక్షల విలువైన 180 గ్రాముల బంగారం స్వాధీనం

చిట్టినగర్, సెప్టెంబరు 19: తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్. పట్టపగలు ఇళ్లలో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి విలువైన వస్తువులు, బంగారం, వెండి, నగదు చోరీ చేసే దొంగను కొత్తపేట పోలీసులు కోమల విలాస్ సెంటర్‌లో నిఘా వేసి పట్టుకున్నారు. అతడి నుంచి సుమారు రూ.4లక్షలు విలువైన 180 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఏడీసీపీ జీ రామకృష్ణ వివరాలను తెలియజేశారు. షేక్ షబ్బీర్‌ఖాన్ (39) మహంతీపురంలో నివాసం ఉంటాడు. ఇతడిపై కొత్తపేట స్టేషన్‌లో కేడీ షీట్ ఉంది. నగర పరిధిలో 20కిపైగా దొంగతనం కేసులున్నాయని, రెండేళ్లుగా కొత్తపేట, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు చోట్ల వెండి, బంగారం వస్తువులు, నగదు దొంగిలించాడన్నారు. కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఏడీసీపీ జీ రామకృష్ణ, వెస్ట్ అసిస్టెంట్ కమిషనర్ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో కొత్తపేట సీఐ కొండలరావు, డీఎస్ఐ జీ రాజనరేంద్ర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడ్ని పట్టుకున్నారు.

ముగిసిన ఐడీఈ బూట్ క్యాంపు

ఉంగుటూరు, సెప్టెంబరు 19: ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్ నిర్వహణఆఆ ఆకు దేశవ్యాప్తంగా ఎంపికచేసిన 10 నోడల్ సంస్థల్లో ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఒకటి కావటం గర్వకారణమని కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. వాణిజ్యరంగంలో ప్రతిభా సంపత్తి కలిగిన వ్యవస్థాపకులుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రేరేపించి నూతన ఆవిష్కరణలు రూపొందించే దిశగా ఏపీ మోడల్‌స్కూల్స్ విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా స్థానిక కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించిన ఐడీఈ బూట్ క్యాంప్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో రాష్ట్రంలోని పీఎంశ్రీ పాఠశాలల నుంచి 200మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు, రిసోర్స్‌పర్సన్లను కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ నోడల్ ఆఫీసర్ గౌరీ గోపీనాథ్, ఏఐసీటీఈ మేనేజర్ ఐ.ఎన్.భీమ, వాధ్వానీ ఫౌండేషన్ రిసోర్స్‌పర్సన్ ద్రిష్ట, సీమాట్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్‌రాజు, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వియత్నాం నుంచి టూరిజం పెంచేలా చర్యలు

● అక్కడ రాయబారి గుయెన్ థాన్‌హైతో ఏపీటీఎఫ్ చర్చలు



భవానీపురం, సెప్టెంబరు 19: భారతదేశంలోని వియత్నాం రాయబారి గుయెన్ థాన్ హై, ఏపీ టూరిజం ఫోరమ్ ప్రెసిడెంట్ కన్నెగంటి విజయ్ మోహన్ నేతృత్వంలో అడ్వెంచర్ టూరిజం ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకానితో టూరిజంపై చర్చించారు. అడ్వెంచర్ టూరిజంపై స్థానిక నోవాటెల్‌లో సమావేశం గురువారం జరిగింది. కన్నెగంటి విజయ్‌మోహన్ మాట్లాడుతూ దేశం నుంచి 3.92 లక్షల మంది టూరిస్టులు వియత్నాంకు వెళ్లారని, ఇప్పుడు వియత్నాం నుంచి భారత్‌దేశానికి కూడా అదేస్థాయిలో టూరిజంను పెంచేలా ప్రయత్నాలు చేపట్టాలని కోరారు. టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ నగరాధ్యక్షుడు శ్రీనివాస్ చిట్టూరి, ప్రశాంతి తాతారావు పాల్గొన్నారు. వియత్ జెట్ ఎయిర్‌లైన్స్ ద్వారా డైరెక్టర్ ఫ్లైట్స్ ఏర్పాటు దిశగా ప్రయత్నిస్తామని వియత్నాం ప్రతినిధులు తెలిపారు. ఏపీలోని బుద్ధిస్ట్ సర్క్యూట్‌ని తమ పౌరులకు తెలియజేస్తామన్నారు. అమరావతి, వైజాగ్‌లో ఫామ్ ట్రిప్స్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. గుయెన్‌కు, విజయ్‌మోహన్, కాకానీ తరుణ్‌లు పూలమొక్కతో సత్కరించారు.



బొమ్మ కావ్య చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

డాక్టర్ బోయి భీమన్న
సాహితీ సేవలు అమోఘం


● పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

వన్‌టౌన్, సెప్టెంబరు 19: మహాకవి, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న తెలుగుజాతి గొప్పదనాన్ని, తెలుగు సాహితి సౌరభాలను ప్రజలకు అందించారని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన మహాకవి, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న 113 జయంత్యుత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన ప్రముఖ చిత్రకారుడు, భాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకుడు మల్లిఖార్జునరావు అందించిన బొమ్మ కావ్య చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం భీమన్న సతీమణి సుప్రసిద్ధ కవయిత్రి హైమవతిని శాలువాతో సత్కరించి ఆమె పాదాలకు నమస్కరించారు. అలాగే బోయి భీమన్న పురస్కార గ్రహీత మొవ్వ ఉషాద్రిపతిని శాలువాతో సత్కరించి రూ.2లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జాతీయవాదంతో పాటు దళిత వాదాన్ని సమ్మిళితం చేసిన మహోన్నత వ్యక్తి భీమన్న అని కొనియాడారు. దళిత వర్గాలకు సముచి త స్థానం కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఈ కార్యక్రమా న్ని నిర్వహించిందన్నారు. పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన, కవిత వంటి పలు సాహితీ ప్రక్రియలో 70కి పైగా రచనలు చేశారని, ఆయన భావం సు స్నితం, భాష సుందరమని కొనియాడారు. భీమన్న సతీమణి హైమవతి, మేనకోడ లు మధుగీత, మువ్వా ఉషాద్రిపతి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు శ్రీనివాస్, సహాయ సంచాలకుడు పెంచలయ్య, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటికోసం అష్టకష్టాలు

● ఏలూరు కాలువ కింద నీరందక ఎండుతున్న వరి ● గండిని పూడ్చకపోవడంతో అసలు సమస్య ● ఆయిల్ ఇంజన్లతో ఆరుతడులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19: ఏలూరు కాలువ కింద సాగవుతున్న వరి మాగాణికి ఆరుతడులందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు కాలువకు బుడమేరు వరదలు కారణంగా 20 రోజులు కిందట నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో పాటు కేసరపల్లి వద్ద కాలువకు పడిన గండిని పూడ్చకపోవడంతో సాగు నీరందని పరిస్థితి. కాలువ కింద కృష్ణా, ఏలూరు జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో వరి సాగవుతోంది. బాపులపాడు మండలంలో బుడమేరు వరద ముంపు కారణంగా ఆరుగొలను, ఓగిరాల, రంగయ్య అప్పారావుపేట, లక్ష్మీపురం, కానుమోలు గ్రామాల్లో వందలాది ఎకరాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. దీంతో కాలువకు నీటి సరఫరా నిలిపేశారు. దీంతో కాలువ కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరందక నెర్రలిస్తున్నాయి. మండలంలోని తిప్పనగుంట, చిరివాడ, ఆరుగొలను, వీరవల్లి తదితర గ్రామాల్లో వరి చేలకు ఆరుతడులందక ఎండిపోతున్న పరిస్థితి. ఆయిలింజన్ల సాయంతో కాలువలో పారుతున్న అడుగు మడుగు నీటితో ఆరుతడులు అందించడానికి రైతులు వ్యయ ప్రయాస పడుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఏలూరు కాలువకు పడిన గండిని పూడ్చి నీటి సరఫరా చేయకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తిప్పనగుంట వద్ద పంట కాలువకు నీటిని తోడుతున్న ఆయిల్ ఇంజన్

వాతావరణంపై భారత్‌కు సొంత మోడలింగ్ వ్యవస్థ ఉండాలి

- 'మిషన్ మౌసం' నిరంతరం కొనసాగాలి
- వాతావరణ బులెటిన్ల ఆధారంగానే అమెరికాలో ఆర్థిక కార్యకలాపాలు
- ఉత్తర హిందూ మహాసముద్రంలో పెరిగిన తుఫాన్ల తీవ్రత, దిశలో మార్పులు
- హుద్‌హుద్‌పై భారత్ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశాం
- 36 తుఫాన్లకు మోడళ్లు రూపొందించి దేశానికి అందించాం
- భారత్ ఫండింగ్‌తో రుతుపవనాలపై పరిశోధనలు
- అమెరికా వాతావరణ శాఖ సీనియర్ సైంటిస్టు తల్లాప్రగడ విజయ్

విశాఖపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారం, విపత్తుల హెచ్చరికలు అందించేందుకు సొంత మోడలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అమెరికా వాతావరణ సంస్థ నోవా (నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) మోడలింగ్ డేటా విభాగాధిపతి డాక్టర్ తల్లాప్రగడ విజయ్ అభిప్రాయపడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవ సెమినార్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రస్తుతం నోవా నుంచి పలు మోడళ్లను భారత్ తీసుకుని అభివృద్ధి చేసి అమలు చేస్తోంది. భారత్‌లో సమర్థులైన శాస్త్రవేత్తలకు కొదవ లేదు. సొంతంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకుని మోడలింగ్ వ్యవస్థ రూపొందించాలి. భారత్‌లో వాతావరణంపై మిషన్ మౌసం ప్రాజెక్టు రూ.2,600 కోట్లతో చేపడుతుండడం మంచి పరిణామం. రెండేళ్లకే ఈ ప్రాజెక్టు పరిమితం కాకుండా నిరంతరం పరిశోధనలు చేసేలా భారీగా నిధులు మంజూరు చేయాలి. అమెరికాలో ఆర్థిక కార్యకలాపాలు వాతావరణ బులెటిన్‌పై ఆధారపడి నిర్వహిస్తారు. వాతావరణంలో అనూహ్య మార్పులు వస్తే ముందురోజు ఉన్న పాల ధర కూడా మారుతోంది. విద్యుత్ వినియోగంలో ధరల వ్యత్యాసం, షేర్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు ఉంటాయి అని పేర్కొన్నారు.

తుఫాన్ల తీవ్రత ఆందోళనకరం

ఉత్తర హిందూ మహాసముద్రం (బంగాళాఖాతం, అరేబియా సముద్రం)లో తుఫాన్ల తీవ్రత పెరుగుతోంది. గతంతో పోల్చితే తుఫాన్ల సంఖ్య తగ్గినా వాటి తీవ్రత చాలా ఆందోళనకరంగా ఉంటోంది. కుంభవృష్టిగా వర్షాలు కురిసి తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. ఒకప్పుడు బంగాళాఖాతంలో అండమాన్‌లో ఏర్పడిన తుఫాన్‌లు పశ్చిమం వైపు పయనించి చెన్నై, నెల్లూరు, ఉత్తరంగా పయనించి కోల్‌కతా వైపు వెళ్లేవి. ఇప్పుడు వాయువ్య దిశలో వెళ్లడంతోపాటు అనూహ్యంగా దిశ మార్చుకోవడంతో ఏదో ఒక ప్రాంతం తీవ్రంగా నష్టపోతుంది. నోవాలో తుఫాన్‌ల గమనంపై 2006లో హరికేన్ వెదర్ అండ్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్ రూపొందించాం. 2012లో భారత్‌కు అందించాం. దాని ప్రకారం 2013లో ఒడిశాను తాకిన ఫైలిన్ తుఫాన్ గమనాన్ని అంచనా వేశారు. ఆ మరుసటి ఏడాది 2014లో హుద్‌హుద్ తుఫాన్ విశాఖ వద్ద తీరం దాటుతుందని భారత ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశాం. 36 తుఫాన్‌లకు మోడలింగ్ చేసి ఆయా దేశాలకు బులెటిన్లు అందించాం. నైరుతి రుతుపవనాలపై మరింత పక్కా సమాచారం కోసం నోవాకు భారత ప్రభుత్వం ఐదు లక్షల డాలర్ల ఫండింగ్ ఇచ్చిందని డాక్టర్ విజయ్ పేర్కొన్నారు.

తల్లాప్రగడ విజయ్ స్వస్థలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వాతావరణ, సముద్ర అధ్యయన విభాగంలో పీజీ చేసి ఇక్కడే పీహెచ్‌డీ చేశారు. తరువాత అమెరికాలో నోవాకు వెళ్లి మరిన్ని పరిశోధనలు నిర్వహించారు. ఏయూ వాతావరణ, సముద్ర అధ్యయన విభాగంలో చదువుకుని నోవాకు సలహాదారుగా ఉన్న కృష్ణమూర్తి సలహా మేరకు విజయ్ అనేక పరిశోధనలు చేశారు.


తల్లాప్రగడ విజయ్

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్
నవంబరు 1న ఆవిష్కరణ

- సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నాం. దానిని నవంబరు 1న ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. ఈ విజన్ డాక్యుమెంట్ రూప కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖాధిపతులు, కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. 'ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నాం. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలి. 43 వేల డాలర్లకు పైగా తలసరి ఆదాయంతో కూడిన 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలి. ఆ లక్ష్యంతో ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు వివిధ స్టేక్ హోల్డర్ల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తెలుసుకునేందుకు ముసాయిదా డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. ఈ నెల 21 నుంచి అక్టోబరు 5 వరకు ఐటీ విభాగం ద్వారా ప్రభుత్వ వెబ్ సైట్లో ప్రజలకు అందుబాటులో ఉంటుంది. అక్టోబరు 5 లోపు లీడ్ డిస్ట్రిక్ మేనేజర్లు, ఇండస్ట్రియల్ చాంబర్ అసోసియేషన్లు, రైతు సంఘాలు, ఆక్వా సంఘాలు తదితరులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలి. జిల్లా స్థాయిలో కలెక్టర్లు.. ఎంపీ, ఎంఎల్ఏ, ఎంఎల్‌సీ తదితర ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలి. ఇదే సమయంలో స్వర్ణాంధ్ర 2047పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలను నిర్వహించాలి. ఈ నెల 30 నాటికి మండల ప్రణాళికలను సిద్ధం చేయాల్సి ఉంది. అక్టోబరు 15 నాటికి జిల్లా విజన్ ప్రణాళికలను సిద్ధం చేయాలి. అక్టోబరు 28న స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌ను ఖరారు చేస్తాం. నవంబరు 1న లాంఛనంగా ఆవిష్కరిస్తాం' అని సీఎస్ తెలిపారు.

అమెరికాలో తూర్పుగోదావరి జిల్లా వాసి మృతి


ముత్తిన రమేష్(ఫైల్)

నల్లజర్ల, సెప్టెంబరు 19: అమెరికాలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందాడు. మృతుడి సోదరుడు నరేష్ చెప్పిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన ముత్తిన రమేష్ (40) 2022లో అమెరికా ఇల్లినాయిస్ రాష్ట్రం కార్‌బోందలే సిటీలోని సదరన్ ఇల్లినాయిస్ యూనివర్శిటీలో ఎంఎస్ చదవడానికి వెళ్లాడు. ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకునేవాడు. ఒక అమెరికా పౌరురాలిని రెండేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా ఆమెతో విభేదాలతో రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూమ్‌లో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్లు తెలిపారు. సోమవారం, మంగళవారం రమేష్ ఆచూకీ లేకపోవడం, అతని రూమ్ నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతిచెంది ఉన్నాడు.

పారిశ్రామిక ప్రమాదాల నివారణకు చర్యలు


- ఉన్నతస్థాయి కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతను పెంచి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి వసుధా మిశ్రా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయించింది. ఇటీవల పారిశ్రామిక ప్రమాదాలు జరిగిన అనకాపల్లి జిల్లాలో వచ్చే వారం పర్యటించి, పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి స్థితిగతులను అంచనా వేయాలని నిర్ణయించింది. ఆ తర్వాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలను సందర్శించాలని కమిటీ ప్రతిపాదించింది. గురువారం అమరావతిలోని సచివాలయంలో చైర్‌పర్సన్ వసుధామిశ్రా అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వం తమ కమిటీకి అప్పగించిన పనిని గడువులోగా పూర్తి చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై సమావేశంలో చర్చించారు.

సొంత పత్రికకు 651 కోట్లు దోచిపెట్టిన జగన్: డోలా

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జగన్ తన ఐదేళ్ల పాలనలో రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని సొంత పత్రికకు దోచిపెట్టారని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. ఐదేళ్లలో తన పత్రికకు ప్రకటనలు, వలంటీర్ల ద్వారా పత్రిక కొనుగోలు కోసం రూ.651 కోట్లు ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి దుర్వినియోగం చేశారని విమర్శించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీపై నిందలు వేయడానికి, తన పత్రికలో ప్రకటనల కోసం ప్రజాధనాన్ని వెచ్చించారు. రూ.440 కోట్లు సొంత పత్రికకు ఇచ్చి, మిగతా పత్రికలు అన్నింటికీ కలిపి రూ.400 కోట్లు ఇచ్చారంటే జగన్‌కు ఎంత పక్షపాతమో అర్థం చేసుకోవాలి. అని మంత్రి విమర్శించారు.

ఏపీకి పెట్టుబడులొస్తే.. జగన్‌కు కడుపుమంట: సోమిరెడ్డి



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ అధికారం కోల్పోవడంతో రాజధాని అమరావతిపై విషం కక్కుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్ నాశనం కావాలని కోరుకుంటున్నాడని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు విజనరీని చూసి, అమరావతికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఏపీకి పెట్టుబడులు వస్తే.. జగన్‌కు కడుపుమంట. తన పాలనలో ఏపీకి రూపాయి పెట్టుబడి రాలేదు. అమరావతిని నాశనం చేయడమే వైసీపీ పంతంగా పెట్టుకుంది. జగన్ అమరావతి నుంచే పాలన చేసి, అమరావతి మునుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. కృష్ణానదికి రికార్డు స్థాయిలో వరద వచ్చినా అమరావతిలో చుక్కనీరు నిలవలేదు. వాన నీరు నిలబడితే వరదలో మునిగిందని తప్పుడు కథనాలు వండి వార్చారు. గత ఐదేళ్లలో నెల్లూరు జిల్లాను అడ్డగోలుగా దోచుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాపాల చిట్టాను ప్రభుత్వం, అధికారులు త్వరగా విప్పాలి' అని సోమిరెడ్డి కోరారు.

వైద్య కళాశాలలపై అశుద్ధ మీడియా విష ప్రచారం: కొలికపూడి

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలపై అశుద్ధ మీడియా దుష్ప్రచారం చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. కాలేజీల పేరు చెప్పి, నిధులు దారి మళ్లించిన జగన్‌రెడ్డి.. మెడికల్ కాలేజీల విషయంలో తప్పు చేయకపోతే.. విచారణకు సిద్ధమా అని సవాల్ చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "మెడికల్ కాలేజీల గురించి జగన్‌రెడ్డి పత్రిక, చానల్ విష ప్రచారం చేస్తున్నాయి. వైసీపీ పాలకులు చేసిన తప్పులు, దారుణాలను దాచిపెట్టి, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అంటూ కొలికపూడి మండిపడ్డారు.

జగన్ బేజారు!

- తెగిపడుతున్న ఫ్యాను రెక్కలు
- నిన్న బాలినేని.. నేడు ఉదయభాను
- రేపు గ్రంధి శ్రీనివాస్, శ్రీరంగనాథరాజు?
- ఒక్కొక్కరుగా వైసీపీకి గుడ్‌బై
- అధికార కూటమిలోకి చేరే యత్నాలు!
- వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులదీ అదే బాట
- వారిని ఆపలేక జగన్ విలవిల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో అధికారం కోల్పోయిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి వరుస షాకులు తగులుతున్నాయి. అత్యంత సన్నిహితులుగా మెలిగిన సీనియర్లే వైసీపీకి గుడ్‌బై చెప్పేస్తుండడం ఆయనకు మింగుడుపడడం లేదు. చివరకు ఆయన సమీప బంధువు, ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఇది జరిగి 24 గంటలు కాకముందే ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా గుడ్‌బై చెప్పేశారు. ఇదేదారిలో రేపో మాపో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా పార్టీ వీడుతున్నారని వైసీపీలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఈ జిల్లాకు చెందిన, జగన్‌కు ఆత్మీయుడైన మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్టీకే కాకుండా.. ఏకంగా రాజకీయాలకే గుడ్‌బై చెప్పారు. పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా టీడీపీ, జనసేనల్లో చేరిపోతున్నారు. ఇక మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు వైసీపీకి టాటా చెప్పేశారు. రాజ్యసభ సభ్యత్వాలకు కూడా రాజీనామా చేశారు. బాలినేని జగన్నే కలిసి ఇక ఉండలేనని చెప్పి వచ్చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి జనసేనలో చేరేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. ఉదయభాను కూడా పవన్‌తో సమావేశమై 22న ఆ పార్టీలో చేరతానని ప్రకటించారు. కీలక నేతలు చేజారకుండా జగన్ బుజ్జగిస్తున్నా వినిపించుకోవడం లేదు. వైసీపీలో కొనసాగితే భవిష్యత్ ఉండదన్న ఆలోచనలతోనే ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు.

ముఖం చాటేస్తున్న నేతలు..

సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఓటమిని దిగమింగుకోలేని ముఖ్య నేతలు ఆ తర్వాత వైసీపీ కార్యాలయం వైపే రావడం లేదు. నాయకత్వం రమ్మన్నా కొందరు ముఖం చాటేస్తున్నారు. 2016-17 నడుమ 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరారు. తనకు అధికారం లేకపోయినా ప్రతిపక్ష నేత హోదా ఉండడం.. పార్టీ నేతలెవరిపైనా కేసులు లేకపోవడంతో జగన్ ప్రశాంతంగా ఉన్నారు. కానీ 2019-24 మధ్య ఆయన ప్రభుత్వంలో కనివినీ ఎరుగని అక్రమాలు జరిగాయి. ఇసుక, మైనింగ్ రంగాల్లో పార్టీ నేతలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. నియోజకవర్గాల్లో దందాలు సాగించారు. ప్రశ్నించిన ప్రతిపక్షాల కార్యకర్తలపైన, ఎదురుతిరిగి మాట్లాడినవారిపైన తప్పుడు కేసులు బనాయించి వేధించారు. ఇది అటుంచి గత ఐదేళ్లలో సొంత ప్రజాప్రతినిధులనే జగన్ పట్టించుకోలేదు. తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. ఎక్కడికైనా వెళ్లినా పరదాల మాటున తిరిగారు. ఎమ్మెల్యేలను దగ్గరకు రానివ్వలేదు. దాని ప్రభావం ఓటమి తర్వాత ఆ పార్టీపై పడింది. ఇప్పుడు తాడేపల్లి నుంచి పిలుపు వస్తే చాలు.. ముఖం చాటేస్తున్నారు. ఏం చేయాలో పాలుపోక మాజీ సీఎం విలవిలలాడుతున్నారు.

27న ప్రపంచ
టూరిజం డే

- విజయవాడలో 38 విభాగాల్లో అవార్డుల ప్రదానం
- రాష్ట్రంలో 4 ఐకానిక్ టూరిజం హబ్‌ల ప్రతిపాదన
- గోదావరి జిల్లాల్లో అఖండ గోదావరి టూరిజం
- సంగమేశ్వరాలయం ప్రాజెక్టు అభివృద్ధి: మంత్రి కందుల



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక రంగానికి సంబంధించిన 38 విభాగాల్లో అవార్డులను అర్హులకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రదానం చేయనున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెంట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(శాసి) పథకం కింద నాలుగు ప్రాంతాల్లో ఐకానిక్ టూరిజం హబ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించాం. ఒకటి శ్రీశైలంలో టెంపుల్ టూరిజంతోపాటు టైగర్ రిజర్వు ఏరియా, వాటర్ ఫాల్స్ ప్రాంతాలను కలుపుకుని అభివృద్ధి చేస్తాం. రెండోది గోదావరి జిల్లాలోని ప్రాంతాలన్నీ కలుపుకుని అఖండ గోదావరి ప్రాజెక్టును అమలు చేయనున్నాం. మూడోది బాపట్ల బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేసి, సూర్యలంకలో రిసార్ట్స్ నిర్మిస్తాం. నాల్గోది నంద్యాలలోని సంగమేశ్వరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం. ఒక్కో ప్రాజెక్టుకు కనీసం రూ.100 కోట్లు అవుతుందని అంచనా. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శాసి, ప్రసాద్, స్వదేశీ దర్శన్ స్కీమ్‌ల కింద టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నాం. తిరుపతి, గండికోటల్లో ఒబెరాయ్ సంస్థ టూరిజం అభివృద్ధి చేస్తోంది. ఎడ్వంచర్ టూరిజంలో భాగంగా స్వదేశీ దర్శనం కింద అరకు, లంబసింగి, బొర్రా గుహలను పర్యాటకంగా తీర్చి దిద్దనున్నాం. అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. బ్లూఫాగ్ బీచ్‌గా రుషి కొండ బీచ్ అభివృద్ధికి అడుగులు వేస్తున్నాం. సాంస్కృతిక శాఖ ద్వారా నాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం. సంగీత నాట్య అకాడెమీ ఏర్పాటు చేస్తాం. నంది నాటకోత్సవాలపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నాం' అని తెలిపారు.

ఏపీకి పెట్టుబడులతో రండి

- ఆహార శుద్ధి రంగానికి ఉజ్వల భవిష్యత్
- 'వరల్డ్ ఫుడ్ ఇండియా'లో మంత్రి భరత్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో పరిశ్రమలు, ఆహార రంగానికి సంబంధించి దేశంలోనే అత్యుత్తమ విధానాలను రూపొందించే పనిలో ఉన్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి మంత్రి టీజీ భరత్ తెలిపారు. వ్యవసాయాధారిత ఆంధ్రప్రదేశ్‌లో ఆహార శుద్ధి రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలన్నారు. గురువారం ఇక్కడ భారత మండపంలో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌ను సందర్శించారు. స్టాల్స్‌లోని ఉత్పత్తులు పరిశీలించారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఆహారోత్పత్తి రంగంలో ఏపీ సాధిస్తున్న ప్రగతిని ప్రపంచానికి తెలియజేయాలని పెవిలియన్‌ను ఏర్పాటు చేశామన్నారు. వరి, మిర్చి, ఆక్వా సాగులో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు.

రైల్వే సహాయ మంత్రితో భేటీ

కర్నూలు నుంచి విజయవాడ జంక్షన్ వరకు రోజువారీ రైలు సర్వీసును ప్రవేశపెట్టాలని రైల్వే సహాయ మంత్రి వి.సోమణ్ణకు మంత్రి భరత్ విజ్ఞప్తి చేశారు. రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కర్నూలు జిల్లాలో అనేక వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయని, కర్నూలు నుంచి ముంబైకు వారంలో ఒకటి లేదా రెండుసార్లు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు.

పీఆర్ కమిషరేట్‌లో
సిబ్బంది చేతివాటం

- బదిలీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు లక్షలు వసూలు
- గ్రామీణాభివృద్ధి శాఖలో కూడా కదలని ఫైళ్లు
- కార్యాలయం చుట్టూ పడిగాపులు కాస్తున్న అధికారులు
- తిష్టవేసిన సిబ్బందితో తంటాలు పడుతున్న ఉద్యోగులు
- కొత్త కమిషనర్‌కు తలనొప్పిగా మారిన ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సుపరిపాలనకు వైసీపీ హయాంలో నియమించిన అధికారులు మోకాలొడ్డుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా యువ ఐఏఎస్‌ను కేరళ నుంచి డిప్యూటేషన్‌పై నియమించినా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులు, కొంత మంది సిబ్బంది ఫైళ్ల సక్రమంగా ముందుకు కదలకుండా అడ్డుకుంటున్నారు. డైరెక్టర్ కృష్ణతేజ ఫైల్ ప్రాసెస్ వేగవంతం చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ఎప్పటి నుంచో తిష్ట వేసిన అధికారులు ససేమిరా అంటున్నారు. ఓ వైపు బదిలీల ప్రక్రియ ఈ నెల 22తో ముగియాల్సి ఉంది. అయితే ఆ కసరత్తు పూర్తి చేసేందుకు కమిషనరేట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. బదిలీల ఫైళ్లను ప్రాసెస్ చేయించుకోవడం కోసం వచ్చిన అధికారుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. సచివాలయం సెక్షన్ అధికారులతో సంబంధాలు పెట్టుకున్న కమిషనరేట్ సిబ్బంది అవసరమైతే వారి చేతులు తడపని వారి ఫైల్‌ను సచివాలయంలో లాక్ చేసి లంచాలు భారీగా గుంజుకుంటున్నారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఓ అధికారి డ్వామా పీడీ పోస్టు కోసం ఆ జిల్లా మంత్రులతో సిఫారసు చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న పీఆర్ కమిషనరేట్‌లోని సిబ్బంది ఆ అధికారికి, డిప్యూటీ కమిషనర్‌ని అంటూ ఫోన్ చేసి రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. అయితే ఆ అధికారి అంత మొత్తంలో తాను చెల్లించలేనంటూ మొత్తుకున్నారు. అయినా వదలని ఆ అవినీతి జలగలు ముందుగా రూ.25 వేలు ఇవ్వాలంటూ ఖాతాలో వేయించుకున్నారు. ఆ తర్వాత ఆ అధికారి ఫోన్ చేసిన వ్యక్తి డిప్యూటీ కమిషనర్ కాదని తెలుసుకుని గట్టిగా మాట్లాడటంతో డబ్బులు వెనక్కి పంపినట్లు సమాచారం. ఇదే పరిస్థితి ఇంకో అధికారికి కూడా ఎదురయిందని తెలిసింది. పీఆర్‌లో సిబ్బంది వసూళ్లలో ఆరితేరి ఉంటే గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు, సిబ్బంది పరిస్థితి మరో రకంగా ఉంది. కమిషనరేట్‌లో తిష్ట వేసిన అధికారులు ఫైల్ ప్రాసెస్ విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎన్నిసార్లు బతిమిలాడుకున్నా.. నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడంతో కార్యాలయం చుట్టూ తిరగలేక అధికారులు, సిబ్బంది సతమతమవుతున్నారు. ఇటీవల నెల్లూరు డ్వామా పీడీ కార్యాలయంలో ఏపీడీగా ఉన్న ఓ అధికారి ఆ పోస్టు నుంచి రీపాట్రియేట్ అయ్యేందుకు 20 రోజులకు ముందు దరఖాస్తు చేసుకున్నారు. దానిని ప్రాసెస్ చేసేందుకు ఆ అధికారి కాళ్లరిగేలా తిరిగినా మోక్షం లభించలేదు. ఈ వ్యవహారంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన మండిపడినట్లు తెలుస్తోంది. కొత్త కమిషనర్‌కు ఇవన్నీ తలనొప్పిగా మారాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఈ నెల 22 నుంచి కమిషనరేట్‌లో అధికారులను, సిబ్బందికి స్థానం చలనం చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

పాఠశాల విద్యాశాఖ ఇక ఆన్‌లైన్

- ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్‌లోనే.. క్షేత్రస్థాయి నుంచి అమలుకు నిర్ణయం
- ప్రతి టీచర్‌కు లాగిన్ అవకాశం.. విద్యార్థుల సామర్థ్యాలూ అందులోనే
- యాప్‌లన్నీ రద్దుచేసి వెబ్‌సైట్‌లో టైల్స్ మూడు నెలల్లో అమల్లోకి..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉన్న విధానానికి మంగళం పలికి ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్‌లోకి మార్చనుంది. ప్రస్తుతం కమిషనర్ కార్యాలయం, సచివాలయం స్థాయిల్లోనే ఈ-ఆఫీసు విధానం అమల్లో ఉంది. ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోల స్థాయిలో మాన్యువల్ ఫైళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల పాఠశాల విద్యాశాఖలో డేటా సమీకరణ పెద్ద సమస్యగా మారింది. టీచర్ల బదిలీలు, అధికారుల బదిలీలు, పదోన్నతుల సమయంలో ప్రతిసారీ జిల్లాల నుంచి డేటాను తెప్పించుకుంటున్నారు. అంతే తప్ప సమగ్రంగా శాఖకు సంబంధించిన వివరాలన్నీ అందుబాటులో ఉండట్లేదు. అసలు ఎన్ని పోస్టులు ఉన్నాయి? వాటిలో ఖాళీలు ఎన్ని? అనే లెక్కల్లోనూ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పాఠశాల విద్యాశాఖలో ఐటీ సెల్ ప్రత్యేకంగా ఉన్నప్పటికీ పనితీరు సక్రమంగా లేదు. ఇటీవల సీబీఎస్ఈ విద్యార్థుల సంఖ్యనే ఐటీ సెల్ అధికారులు తప్పుగా చూపించారు. అలాగే, పదోన్నతుల సమయంలో కేసుల వివరాలు తెలియట్లేదు. పదోన్నతి ఇచ్చే ముందు ఎవరో ఒకరు వాటిపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇవన్నీ పాఠశాల విద్యాశాఖలో విధానాల అమలును ఆలస్యం చేస్తున్నాయి. వీటన్నిటికీ పరిష్కారం చూపేలా మొత్తం ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1.7 లక్షల మంది టీచర్లతో సహా అందరి వివరాలను ఆన్‌లైన్ చేయనున్నారు. ఇకపై ప్రతి టీచర్‌కు లాగిన్ అవకాశం కల్పిస్తారు. ఆయా టీచర్ల పరిధిలో ఉన్న విద్యార్థుల సామర్థ్యాల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో ఉంచుతారు. తద్వారా ఫలానా టీచర్ పరిధిలో విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారనేది పైస్థాయిలోనూ చూసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కేవలం ప్రధానోపాధ్యాయులకే పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ అవకాశం ఉంది. ఇకపై టీచర్లూ వారి వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.

యాప్‌లకు ఫుల్‌స్టాప్..

ప్రస్తుతం టీచర్లు పదికిపైగా వేర్వేరు యాప్‌లు వినియోగిస్తున్నారు. నాడు-నేడు, మధ్యాహ్న భోజనం, స్టూడెంట్ కిట్, దీక్ష, టాయిలెట్స్, పీఎంశ్రీ తదితర పదికిపైగా యాప్‌లు ఉన్నాయి. తరచూ విద్యాశాఖ వాటిని అప్‌డేట్ చేస్తోంది. కొన్ని యాప్‌లు అప్‌డేట్ చేయకపోతే పనిచేయట్లేదు. ఇకపై ఆ యాప్‌లన్నీ తొలగించి, వెబ్‌సైట్‌లో ఆ యాప్‌ల టైల్స్ ఏర్పాటుచేస్తారు. ఒక్కసారి లాగినైతే అన్ని పనులు అందులోనే చేసుకునే వీలు కల్పిస్తారు. దీంతో టీచర్లకు వేర్వేరుగా యాప్‌లు ఫోన్‌లో ఉంచుకోవాల్సి అవసరం ఉండదు.

చిటికెలో సమాచారం..

ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ జారీ కోసం సమాచారాన్ని తీసుకోవడం ఉన్నతాధికారులకు పెద్ద సమస్యలా కనిపించింది. డీఈవోల స్థాయిలోనూ సరైన సమాచారం లేకపోవడంతో తరచూ అంకెలు మారాయి. గత ప్రభుత్వంలోనూ డీఎస్సీ నోటిఫికేషన్ చర్చ వచ్చిన ప్రతిసారీ డేటా తీసుకునేవారు. ప్రతిసారీ గణాంకాలు మారాయి. వాస్తవ సమాచారం తెలుసుకోవడానికి కొన్ని రోజులు పడుతోంది. కొన్నిసార్లు చాలా ఆలస్యమవుతోంది. అందుకే సమాచారం మొత్తం ఎప్పుడైనా తెలుసుకునేలా డ్యాష్‌బోర్డు ఏర్పాటుచేయనున్నారు. సాధారణ సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచాలని భావిస్తున్నారు. ఇక సర్వీసు అంశాలు, వ్యక్తిగత అంశాల వివరాలను లాగిన్ అయి చూసుకునేలా వెసులుబాటు కల్పిస్తారు. అలాగే క్షేత్ర స్థాయి నుంచి ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే ప్రాసెస్ చేయాలనే నిబంధన పెట్టనున్నారు. మూడు నెలల కాలంలో మొత్తం శాఖను ఆన్‌లైన్‌లోకి మార్చాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ఆపరేషన్ బుడమేరుకు కార్యాచరణ రెడీ

- సీఎంకు నివేదించాక ప్రారంభిస్తాం: నిమ్మల
- ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష



అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ బుడమేరు'కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆయన ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సర్వే అధికారులతో ఈ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుకు నివేదిక అందించాక ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తామని తెలిపారు. విజయవాడలో 70 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వీటిలో 3,051 ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. వెలగలేరు నుంచి ఎనికేపాడు వరకు మొత్తం 13.25 కిలోమీటర్ల మేర బుడమేరు ఆక్రమణలకు గురైందన్నారు. చీమలవాగు, కేసరపల్లి, ఎనికేపాడు అండర్ టన్నెళ్ల (యూటీ) సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకూ 50.6 కిలోమీటర్ల కాలువ గట్టును ఎంత మేర ఎక్కడెక్కడ బలోపేతం చేయాలో ప్రణాళికలు రూపొందించాం. లైనింగ్ విస్తరణ పనులపైనా దృష్టిసారించాం. బుడమేరు పాత చానల్ నగరంలోని ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తోంది. దీనికి సమాంతరంగా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి పాముల కాలువ, ముస్తాబాద్ కెనాల్ మీదుగా ఎనికేపాడు కెనాల్‌ను విస్తరించడం ద్వారా బుడమేరుకు వచ్చే వరద నీటిని మళ్లించే అవకాశం ఉంది. ఈ ప్రాంతమంతా వ్యవసాయ భూములే. ఇక్కడ విస్తరణకు అవకాశాలున్నాయని గుర్తించాం' అని చెప్పారు. ప్రతి పదేళ్లకోసారి వరదలతో ముంచెత్తుతున్న బుడమేరుకు ఇక వరదలు రాకుండా చూస్తామన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు

- దీనికోసం త్వరలో మంత్రివర్గ ఉపసంఘం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సామాజిక భద్రత పింఛన్లు అందేలా చూసేందుకు త్వరలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర సెర్ప్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్త పెన్షన్లకు విధి విధానాల రూపకల్పన, అర్హత నిర్ధారించే అంశం, పాత పెన్షన్లపై కూడా మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెర్ప్‌పై మొదటి సమీక్షా సమావేశం సీఎం వద్ద జరిగిందని, రాష్ట్రంలో ఇంకా ఎవరైనా అర్హులకు పింఛన్లు అందకుంటే, వారిని కూడా పింఛన్ల పరిధిలోకి తీసుకురావాలని సీఎం సూచించారన్నారు. 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసే అంశంపైనా సమావేశంలో చర్చ జరిగిందన్నారు. రాష్ట్రంలో 50-60 ఏళ్ల మధ్య వయసున్న వారు దాదాపు 15 లక్షల మంది ఉన్నట్లు అంచనాకు వచ్చామని, వారికి పింఛన్ అందజేసే విధానంపై త్వరలో జరగబోయే సమావేశంలో మార్గదర్శకాలను ఖరారు చేసే అవకాశం ఉందని చెప్పారు. వడ్డీలేని రుణాలు, మహిళాశక్తి పథకాలపైనా సీఎం తగు ఆదేశాలను జారీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొందరు అనర్హులు సామాజిక పెన్షన్లు తీసుకుంటున్నార ని, ద్విచక్రవాహనాలు నడుపుతున్న వ్యక్తులు రూ.15 వేల దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నారని, అదే సమయంలో చాలా మందికి అర్హత ఉన్నా పింఛన్ రావడంలేదని చెప్పారు. దీనిపై ప్రజల నుంచి తమకు చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనర్హులు పింఛన్ పొందుతుంటే, వారిపై చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని చెప్పారు. గ్రామ స్థాయిలో నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు మండల కేంద్రాల్లో వర్చువల్ వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: సీపీఐ రామకృష్ణ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వరదల వల్ల నష్టపోయిన వారందరికీ పరిహారం అందించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద సహాయక నిధుల విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం ఆయన లేఖ రాశారు. 'వరదలు వచ్చిన వెంటనే సీఎం స్పందించిన తీరు అభినందనీయం. కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ వచ్చి వరద తీవ్రతను స్వయంగా పరిశీలించి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి సాయం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరద సాయాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలి" అని రామకృష్ణ తన లేఖలో పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

మొత్తం 232 పోస్టులు

సివిల్ ఇంజనీరింగ్



● గ్రూప్- ఎ సర్వీసెస్/పోస్టులు

1. సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్(సివిల్)
2. సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్(రోడ్స్), గ్రూప్-ఎ(సివిల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. సర్వే ఆఫ్ ఇండియా గ్రూప్- ఎ సర్వీస్
4. ఏఈఈ(సివిల్) ఇన్ బోర్డర్ రోడ్స్ ఇంజనీరింగ్ సర్వీస్
5. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్
6. ఏఈఈ(క్యూఎస్అండ్‌సి) ఇన్ ఎంఈఎస్ సర్వే ఆఫ్ క్యాడర్
7. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
8. సెంట్రల్ వాటర్ ఇంజనీరింగ్(గ్రూప్ ఎ) సర్వీస్

మెకానికల్ ఇంజనీరింగ్



● గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఇంజనీర్స్
2. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
4. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీసెస్/ఎస్ఎస్‌ఓ-2(మెకానికల్)
5. ఏఈఈ(ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్) ఇన్ బోర్డర్ రోడ్స్ ఇంజనీరింగ్ సర్వీస్
6. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
7. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్



● గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్
2. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
4. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీసెస్/ఎస్ఎస్‌ఓ-2(ఎలక్ట్రికల్)
5. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
6. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
7. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-1(ఐఈడీఎస్) ఎలక్ట్రికల్ ట్రేడ్
8. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-2(ఐఈడీఎస్) ఎలక్ట్రికల్ ట్రేడ్

ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్



● గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ గ్రూప్-ఎ
2. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ పోస్టులు)
3. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ పోస్టులు)
4. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికాం ఇంజనీరింగ్ పోస్టులు)
5. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీస్/ఎస్ఎస్‌ఓ-2
6. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
7. ఇండియన్ రేడియో రెగ్యులేటరీ సర్వీస్ గ్రూప్-ఎ
8. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-1(ఐఈడీఎస్) ఎలక్ట్రానిక్స్ ట్రేడ్
9. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-2(ఐఈడీఎస్) ఎలక్ట్రానిక్స్ ట్రేడ్


అర్హతలు: పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, బీఈ/బీటెక్ చదివి ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామినేషన్స్ ఎ, బి విభాగాలు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పార్ట్స్ 2, 3/సెక్షన్లు ఎ, బి అర్హత సాధించాలి. లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్(ఇండియా) గ్రాడ్యుయేట్ సభ్యత్వ పరీక్ష పాసై ఉండాలి. లేదా ఎమ్మెస్సీ(వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్, రేడియో ఫిజిక్స్, రేడియో ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2025 జనవరి 1 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి. అభ్యర్థులు ముందుగా పార్ట్-1, పార్ట్-2 అప్లికేషన్ పూర్తి చేయాలి.

ఎంపిక విధానం: స్టేజ్-1(ప్రిలిమినరీ/స్టేజ్-1) ఎగ్జామ్, స్టేజ్-2(మెయిన్/స్టేజ్-2) ఎగ్జామ్, స్టేజ్-3(పర్సనాలిటీ టెస్ట్), మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ/స్టేజ్-1: పరీక్షలో రెండు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నపత్రాలు ఉంటాయి. మొత్తం 500 మార్కులు(పేపర్-1 - 200 మార్కులు; పేపర్-2-300 మార్కులు) ఉంటాయి.



మెయిన్/స్టేజ్-2: ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు పేపర్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. మొత్తం 600 మార్కులు(ప్రతి పేపర్‌లో 300 మార్కులు) కేటాయించారు.

దరఖాస్తు ఫీజు: మహిళ/ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఇతరులు రూ.200 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 8

ప్రిలిమినరీ/స్టేజ్-1 పరీక్ష తేదీ: 2025 ఫిబ్రవరి 9

వెబ్‌సైట్: https://upsc.gov.in/

UPSC

ఐఐఎం రాయ్‌పూర్‌లో డిజిటల్ సైన్సెస్ కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) రాయ్‌పూర్, నాలుగో బ్యాచ్ డిజిటల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. తరగతులు నవంబరు మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. నిర్దిష్ట ప్రమాణాలు గల ప్రొఫెషనల్స్, గ్రాడ్యుయేట్లకు ఈ కోర్సులను ఉద్దేశించారు. అకాడమీ ఆఫ్ డిజిటల్ హెల్త్ సహకారంతో ఐఐఎం రాయ్‌పూర్ ఈ ప్రోగ్రామ్స్‌ని నిర్వహిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ టెలీ మెడిసిన్ అండ్ ఈ-హెల్త్, ద యురోపియన్ కనెక్టెడ్ హెల్త్ అలయెన్స్ సంస్థలు కోర్సులను గుర్తించాయి. ప్రవేశానికి రిజిస్ట్రేషన్స్ కొనసాగుతున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు iimraipur.ac.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్స్ వివరాలు

1. పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్(పీజీసీపీడీహెచ్)-వ్యవధి ఏడాది
2. డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్(డీపీడీహెచ్)-వ్యవధి ఏడాది.

అర్హత: పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లో చేరాలనుకునే వారు సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు రెండు సంవత్సరాల పని అనుభవం ఉండాలి. డాక్టర్స్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, హెల్త్‌కేర్ సెక్టార్‌లో పనిచేస్తున్న మేనేజర్లు, పారామెడిక్స్ అండ్ అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, హెల్త్ కేర్ ఐటీ ప్రొఫెషనల్స్, మెడ్-టెక్ ప్రొఫెషనల్స్, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, క్లినికల్ ఇన్ఫర్మాటిక్స్ ప్రొఫెషనల్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, అకడమీషియన్స్ అండ్ రీసెర్చర్స్, హెల్త్‌కేర్ కన్సల్టెంట్స్/అడ్వైజర్స్, హెల్త్ కేర్ పాలసీ మేకర్స్, పబ్లిక్ సెక్టార్ లీడర్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెడ్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్ హెడ్స్ ప్రవేశాలకు అర్హులు.

వయసు: 2024 ఫిబ్రవరి నాటికి 25 నిండి ఉన్న వారు డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొఫెషనల్ డిగ్రీలు ఉన్న అభ్యర్థులకు పై రెండు కోర్సుల్లో ప్రవేశానికి వయోనిబంధనల నుంచి సడలింపు లభిస్తుంది.

కరికులమ్

దీనిని మూడు విభాగాలుగా రూపొందించారు.

బేసిక్ లెవల్: థియోరటికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్.

అడ్వాన్స్‌డ్ లెవల్: టెక్నలాజికల్ అండ్ మేనేజ్‌మెంట్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్.

ప్రొఫెషనల్ లెవల్: అప్లికేషన్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్ విత్ ద యూజ్ ఆఫ్ కేసెస్. మెడికల్ అండ్ టెక్నాలజీస్ ఏరియాస్, టెలిమెడిసిన్, డేటా అనలిటిక్స్, డిజిటల్ హెల్త్ పాలసీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ వంటి కీలక అంశాలతో కరికులమ్‌ను రూపొందించారు.

రిలయన్స్ ఫౌండేషన్ యూజీ స్కాలర్‌షిప్

రిలయన్స్ ఫౌండేషన్-డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 5000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.రెండు లక్షలు ఇస్తారు. అభ్యర్థులు ఈ మొత్తాన్ని ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ల్యాప్‌టాప్ కొనుగోలు, అకడమిక్ బుక్స్ కొనుగోలు నిమిత్తం వినియోగించుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో మూడేళ్లు/అంతకన్నా ఎక్కువ వ్యవధిగల ఏదేని రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.15 లక్షలకు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. వివాహితులు కూడా అర్హులే.

- ఆన్‌లైన్/రిమోట్/డిస్టెన్స్/నాన్ రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో చేరినవారు; ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న వారు; విదేశాల్లో చదివినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఈ టెస్ట్‌ను ఒకసారి మాత్రమే రాయడానికి వీలుంది.

➡ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 6

➡ **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, డిగ్రీ అడ్మిషన్ లెటర్, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, వైకల్యానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం

➡ **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org

జాబ్ కార్నర్

ఈసీఐఎల్‌లో..

ఖాళీలు 437

అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)...కింద పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ - 162
2. ఎలక్ట్రీషియన్ - 70
3. ఫిట్టర్ - 70
4. మెకానిక్(ఆర్అండ్ ఏసీ)- 17
5. టర్నర్ - 17
6. మెషినిస్ట్ - 17
7. మెషినిస్ట్(గ్రైండర్) - 13
8. సీఓపీఏ - 45
9. వెల్డర్ - 22
10. పెయింటర్ - 4

వయోపరిమితి: 2024 అక్టోబరు 31 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

శిక్షణ కాలం: ఏడాది

ఎంపిక విధానం: ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం: ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

ధ్రువపత్రాల పరిశీలన తేదీలు: అక్టోబరు 7 నుంచి నవంబరు 9 వరకు

ప్రవేశానికి గడువు తేదీ: అక్టోబరు 30

అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభం: నవంబరు 1

వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

డీఆర్‌డీవో ఐటీఆర్‌లో...

ఖాళీలు 54

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)కు చెందిన ఒడిశా రాష్ట్రం చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)... వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(30)
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్(24)

విభాగాలు: మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎంబెడెడ్ సిస్టమ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్, సేఫ్టీ తదితరాలు.


అర్హత: ఖాళీలను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీబీఏ/బీకామ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

అప్రెంటిస్ కాలం: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9,000; డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,000.

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు 8

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: విశాఖపట్నం, ముంబయి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

చివరి తేదీ: అక్టోబరు 9

వెబ్‌సైట్: https://bel-india.in/

ఐఎస్ఐలో ఫ్యాకల్టీ

ఖాళీలు 24

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న టీచింగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రొఫెసర్
- అసోసియేట్ ప్రొఫెసర్
- అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1
- అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 45 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: అప్లికేషన్స్ స్క్రీనింగ్, ప్రజెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: దరఖాస్తులు డైరెక్టర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ 203 బి.టి రోడ్, కోల్‌కతా చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: అక్టోబరు 31

వెబ్‌సైట్: www.isical.ac.in/

చిట్టి


తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైన వాడు ఇంకా సహనవంతుడు కానీ చాలా దురాశా పరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథంఅనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిఇంది.ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటి లోపలి విలువైన వస్తువులు కాలి, బూడిదవుతున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం వ్యాపారానికి కావలసిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిద ఐతే ఎలా అని పెద్దపెట్టున ఏడవ సాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య రామనాథం గారూ మీ డబ్బు లోపలినుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను.కాఆనీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? అన్నాడు. దానికి సరే అన్నాడు రామనాథం. అపుడు క్రిష్ణయ్యఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి



డబ్బుమూట బయటకు తెచ్చాడుకానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాధానికి ఇచ్చి, మిగతాడబ్బు మొత్తం తన సంచీలో వేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అనిక్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం'అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.' క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున 'పెట్టు' అన్నాడు. అలాగే చేశాడు క్రిష్ణయ్య. ఇపడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబు చెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైన రామనాధానికి ఇస్తాను అని కదా అన్నావు? కాబట్టి మారు మాట్లాడకుండా ఆ డబ్బు మూట అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దాని కి క్రిష్ణయ్య నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం అన్నాడు దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈగొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి.. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో' అని హితవు చెప్పి, అతన్ని అక్కడినుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్త్ర జరిగిందని అందరూ అనుకున్నారు.

8 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 414

2					
		5		8	
1			6		9
	9			1	
4			7		2
8				3	

సుడోకు - 413 సమాధానం

1	3	7	4	5	9
4	9	5	6	8	2
2	6	8	3	7	1
3	8	2	1	9	5
5	7	9	8	6	4
6	1	4	2	3	[illegible]

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.